3 నెలల్లో శంకుస్థాపన

- ఆర్సెల్లార్, బిపిసిఎల్ ప్లాంట్లపై ఎస్ఐపిబిలో నిర్ణయం
- కొత్తగా రూ.44,776 కోట్లతో 15 ప్రాజెక్టులకు ఆమోదం
- సిఎం చంద్రబాబు వెల్లడి

2

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 179 | విజయవాడ, శుక్రవారం 31 జనవరి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 31 January 2025 | Rs

ఫైనల్ బెర్త్‌పై భారత్ గురి

- నేడు సెమీస్‌లో ఇంగ్లండ్‌తో ఢీ
- ఐసిసి అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్

8



రీగన్ విమానాశ్రయ సమీపంలోని పోటోమాక్ నదిలో సహాయక కార్యక్రమాలు నిర్వహిస్తున్న సిబ్బంది

గగనతలంలో ఘోరం!

- అమెరికాలో విమానం, సైనిక హెలికాప్టర్ ఢీ
- 67 మంది మృతి
- నదిలో పడిన శకలాలు

వాషింగ్టన్ : అమెరికా రాజధాని వాషింగ్టన్ డిసిలోని రీగన్ నేషనల్ ఎయిర్‌పోర్టుకు సమీపంలోని గనతలంలో బుధవారం రాత్రి అమెరికన్ ఎయిర్‌లైన్స్ విమానం, ఆర్మీ హెలికాప్టర్ ఢీకొని పక్కనే ఉన్న పోటోమాక్ నదిలో కూలి పోయాయి. విమానంలో ఉన్న 64 మంది ప్రయాణీకులు, మిలిటరీ హెలికాప్టర్‌లోని ముగ్గురు సైనికుల్లో ఏ ఒక్కరూ బతికి బయటపడే అవకాశం లేదని వాషింగ్టన్ ఫైర్ చీఫ్ జాన్ డోన్లీ తేల్చేశారు. ఇప్పటివరకు విమాన శకలాల నుంచి 27 మృతదేహాలను, హెలికాప్టర్ నుంచి ఒకరి మృతదేహాన్ని వెలికితీసినట్లు తెలిపారు. విమాన శకలాలు పడిన పోటోమాక్ నదిలో సహాయక చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. 64మందితో ప్రయాణిస్తున్న విమానం ఎయిర్‌పోర్టులో దిగడానికి సిద్ధమవుతుండగా అదే మార్గంలో వచ్చిన సైనిక హెలికాప్టర్ గాలిలోనే ఢీకొనడంతో పెళపెళమంటూ పెద్ద శబ్దంతో మండుతున్న అగ్నిగోళాల్లా రెండూ పక్కనే గల నదిలో పడిపోయాయి. స్థానిక కాలమానం ప్రకారం బుధవారం రాత్రి 9గంటల సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

పిఎస్ఎ ఎయిర్‌లైన్స్ బాంబర్‌డయర్ సిఆర్‌జె 700 రీజనల్ జెట్‌లైనర్ బుధవారం రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో సికోర్‌స్కీ హెచ్-60 హెలికాప్టర్ ఢీకొన్నాయి. ప్యాసింజర్ విమానం విమానాశ్రయంలోని రన్‌వే 33ను సమీపిస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదానికి గురైన హెలికాప్టర్ సైనిక బ్లాక్ హాక్ అని రక్షణ అధికారి తెలిపారు. ఘటనపై నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు విచారణ జరుపుతుంది. ప్రమాదంలో ప్రాణనష్టం జరిగిందని చెప్పిన అమెరికా సెనెటర్ టెడ్ క్రజ్... ఇతర వివరాలేవీ అందించలేదు. ప్రమాదంలో మరణించిన రష్యా పౌరుల కుటుంబాలకు క్రెమ్లిన్ సంతాపం తెలిపింది. ప్రమాద విమానంలో రష్యా ఐస్ స్కేటింగ్ కోచ్‌లు, ప్రపంచ మాజీ ఛాంపియన్లు ఎవ్‌జెనియా షిష్కోవా, వాదిమ్ నామోవ్ దంపతులు ప్రయాణిస్తున్నారు. ప్రమాదం జరగడానికి ముందు, ఆ తర్వాత చోటుచేసుకున్న దృశ్యాలను ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ ఆడియో మిగతా 7లో

ఇక వాట్సాప్ గవర్నెన్స్

- ప్రజలకు 360 సేవలు - తొలిదశలో 161
- ప్రారంభోత్సవంలో మంత్రి లోకేష్

వాట్సాప్ గవర్నెన్స్ సేవల ప్రారంభం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌తో మెటా సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 360 సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. తొలిదశలో 161 సేవలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. ఉండవల్లిలోని తన నివాసంలో వాట్సాప్ గవర్నెన్స్ సేవలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. బటన్ నొక్కితే ప్రభుత్వం ఎందుకు ప్రజలు వద్దకు రాదనే ప్రశ్న తాను నిర్వహించిన యువగళం పాదయాత్ర సమయంలో ఉత్పన్నమైందని అన్నారు. అందులో భాగంగానే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. 'మనమిత్ర' 'ప్రజల చేతిలోని ప్రభుత్వం, ప్రజల చేతిలో పాలన, మాది ప్రజా ప్రభుత్వం' నినాదంతో ఈ సేవలను ప్రారంభించామని చెప్పారు. 9552300009 నెంబర్ ద్వారా వాట్సాప్‌లో అన్ని సేవలనూ ఉచితంగా పొందవచ్చని తెలిపారు. అందించే సేవల్లో 80 శాతం రియల్‌టైం గవర్నెన్స్‌లో పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం, ప్రజల మధ్య వారధి వాట్సాప్ గవర్నెన్స్ అని మిగతా 7లో

సెలవుపై వెళ్లిన ప్రవీణ్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గనులశాఖ కార్యదర్శి, ఎపి ఎమ్‌డిసి డైరెక్టర్ ప్రవీణ్ కుమార్ సెలవుపై వెళ్లారు. ఈ నెల 29 నుంచి ఫిబ్రవరి 14 వరకూ ఆయన సెలవుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. వైసిపి నేతకు కడప జిల్లా వేముల గ్రామంలో బైరైటీస్ గనులు కేటాయింపునకు అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులివ్వడాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఈ చర్య గనులశాఖలో తీవ్ర కలకలం రేపింది. అనుమతులపై ఇప్పటికే విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ప్రవీణ్ కుమార్ సెలవుపై వెళ్లడంతో గనులశాఖ ముఖ్యకార్యదర్శి ముకేష్ కుమార్ మీనాకు గనుల శాఖ కార్యదర్శిగా, ఎపి ఎమ్‌డిసి డైరెక్టర్‌గా పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

వాడిగా వేడిగా పార్లమెంటు

- నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు
- రేపు నిర్మలమ్మ పద్దు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు శుక్రవారం నుంచి వాడిగా వేడిగా జరగనున్నాయి. రైతుల సమస్యలు, అధిక ధరలు, నిరుద్యోగం, కుంభమేళాలో తొక్కిసలాట వంటి అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రతిపక్షాలు అస్త్ర శస్త్రాలతో సిద్ధమయ్యాయి. మరో వైపు ప్రభుత్వం వివాదాస్పద వక్ఫ్ బిల్లును ఈ సమావేశాల్లోనే ఆమోదింపజేసుకోవాలని చూస్తోంది. ఈ బిల్లును ప్రతిపక్షాలు ఇప్పటికే తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. జెపిసిలో తమ అసమ్మతిని తెలియజేశాయి. ఆనవాయితీ ప్రకారం బడ్జెట్ సమావేశాల ప్రారంభ రోజున రాష్ట్రపతి పార్లమెంటు ఉభయసభల సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం ఆర్థిక సర్వేను పార్లమెంటు ముందుంచనున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సాధారణ బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం పార్లమెంటులో ప్రవేశపెడతారు. బడ్జెట్ సమావేశాలు ప్రతి సారి లాగానే రెండు విడతలుగా జరుగుతాయి. జనవరి 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు మొదటి విడత, సమావేశాలు జరుగుతాయి. ఫిబ్రవరి 14 నుండి మార్చి 9 వరకు పార్లమెంటుకు విరామం ఇస్తారు. రెండవ విడత మిగతా 7లో

సంక్షేమంతోనే అభివృద్ధి సాధ్యం

- సిపిఎం స్వతంత్ర శక్తిగా ఎదుగుతోంది
- మహాసభకు ప్రజల నుంచి అపూర్వ స్పందన : వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- నెల్లూరు

ప్రజా సంక్షేమంతోనే అభివృద్ధి సాధ్యమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. గురువారం ఆయన నెల్లూరులోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో మీడియాతో మాట్లాడారు. నెల్లూరులో ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో నిర్వహిస్తున్న సిపిఎం రాష్ట్ర 27వ మహాసభలో పార్టీని రాజకీయశక్తిగా బలోపేతం చేసేందుకు ప్రతినిధినిధులతో నిర్మాణాత్మకంగా, సంస్థాగతంగా సుదీర్ఘ చర్చించనున్నట్లు తెలిపారు. ప్రత్యామ్నాయ విధానాలపై చర్చించబోతున్నామని చెప్పారు. మహాసభ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఐదు ప్రాంతాల్లో మేధావులతో సదస్సులు, చర్చలు నిర్వహించి వారి అభిప్రాయాలు తీసుకున్నామని తెలిపారు. వాటి ఆధారంగా ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపొందించుకుంటామని చెప్పారు. ఆ ప్రాతికపదిన వామపక్ష పార్టీలను, ప్రజాతంత్రవాదులను, అభ్యుదయ శక్తులను లౌకికవాదులను, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తున్న వారందరిని కలుపుకొని ఒక విశాల వేదిక ద్వారా ఐక్య ఉద్యమాలకు ఈ మహాసభ పిలుపునిస్తుందని తెలిపారు. విజన్ 2020 నాటి విధానాలకు కాలం చెల్లిందని, ప్రపంచం మారిపోతోందని, ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మారుతున్న పరిస్థితిని గమనించి తమ విధానాలు మార్చుకోవాలని అన్నారు. సరళీకరణ విధానాలకు స్వస్తి చెప్పాలని డిమాండ్ చేశారు. సంక్షేమం, అభివృద్ధి రెండు ఒకదానికి మరొకటి సపోర్టని, ఈ రెండూ వేర్వేరు కాదని వివరించారు. ఈ రెండింటికీ పోటీ పెట్టి అభివృద్ధి జరగాలంటే సంక్షేమం వదులుకోవాలని చెప్పడం ప్రజలను తప్పుదారి పట్టించడమేనని తెలిపారు. సంక్షేమం ద్వారానే అభివృద్ధి జరుగుతుందని, సంక్షేమం అంటే పథకాలు అమలు చేయడం ఒక్కటే కాదని, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం, కార్మికులకు కనీస వేతనం అమలు చేయడం, చదువుకున్న వారికి ఉద్యోగావకాశాలు కల్పించడం, సంక్షేమం అంటే ప్రజల ఆదాయాలు, వారి జీవన ప్రమాణాలు పెరగడమని వివరించారు. ప్రజల ఆదాయం పెరగకుండా అభివృద్ధి సాధ్యం కాదని తెలిపారు. అమెరికాలోని భారతీయుల ఉపాధి, భద్రతకు ప్రధాని మంత్రి ఏమి చేయబోతున్నారో చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. 1978లో ఎమర్జెన్సీ అనంతరం నెల్లూరులో సిపిఎం రాష్ట్ర 13వ మహాసభ విజయవంతంగా మిగతా 7లో

సంజయ్‌కు ముందస్తు బెయిల్

ప్రజాశక్తి-అమరావతి

అవినీతి నిరోధకశాఖ (ఎసిబి) పెట్టిన కేసులో గతంలో సిఐడి అదనపు డైరెక్టర్ జనరల్‌గా, అగ్నిమాపకశాఖ డైరెక్టర్ జనరల్ ఎన్ సంజయ్‌కు హైకోర్టు గురువారం ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. రూ.25 వేలతో రెండు పూచీకత్తులు సమర్పించాలని, దర్యాప్తునకు సహకరించాలని, అవసరమైనప్పుడు దర్యాప్తు సంస్థ ముందు హాజరు కావాలని, సాక్షులను ప్రలోభపెట్టడం, బెదిరించడం వంటివి చేయకూడదని జస్టిస్ కె శ్రీనివాసరెడ్డి తీర్పు చెప్పారు. గత ప్రభుత్వంలో సంజయ్, రూ.1.75 కోట్ల మేర నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని పేర్కొంటూ ఎసిబి గత నెల 24న నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలనే పిటిషన్‌లో తీర్పు చెప్పారు. ఐపిఎస్ అధికారిగా వివిధ హోదాల్లో పనిచేసినందున పారిపోయేందుకు ఆస్కారం లేదన్నారు. సంజయ్‌పై నమోదుచేసిన కేసుకు సంబంధించి ఆధారాలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌శాఖ సీజ్ చేసిందని, వాటిని ఎసిబికి అందజేసిందని గుర్తుచేశారు. సస్పెన్షన్‌లో ఉన్నందున వాటిని తారుమారు చేసేందుకు వీలుండదని చెప్పారు.

'సెకి' ఒప్పందాలు రద్దు చేయాల్సిందే

- సూపర్ సిక్స్ అమలు కాకుంటే శంకరగిరి మాన్యాలే
- సిపిఎం ప్రచార జాత ప్రారంభోత్సవంలో ఎంఎ గఫూర్

జీపు జాతాను ప్రారంభిస్తున్న ఎంఎ.గఫూర్

ప్రజాశక్తి- నంద్యాల కలెక్టరేట్

సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాతో (సెకి) రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేసుకోవాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ.గఫూర్ డిమాండ్ చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుంటే ప్రజలు శంకరగిరిమాన్యం పట్టిస్తారని హెచ్చరించారు. సెకి ఒప్పందాలను రద్దు చేయాలని, అదాని ముడుపులపై న్యాయ విచారణ జరపాలని, ట్రూ అప్ ఛార్జీలు, ఇంధన సర్దుబాటు ఛార్జీలలను రద్దు చేయాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించాలని కోరుతూ నంద్యాలలో ప్రచార జీపు జాతాను గురువారం ఆయన ప్రారంభించారు. నెల్లూరులో ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో జరగనున్న సిపిఎం రాష్ట్ర మహాసభ సందర్భంగా చేపట్టిన ఈ జాతాలో గఫూర్ మాట్లాడుతూ విజన్ 2047 అంటూ కలల రాజ్యంలో చంద్రబాబు విహరిస్తున్నారన్నారు వైసిపి ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రద్దు చేస్తామన్నామని ఆ పార్టీల నాయకులు గత ఎన్నికల ముందు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక టిడిపి కూటమి ప్రభుత్వం ఒప్పందాలను రద్దు చేయకపోగా విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజలపై భారాలు మోతోందని వివరించారు. సెకి ఒప్పందాన్ని రద్దు చేస్తే తన సీటు కింద ప్రధాని నరేంద్ర మోడీ సెగ పెడతారని చంద్రబాబు భయపడుతున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రజలు కోరుతుంటే, ఇప్పుడే అమలు చేయడం కష్టమని చెపుతున్న టిడిపి కూటమి నాయకులు... అమరావతికి, అసెంబ్లీకి, హైకోర్టుకు రూ.69 వేల కోట్లు ఎక్కడి నుంచి తెచ్చి ఖర్చు చేస్తున్నారని ప్రశ్నించారు. యువతకు నిరుద్యోగ భృతి కల్పించాలని, ఉద్యోగుల, కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేకుంటే బాధితులు టిడిపి కూటమి ప్రభుత్వాన్ని రోడ్డుపైకి ఈడుస్తారని హెచ్చరించారు. టిడిపి, జనసేన నాయకులు ప్రజాసమస్యలను గాలికొదిలేశారని, లోకేష్‌ను డిప్యూటీ సిఎం చేయాలని టిడిపి నాయకులు, పవన్ కల్యాణ్‌ను మిగతా 7లో

ఏడాదిలోగా 'ఉక్కు' పునరుద్ధరణ

- కేంద్ర మంత్రి హెచ్‌డి కుమారస్వామి
- సొంత గనులు, సెయిల్‌లో విలీనం ఊసే లేదు

మాట్లాడుతున్న కుమారస్వామి

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ స్టీల్‌ప్లాంట్ ఏడాదిలోగా పునరుద్ధరణ పొందేలా కేంద్రం నుంచి సహకారం అందిస్తామని కేంద్ర ఉక్కు, గనుల శాఖ మంత్రి హెచ్‌డి.కుమారస్వామి అన్నారు. 'కేంద్ర ప్రభుత్వం గతంలో పెట్టుబడుల ఉపసంహరణకు ఒకసారి డిజైన్ చేసి కేబినెట్ ఆమోదిస్తే ఆ నిర్ణయాన్ని ఇంతవరకూ ఎప్పుడూ వెనక్కి తీసుకోలేదు. ఎందుకంటే, కేంద్ర ప్రభుత్వ విధానమే ప్రభుత్వ రంగం నుంచి పెట్టుబడులను ఉపసంహరించడం. కానీ, ఆర్ఐఎన్ఎల్ విషయంలో 'రివర్స్' చేశాం. మోడీ నాయకత్వంలో ఇది జరిగింది. అంతేకాదు రివైవల్ (పునరుజ్జీవం) చేసేందుకు ఏడాదిలోగా కృషి చేస్తాం' అని ఆయన వివరించారు. గురువారం విశాఖ పర్యటనకు విచ్చేసిన కుమారస్వామి కేంద్ర ఉక్కు సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ... ఉక్కు పరిశ్రమ సిఎమ్‌డి, డైరెక్టర్లు ఎంపీలు శ్రీభరత్, సిఎం రమేష్, స్థానిక విశాఖ ఎమ్మెల్యేలు పాల్గొన్న సమావేశంలో స్టీల్‌ప్లాంట్‌పై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా పలు విషయాలను వెల్లడించారు. అయితే, ఈ సమీక్షలో ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేస్తామనిగానీ, సొంత గనులిస్తామన్న అంశంపైగానీ ఆయన చెప్పలేదు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కోరినా మంత్రి హామీ ఇవ్వలేదు. దీంతో, ప్యాకేజీలతోనే ఎలా రివైవ్ చేస్తారన్న ఆందోళన కార్మికుల్లో నెలకొంది.

నేను విజయం సాధించాను..

కేంద్ర కేబినెట్ సహా మంత్రిత్వ శాఖలోని పలువురు ఉన్నతాధికారులంతా వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను రివైవ్ చేయడం సాధ్యం కాదని చెప్పినట్టు కుమారస్వామి తెలిపారు. కానీ, ఆర్ఐఎన్ఎల్‌లో చిన్న కార్మికుడు నుంచి ఎగ్జిక్యూటివ్ వరకూ ప్లాంట్ నిలదొక్కుకోవడానికి పోరాడుతున్న విషయం తాను గుర్తించానన్నారు. భూములు త్యాగం చేసిన చరిత్ర వారిదని చెప్పానని తెలిపారు. జీతాల్లేకపోయినా పట్టుదలగా పోరాడడమే ప్లాంట్‌కు బలమని కొనియాడారు. తాను మొదటి సమావేశం గత ఏడాది విశాఖలో నిర్వహించినప్పుడు అన్ని విషయాలూ తెలుసుకుని సరిదిద్దేందుకు ప్రయత్నించానన్నారు. తొలుత కేంద్ర ఆర్థిక మంత్రిని రూ.17 వేల కోట్లు కోరామన్నారు. తాజాగా రూ.11,400 కోట్లు సాధించామని, అంతకు ముందు రూ.1,600 కోట్లు తెచ్చామని తెలిపారు. మూడు నెలల తర్వాత పూర్తి జీతాలిచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

జులైలో బ్లాస్ట్ ఫర్నేస్ 3 ప్రారంభం

ఈ ఏడాది జులైలో బ్లాస్ట్ ఫర్నేస్ 3ని ప్రారంభించడం ద్వారా ఉత్పత్తిని అధికం చేసే ప్రణాళికను రూపొందించామన్నారు. దేశంలోనే నెంబర్-1 స్థానంలోకి వైజాగ్ స్టీల్‌ను తీసుకెళ్లాలని కోరారు. గతంలో మూడు మిలియన్ టన్నులకు రూ.1300 కోట్లు లాభం వచ్చిందని, ఆ తర్వాత నవరత్న హోదా లభించిందని అన్నారు. ప్లాంట్‌లో ఉత్పత్తి విస్తరణ సమయంలో 2015-16లో 6.3 మిలియన్ టన్నులకు వెళుతూ బ్యాంకు రుణానికి వెళ్లినప్పుడు ప్లాంట్‌ను సమస్యలు చుట్టుముట్టాయని చెప్పారు. 2016లో ఏడు మిలియన్ టన్నులకు వెళ్లినప్పుడు రా మెటీరియల్ లేకుండా, సొంత గనుల్లేకుండా ముందుకెళ్లినప్పుడు ప్లాంట్ నష్టాలపాలైందని పేర్కొన్నారు. ప్రభుత్వం తప్పు దానిలో ఉందన్నారు.

ఉర్దూ పాఠశాలలను విలీనం చేయొద్దు

- ఆవాజ్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉర్దూ పాఠశాలలను తెలుగు మీడియం పాఠశాలల్లో విలీనం చేయొద్దని ఆవాజ్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాలతో కనీసం చర్చించకుండా ఉర్దూ పాఠశాలల విలీనానికి విద్యాశాఖ అధికారులు కసరత్తు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు కన్వీనర్ ఎంఎ చిస్టీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉర్దూ భాషను నిర్వీర్యం చేసే దిశగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని పేర్కొన్నారు. ఉర్దూను పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఉర్దూ మీడియంలోనే మోడల్ ప్రైమరీ పాఠశాలలను ఏర్పాటు చేయాలని, తెలుగు మీడియం పాఠశాలల్లో ఉర్దూ సెక్షన్‌గా ఉన్న పోస్టులను కొనసాగించాలన్నారు.

చండీగఢ్ విద్యుత్ ఉద్యోగులపై ఎస్మా

- సిపిఎం ఖండన
- ప్రైవేటీకరణలో భారీ అవినీతి : ఎఐకెఎస్

చండీగఢ్ : సమ్మె చేస్తున్న చండీగఢ్ విద్యుత్‌శాఖ ఉద్యోగులపై హర్యానా అత్యవసర సేవల (నిర్వహణ) చట్టం - ఎస్మాను ప్రభుత్వం ప్రయోగించింది. ఈ చర్యను సిపిఎం తీవ్రంగా ఖండించింది. ఎస్మాను తక్షణమే ఎత్తివేయాలని, ప్రైవేటీకరణను ఆపాలని డిమాండ్ చేసింది. కేంద్రపాలిత ప్రాంతమైన చండీగఢ్ ప్రభుత్వ పరిధిలోని విద్యుత్ పంపిణీ విభాగాన్ని ప్రైవేటు రంగంలోని ఎమినెంట్ ఎలక్ట్రిసిటీ డిస్ట్రిబ్యూషన్ లిమిటెడ్ (ఇఇడిఎల్)కు ఫిబ్రవరి మొదటి వారంలో అప్పగించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి వ్యతిరేకంగా సాగుతున్న ఎలక్ట్రిసిటీ ఉద్యోగులు గత యాభై రోజులుగా కొనసాగిస్తున్న సమ్మెను అణచివేసేందుకు ఎస్మాను ప్రయోగించింది. రూ.250 కోట్ల వార్షిక లాభం ఉన్న సంస్థను రూ.174.63 కోట్లకు వేలం వేశారు. దీనిలో భారీ అవినీతి చోటుచేసుకుందని కార్మిక, రైతు సంఘాలు విమర్శిస్తున్నాయి.

ప్రైవేటు కంపెనీకి తమ విభాగం బదిలీ అయిన రోజు నుండే తాము విధులను బహిష్కరిస్తామని యుటి పవర్‌మెన్ యూనియన్ హెచ్చరించింది. యూనియన్ ప్రధాన కార్యదర్శి గోపాల్ దత్ జోషి మాట్లాడుతూ, ప్రైవేటు కంపెనీకి బదలాయించబడే ఉద్యోగులకు ఎలాంటి విధానం ప్రకటించకుండా, వారికి ఒక అవకాశం ఇవ్వకుండా ఏకపక్షంగా ఈ చర్య చేపట్టారని విమర్శించారు. అత్యధిక లాభాలనార్జించే, సమర్థవంతమైన, తక్కువ టారిఫ్‌లు గల ఈ విద్యుత్ సంస్థను ప్రైవేటీకరించడానికి ప్రభుత్వం పూనుకోవడంపై చండీగఢ్ అంతటా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. చండీగఢ్ విద్యుత్ ఉద్యోగులపై విధించిన ఎస్మాను తక్షణమే ఎత్తివేయాలని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) డిమాండ్ చేసింది.

3 నెలల్లో శంకుస్థాపన

- ఆర్సెల్లార్, బిపిసిఎల్ ప్లాంట్లపై ఎస్ఐపిబిలో నిర్ణయం
- కొత్తగా రూ.44,776 కోట్లతో 15 ప్రాజెక్టులకు ఆమోదం
- దావోస్‌లో ఆసక్తి చూపిన కంపెనీలతో సంప్రదింపులు
- పర్యాటక ప్రాజెక్టుల్లో 20 శాతం వృద్ధి ఉండాలి : సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ఏర్పాటు చేయనున్న ఆర్సెల్లార్ మిట్టల్, బిపిసిఎల్ ప్రాజెక్టులకు మూడు నెలల్లో శంకుస్థాపన చేయించేలా చూడాలని స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డులో నిర్ణయించారు. దీనికోసం వెంటనే సంస్థలతో సంప్రదింపులు జరపాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. సిఎం అధ్యక్షతన వెలగపూడి సచివాలయంలో ఎస్ఐపిబి సమావేశం గురువారం జరిగింది. ఏడు నెలల కాలంలో మొత్తం మూడుసార్లు ఈ సమావేశం నిర్వహించారు. కొత్తగా 15 ప్రాజెక్టులకు సంబంధించి రూ.44,776 కోట్ల విలువైన పెట్టుబడులకు ఆమోదం తెలిపారు. దీనిపై సిఎం చంద్రబాబు మాట్లాడుతూ.. రూ.1.36 లక్షల కోట్లతో ఆర్సెల్లార్ మిట్టల్, రూ.96 వేలకోట్లతో బిపిసిఎల్ ప్లాంట్లు పెట్టనున్నాయని, వీటిని వెంటనే గ్రౌండ్ అయ్యేలా చూడాలని అధికారులకు సూచించారు. రూ.10 కోట్లకుపైబడి పెట్టుబడి పెట్టే ప్రతి ప్రాజెక్టు పురోగతిని తప్పనిసరిగా ట్రాకింగ్ చేయాలన్నారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల్లో పెట్టుబడులకు సంబంధించి పరిశ్రమల యాజమాన్యంతో నిరంతరం చర్చలు జరపాలని, సాధ్యమైనంత త్వరగా ప్రాజెక్టులకు వచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. తీవ్రమైన పోటీ నెలకొన్న నేటి పరిస్థితుల్లో ఫలితాలు రావాలంటే స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేసి చూపాలని ఆదేశించారు. రాష్ట్రస్థాయిలో అనుమతులు, క్షేత్రస్థాయిలో పనులపై కలెక్టర్లతో సమీక్ష జరపాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సూచించారు. పెట్టుబడులపై దిగ్గజ సంస్థలు, జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తల నుండి వస్తున్న స్పందన సంతృప్తికరంగా ఉందని అన్నారు. దావోస్ పర్యటనలో ఎపిలో పెట్టుబడులకు ఆసక్తి చూపిన దుబాయ్‌కు చెందిన డిపి వరల్డ్, డెన్మార్క్‌కు చెందిన ఎపి ముల్లర్-మార్క్స్ వంటి సంస్థలతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. పర్యాటక ప్రాజెక్టులపై దృష్టి సారించాలని, దీనిలో 20 శాతం వృద్ధి సాధించాలని ఆదేశించారు.

కొత్తగా అనుమతించిన ప్రాజెక్టులు

అల్లూరి సీతారామరాజు జిల్లా గుజ్జిలిలో నవయుగ ఇంజినీరింగ్ కంపెనీ 1500 మెగావాట్లు, చిత్తవలసలో 800 మెగావాట్లతో ప్లాంట్లను ఏర్పాటు చేయనుంది. దీనికి రూ.14,328 కోట్లు పెట్టుబడి పెట్టనున్నారు. అన్నమయ్య జిల్లా కొమ్మూరులో మేఘా ఇంజినీరింగ్ కంపెనీ రూ.10,300 కోట్లతో పంప్డ్ స్టోరేజీ యూనిట్ ఏర్పాటు చేయనుంది. అదే జిల్లా యాస్పరిలో యాస్పరి రెన్యూవబుల్ ఎనర్జీ ప్రైవేటు లిమిటెడ్ 118 మెగావాట్ల విండ్ పవర్ ప్లాంటుకు అనుమతినిచ్చారు. అనంతపురంలో 178 మెగావాట్లు, కడపలో 231 మెగావాట్ల ప్లాంట్లకు అనుమతినిచ్చారు. అలాగే ఎకోరెన్, ఆయాన్ పవర్, అంపిన్ ఎనర్జీ, ఎస్ఎఇఎల్, టాటా పవర్, ఎన్ఎస్ఎల్, కోరమండల్, కొప్పర్తిలో అలీప్ ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో పెట్టుబడులకు ఆమోదం తెలిపారు.

గాంధీజీకి సిఎం ఘన నివాళి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా సిఎం చంద్రబాబు ఘన నివాళి అర్పించారు. ఉండవల్లిలోని తన నివాసంలో గురువారం గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయనతోపాటు మంత్రి నారా లోకేష్ ఉన్నారు.

5న కలెక్టరేట్ల ముందు నిరసన

- ఫీజుపోరు పోస్టర్ ఆవిష్కరణలో వైసిపి నాయకులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేస్తోందని, రూ.3,900 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించడం లేదని వైసిపి నాయకులు విమర్శించారు. వైసిపి ఆధ్వర్యాన ఫిబ్రవరి 5న నిర్వహించనున్న ఫీజుపోరు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఉదయం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో నాయకులు అంబటి రాంబాబు, జోగి రమేష్, వెలంపల్లి శ్రీనివాస్, లేళ్ల అప్పిరెడ్డి తదితరులు ఆవిష్కరించారు. మాజీ మంత్రి అంబటి మాట్లాడుతూ.. 5న విద్యార్థుల తల్లిదండ్రులు, వైసిపి నాయకులు కలెక్టరేట్‌కు వెళ్లి వినతిపత్రాలు ఇస్తారని తెలిపారు. రూ.2,800 కోట్లు వసతిదీవెన, రూ.1,100 కోట్లు స్కాలర్‌షిప్ బకాయిలు ఉన్నాయన్నారు. ఫీజు రాకపోవడంతో కళాశాలల యాజమాన్యం పిల్లలను తరగతులకు రానివ్వడం లేదని పేర్కొన్నారు. కొన్నిచోట్ల సర్టిఫికెట్లు కూడా ఇవ్వడం లేదన్నారు. ఫీజు ఎగ్గొట్టేందుకు కూటమి ప్రభుత్వం దిగజారుడు రాజకీయాలు చేస్తోందని ఆగ్రహించారు. జోగి రమేష్ మాట్లాడుతూ.. విద్యార్థులను చాలాచోట్ల గేటుబయట నిలబెడుతున్నారని అన్నారు. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. రాజశేఖర్‌రెడ్డి ఏర్పాటు చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం చాలా రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యాలయ కార్యదర్శులు ఎ నారాయణమూర్తి, మస్తాన్‌వలీ, కాకుమాను రాజశేఖర్, పానుగంటి చైతన్య, రవిచంద్ర, కనకారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.
అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

హోదాపై కేంద్రాన్ని నిలదీయండి

- సిఎం చంద్రబాబుకు షర్మిల లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం పట్టుబట్టాలని కూటమి ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సిఎం చంద్రబాబుకు ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల గురువారం లేఖ రాశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోతే కేంద్రానికి ఇస్తున్న మద్దతు ఉపసంహరించుకోవాలని కోరారు. హోదా ఇస్తే కేంద్రమే 30 శాతం అదనపు నిధులు రాష్ట్రానికి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. టిడిపి ఎంపిల మద్దతుతో అధికారాన్ని అనుభవిస్తున్న మోడీ.. రాష్ట్ర విభజన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ నెల 31న జరగనున్న పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో టిడిపి ఎంపిలు హోదాపై తమ గళాన్ని విప్పాలని కోరారు.

వక్ఫ్ బోర్డుకు బకాయిలు ఇప్పించండి

- సిఎంను కోరిన ఛైర్మన్ అజీజ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలంగాణ వక్ఫ్ బోర్డు నుంచి ఎపి వక్ఫ్ బోర్డుకు రావాల్సిన రూ.50 కోట్ల పెండింగ్ బకాయిలను ఇప్పించాల్సిందిగా సిఎం చంద్రబాబును ఎపి వక్ఫ్ బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ కోరారు. సచివాలయంలో సిఎంను అజీజ్ గురువారం కలిసి పలు సమస్యలను వివరించారు. ఎపి వక్ఫ్ బోర్డుకు చెందిన అన్ని రికార్డులు (డిజిటల్ రికార్డులతో సహా) తెలంగాణ బదిలీ చేయలేదని, ఆస్తులను అప్పగించలేదని తెలిపారు. పలు వ్యాజ్యాలకు సంబంధించి ఫైల్స్ అక్కడే ఉన్నాయని సిఎం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కౌంటర్ దాఖలు చేయలేకపోతున్నామన్నారు. అదేవిధంగా ఆదాయం లేని 1,500 మసీదుల పెండింగ్ దరఖాస్తులను, మసీదుల అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.10 కోట్లు, వక్ఫ్ ఆస్తుల రక్షణ చర్యలకు రూ.50 కోట్లు, కేసులను వాదించేందుకు రూ.5 కోట్లు మంజూరు చేయాలని కోరారు.

గిరిజనుల గుడిసెలను కూల్చేసిన పెత్తందార్లు

- నిరసన తెలుపుతున్న సిపిఎం, ఇళ్ల స్థలాల పోరాట నేతలపై పోలీసుల దౌర్జన్యం, అరెస్ట్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పుంత పోరంబోకు భూమిలో ఆదివాసీ గిరిజనులు వేసుకున్న గుడిసెలను గిరిజనేతర పెత్తందార్లు జెసిబి సాయంతో కూల్చివేయడాన్ని సిపిఎం నేతలు, ఇళ్లస్థలాల పోరాట నేతలు అడ్డుకున్నారు. దీంతో వారిని పోలీసులు బలవంతంగా అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన ఏలూరు జిల్లా బుట్టాయగూడెంలో గురువారం చోటుచేసుకుంది. బుట్టాయగూడెంలో పుంతపోరంబోకు భూమి సర్వే నెంబర్ 550/4, 550/5, 550/6ల్లో సుమారు మూడెకరాల భూమిలో 70 మంది ఆదివాసీ గిరిజనులు పలు పోరాటాల అనంతరం కొద్దికాలం క్రితం గుడిసెలు వేసుకున్నారు. గురువారం ఉదయం 11 గంటల సమయంలో బుట్టాయగూడెం గ్రామానికి చెందిన గిరిజనేతరులు కరాటం సునీల్, అతని సోదరుడు నాగరాజు మరికొంత మందిని వెంటేసుకొచ్చి ఆదివాసీ గిరిజనులు వేసుకున్న గుడిసెలను జెసిబితో కూల్చడానికి సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న సిపిఎం నేతలు, గిరిజనులు ఇళ్ల కూల్చివేతను అడ్డుకున్నారు. ఇళ్ల కూల్చివేతపై రెవెన్యూ అధికారులు వివరణ ఇవ్వాలని, పేద గిరిజనులు గుడిసెలు వేసుకున్న స్థలానికి సంబంధించిన రికార్డులను ఇప్పటి వరకూ ఎందుకు పరిశీలించలేదని సిపిఎం నేతలు, పేదలు రోడ్డుపై బైఠాయించారు. బుట్టాయిగూడెంలోని కొంతమంది పెత్తందారులు, భూస్వాములు గిరిజన చట్టాలకు వ్యతిరేకంగా అనేక కార్యకలాపాలు చేస్తున్నారని, వారికి తహశీల్దార్ చలపతిరావు అండగా నిలుస్తున్నారని విమర్శించారు. రెవెన్యూ అధికారులు, తహశీల్దార్ తక్షణమే ఇక్కడకొచ్చి రికార్డు పరిశీలించి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆ ప్రాంతానికి చేరుకున్న పోలీసులు తక్షణం రహదారి ఖాళీ చేయాలని ఆందోళనకారులకు హెచ్చరించారు. కూల్చివేతకు కారకులపై చర్యలు తీసుకోవాలని, రెవెన్యూ అధికారులు రావాలని గిరిజనులు స్పష్టం చేశారు. ఈ క్రమంలో ఎస్ఐ డి దుర్గామహేశ్వరరావు సిబ్బందితో కలసి సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, ఇళ్ల స్థలాల పోరాట నేత కుంజా సత్యనారాయణలను బలవంతంగా ఈడ్చుకుంటూ లాక్కెళ్లి వ్యాన్‌లో వేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. పేదలు దీనిపై తీవ్ర నిరసన తెలపడంతో సాయంత్రం సమయంలో వారిద్దరిని పోలీసులు విడిచిపెట్టారు.

సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణను బలవంతంగా అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

సైబర్ క్రైమ్ మినహా తగ్గిన నేరాలు

- ఎఐ ఆధారిత పోలీసింగ్‌కు ప్రాధాన్యత
- డిజిపి ద్వారకా తిరుమలరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో సైబర్ క్రైమ్ మినహా ఇతర అన్ని రకాల నేరాలు తగ్గుముఖం పట్టాయని డిజిపి ద్వారకా తిరుమలరావు తెలిపారు. మంగళగిరిలోని డిజిపి కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎఐ ఆధారిత పోలీసింగ్‌కు ప్రాధాన్యత ఇస్తూ నిఘా, ఫోరెన్సిక్ వ్యవస్థల సామర్థ్యాన్ని పెంచుకుంటున్నట్లు చెప్పారు. సోషల్ మీడియాలోనూ ద్వేషపూరితమైన పోస్టులు తగ్గినట్లు చెప్పారు. నేరాల నియంత్రణ, ప్రజా భద్రతపై దృష్టి పెట్టడం వల్ల మొత్తం నేరాలు 5.7 శాతం తగ్గినట్లు చెప్పారు. నేరాల సంఖ్య 97,760 నుంచి 92,094కు తగ్గిందన్నారు. మహిళలు, చిన్నారులపైనా నేరాలు 9.5 తగ్గాయని, ఎస్‌సి, ఎస్‌టిలపైనా నేరాలు 5 శాతం వరకూ తగ్గినట్లు తెలిపారు. ఎఐ ఆధారిత ట్రాఫిక్ నిర్వహణ, రహదారులను అభివృద్ధి వల్ల రోడ్డు ప్రమాదాల్లో 5 శాతం తగ్గుదల నమోదైందని చెప్పారు. నేరాల నియంత్రణకు సిసి కెమెరాలతో నిఘా పెంచడానికి ఈ ఏడాది మార్చి నాటికి లక్ష సిసి కెమెరాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకూ 28,500 సిసి కెమెరాల ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. జన సమూహాల పర్యవేక్షణకు, అత్యవసర ప్రతిస్పందన, నిఘాకు డ్రోన్ వినియోగం అత్యంత ఆవశ్యకమని చెప్పారు. ఆటోమేటెడ్ ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టమ్ (ఎఎఫ్ఐఎస్)ను ఫోరెన్సిక్ విశ్లేషణ, నేరాలను ఛేదించడానికి వినియోగిస్తున్నట్లు చెప్పారు. దీని ఆధారంగా 453 ఆస్తికి సంబంధించిన నేరాలను పరిష్కరించినట్లు పేర్కొన్నారు. రూ.7.25 కోట్లు దొంగిలించబడిన ఆస్తిని రికవరీ చేయగలిగామన్నారు. పోలీసు సంక్షేమానికి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. విజయనగరం జిల్లాలో గ్రేహౌండ్స్‌కు ఇచ్చిన 500 ఎకరాల్లో త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. గంజాయి, డ్రగ్స్ ముప్పును అరికట్టడం, ప్రతి జిల్లాకూ ఒక సైబర్ క్రైం స్టేషన్ ఏర్పాటు, న్యూగొండపల్లిలో అప్పా ఏర్పాటు, ఖాళీలను భర్తీ చేయడం, ఎఐ ఆధారిత రహదారి భద్రత, సిసి కెమెరాలు, డ్రోన్ వంటి సాంకేతిక మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టినట్లు చెప్పారు. 35 ఏళ్ల పోలీసు అధికారిగా సంతృప్తిగా పని చేశానన్నారు. ఏడు నెలలు డిజిపిగా విధులు నిర్వహించినట్లు తెలిపారు. ఎన్ని సంస్కరణలు తీసుకొచ్చినా ఇప్పటికీ సామాన్యులు నిర్భయంగా పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయలేని పరిస్థితి ఉందన్నారు.

విశాఖ ఉక్కును ప్రైవేటుపరం చేయడానికే ప్యాకేజీ

- సిఐటియు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించి, ప్లాంట్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సిఐటియు రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎవి నాగేశ్వరరావు, సిహెచ్ నరసింగరావు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖ స్టీల్‌ను ప్రైవేటుపరం చేయడానికే సెయిల్‌లో కలపడం సాధ్యం కాదని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి ప్రకటించినట్లు చెప్పారు. గతంలో నష్టాల్లో ఉన్న అనేక ప్రభుత్వరంగ పరిశ్రమలను సెయిల్‌లో ఎలా విలీనం చేశారని ప్రశ్నించారు. కేంద్రం ఇచ్చిన రూ.11,440 కోట్లతో ముడిసరుకు, కార్మికుల జీతాలకు, బకాయిలకు వినియోగించకుండా ఇతర బకాయిలకు మాత్రమే చెల్లిస్తారని, సెయిల్ విలీనం సాధ్యం కాదని మంత్రి ఢిల్లీలో ప్రకటించడం చూస్తుంటే ప్లాంట్‌ను ప్రైవేటుపరం చేయడానికేననే విషయం స్పష్టంగా అర్థమవుతుందన్నారు. ఒకవైపు అప్పులు తీర్చడానికి ప్యాకేజీ సొమ్ము ఖర్చు చేస్తుందని, మరోవైపు ప్లాంట్‌కు లాభాలు రాలేదని ప్రైవేటు యాజమాన్యానికి అప్పగించే పనిలో కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ముమ్మరంగా పనిచేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ముడి సరుకు పంపకుండా, రవాణాకు రైల్వే ర్యాక్‌లు ఇవ్వకుండా, అదాని గంగవరం పోర్ట్‌కు విదేశాల నుంచి వచ్చిన కోకింగ్ కోల్‌ను ప్లాంట్‌కు రాకుండా చేసి కావాలనే నష్టాల్లోకి నెట్టిందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉక్కు సంకల్పంతో ప్లాంట్‌కు బ్రహ్మాండమైన ప్యాకేజీ ఇచ్చినట్లు బాకా ఊది ప్రచారం చేసుకుంటున్నారని తెలిపారు. లాభాలు రాకుండా చేసి కార్మికులపై నెపం వేసి ప్రైవేటీకరణ చేయాలనే బిజెపి, టిడిపి, జనసేన తీరును సిఐటియు తీవ్రంగా ఖండిస్తోందన్నారు. స్టీల్ ప్లాంట్ కార్మికులకు మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోయినా నూరు శాతంపైగా ఉత్పత్తి సాధించారని చెప్పారు. ప్యాకేజీలో ఇచ్చిన సొమ్ముతో కార్మికులకు జీతాలు ఇవ్వబోమని అంటున్నారని, మరోవైపు ఉద్యోగాల నుంచి తొలగించేందుకు విఆర్ఎస్‌కు మాత్రం చెల్లిస్తామని చెప్పడాన్ని తప్పుబట్టారు.

అప్పుల రాజధాని కాదు...

ప్రజా రాజధాని కావాలి : సిహెచ్ బాబూరావు

- తాడేపల్లిలో ప్రారంభమైన సిపిఎం రాష్ట్ర మహాసభ ప్రచార జాతా

ప్రజాశక్తి- తాడేపల్లి రూరల్ (గుంటూరు జిల్లా)

రాష్ట్రానికి కావాల్సింది అప్పుల రాజధాని కాదని, ప్రజా రాజధానని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు అన్నారు. రాజధాని నిర్మాణం-రాష్ట్ర అభివృద్ధి జాతాను గుంటూరు జిల్లా తాడేపల్లిలో గురువారం ఆయన సిపిఎం జెండా ఊపి ప్రారంభించారు. ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో నెల్లూరులో జరగనున్న సిపిఎం రాష్ట్ర మహాసభ నేపథ్యంలో చేపట్టిన ఈ జాతా తుళ్లూరు, తాడికొండ, పెదకాకాని, గుంటూరులో మొదటి రోజు ప్రచారం నిర్వహించింది. జాతాలో సిపిఎం శ్రేణులు ద్విచక్ర వాహనాలపై ర్యాలీగా బయలుదేరారు. తొలుత తాడేపల్లి ప్రాంత సిపిఎం నాయకులు అమరజీవులు మేకా అమరారెడ్డి, బండారు ముత్యాలు, వెన్నపూస మాలకొండారెడ్డి విగ్రహాలకు బాబూరావు, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వై నేతాజీ, సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పాశం రామారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ పతాకాన్ని సిపిఎం తాడేపల్లి పట్టణ నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాస కుమారి, సిఐటియు జెండాను సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు ఆవిష్కరించారు. అనంతరం సిపిఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సభలో బాబూరావు మాట్లాడారు. రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు కావస్తున్నా రాష్ట్రం కోసం రూ.1,500 కోట్లే కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందన్నారు. నూతన రాజధాని కోసం గ్రాంటుగా ఇవ్వాల్సిన నిధులను అప్పుగా ఇచ్చి రాష్ట్ర ప్రజలను నరేంద్ర మోడీ ప్రభుత్వం మోసం చేస్తోందని విమర్శించారు. విభజన హామీ చట్టం ప్రకారం రాజధాని నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వకుండా రాష్ట్ర ప్రజలను దగా చేస్తోందన్నారు. రాష్ట్రానికి కడప ఉక్కు, విశాఖ ఉక్కు ఎంత అవసరమో, రాజధాని కూడా అంతే అవసరమని తెలిపారు. ఫిబ్రవరి ఒకటిన కేంద్ర బడ్జెట్ ప్రవేశపెడుతున్న నేపథ్యంలో చిత్తశుద్ధితో రాష్ట్రానికి అవసరమైన బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. రాజధాని నిర్మాణానికి రూ.50 వేల కోట్లు అవసరమని తెలిపారు. ఏటా పది వేల కోట్ల రూపాయల చొప్పున రాజధాని నిర్మాణానికి అవసరమైన మొత్తాన్ని కేంద్రం గ్రాంట్‌గా మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి అన్యాయం చేసి చెంబుడు నీళ్లు, గుప్పెడు మట్టి ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోడీతో టిడిపి, జనసేన జతకట్టాయన్నారు. రాజధాని అభివృద్ధి ఇప్పటికీ జరగలేదని, రాజధాని ప్రాంతంలో 29 గ్రామాలు, కృష్ణా, గుంటూరు జిల్లాల పరిధిలో ఉన్న సిఆర్‌డిఎ అభివృద్ధి చేయాలన్నారు. రాజధాని పరిరక్షణ పోరాటంలో పాల్గొన్న రైతులు, ప్రజలు, కార్మికులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. రాజధాని ప్రాంత రైతుల ప్లాట్లపై బ్యాంకు రుణాలు ఇవ్వాలని, అసైన్ రైతులకు కూడా సమాన ప్యాకేజీ అమలు చేయాలని, రాజధాని ప్రాంత గ్రామాల్లోని అంతర్గత రోడ్లు, డ్రెయినేజీ తదితర మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో రాజధానికి ఎలాంటి సందిగ్ధత లేకుండా అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పించాలని కోరారు. రాజధానిని మూడు ముక్కలు చేస్తామని గత ప్రభుత్వం ప్రకటన చేసిన నేపథ్యంలో ఆ ప్రాంత రైతులు, ప్రజలతో కలిసి సిపిఎం ఒకే రాజధాని కోసం పోరాడిందని గుర్తు చేశారు.

సిపిఎం ప్రచార జాతను జెండా ఊపి ప్రారంభిస్తున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు చిగురుపాటి బాబురావు.



గాంధీ విగ్రహం వద్ద నివాళ్లర్పిస్తున్న రాజా తదితరులు

లౌకికవాదానికి తూట్లు

- గాంధీ స్ఫూర్తితో ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి
- మహాత్మా గాంధీకి నివాళి అర్పించిన అనంతరం డి రాజా

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి లౌకికవాదానికి తూట్లు పొడుస్తూ, రాజ్యాంగ స్ఫూర్తిని విచ్ఛిన్నం చేస్తోందని సిపిఐ జాతీయ కార్యదర్శి డి రాజా అన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా గురువారం విశాఖలోని జివిఎంసి చెంతనున్న గాంధీ విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ మహాత్మాగాంధీ అన్ని తరాలవారికీ ఆదర్శమని, అన్ని మతాలవారినీ ఏకతాటిపైకి తెచ్చిన ఘనత ఆయనకే చెందుతుందని అన్నారు. గాంధీని చంపిన గాడ్సేకు నేడు బిజెపి, ఆర్ఎస్ఎస్ వాదులు దండలు వేసి నివాళులర్పిస్తున్నారంటే లౌకికవాదం, ప్రజాస్వామ్యం పట్ల వారికి ఏమాత్రం గౌరవం ఉందో అర్థమవుతోందన్నారు. గాంధీ స్ఫూర్తితో ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయనున్నట్టు తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో గాంధీజీ చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన ఆశయాల సాధనకు కృషి చేసినప్పుడే గాంధీకి నిజమైన నివాళి అర్పించినవారమవుతామని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు అనిరాజా, అమర్‌జిత్ కౌర్, బాలచందర్ కాంగో, పశ్య పద్మ, రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి సత్యనారాయణమూర్తి, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు, నాయకులు అత్తిలి విమల పాల్గొన్నారు.

సిపిఐ జాతీయ కార్యవర్గ సమావేశాలు ప్రారంభం

రెండు రోజులపాటు తలపెట్టిన సిపిఐ జాతీయ కార్యవర్గ సమావేశాలు గురువారం స్థానిక మంత్రిస్ హోటల్‌లో ప్రారంభమయ్యాయి. తొలుత జాతీయ కార్యదర్శి డి రాజా ప్రస్తుత దేశ రాజకీయ పరిస్థితిని, సిపిఐ నిర్వహించాల్సిన కర్తవ్యాన్ని వివరించారు. పలు కీలక అంశాలపై కార్యవర్గ సమావేశంలో చర్చలు జరిగాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి, ఆర్ఎస్ఎస్ విధానాలకు వ్యతిరేకంగా అనుసరించాల్సిన వ్యూహాలపైనా, సమస్యల పరిష్కారం కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలపైనా చర్చ నడిచింది. పలు తీర్మానాలు చేశారు. సమావేశ వివరాలను, తీర్మానాలను శుక్రవారం మీడియా సమావేశంలో వెల్లడిస్తామని నాయకులు తెలిపారు.

1/70 చట్టం రద్దుకు ప్రయత్నిస్తే ఊరుకోం

- పార్వతీపురంలో రాస్తారోకోలో ఆదివాసీ గిరిజన సంఘం

ప్రజాశక్తి - పార్వతీపురం

ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టంపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని, రద్దుకు ఎటువంటి ప్రయత్నాలు చేపట్టినా సహించబోమని ఆదివాసీ గిరిజన సంఘం స్పష్టం చేసింది. ఏజెన్సీలో అభివృద్ధి జరగాలంటే 1/70 చట్టాన్ని సవరించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పార్వతీపురం పట్టణం బెలగాం కూడలి వద్ద గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం కృష్ణమూర్తి మాట్లాడుతూ 1/70ను సవరిస్తే గిరిజనులకు భూమి దక్కకుండా పోతుందని, ఏజెన్సీలో లభించే సహజ వనరులను బడా కార్పొరేట్లకు కట్టబెట్టడానికి కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఎప్పటి నుండో పలు కుట్రలు చేస్తోందని విమర్శించారు. అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యలు దీన్ని మరింత బలపరుస్తున్నాయని తెలిపారు. ఇప్పటికే గిరిజన సలహామండలి, పీసా చట్టం సక్రమంగా అమలుకు నోచుకోవడం లేదని, జిఒ 3 నిర్వీర్యం చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా నాయకులు పాలమిట్ట రాము, అలివేలు, ముత్యాలు, మంగమ్మ, జయరాజు, భాస్కర్, గిరి, వెంకటేష్, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

గిరిజన చట్టాల జోలికొస్తే తీవ్ర పరిణామాలు

- అరకు ఎమ్మెల్యే మత్స్యలింగం

ప్రజాశక్తి - అరకులోయ (అల్లూరి జిల్లా)

ఏజెన్సీలో గిరిజన చట్టాల జోలికొస్తే తీవ్ర పరిణామాలు తప్పవని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. 1/70 చట్టాన్ని సవరించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలు దారుణమైనవన్నారు. అల్లూరి జిల్లా అరకులోయలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైసిపి నాయకులతో కలిసి మత్స్యలింగం మాట్లాడారు. శాసనసభ స్పీకర్ స్థానంలో ఉన్న అయ్యన్న గిరిజన చట్టాలను కాపాడాల్సింది పోయి టూరిజం అభివృద్ధికి చట్టాలు అడ్డు వస్తున్నాయని చెప్పడం సరికాదన్నారు. వెంటనే ఆయన ఆ వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే గిరిజన చట్టాలు నిర్వీర్యమైపోతున్నాయని ఆందోళన వ్యక్తం వేశారు. అనంతగిరి మండలంలో నాన్ షెడ్యూల్ ప్రాంతంలోని భూములు ఇప్పటికే అన్యాక్రాంతమయ్యాయని తెలిపారు. గిరిజనుల హక్కులు, చట్టాలకు భంగం కలిగించే విధంగా ఇటువంటి వ్యాఖ్యలు మరోసారి స్పీకర్ చేస్తే నర్సీపట్నంలోని ఆయన ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. సమావేశంలో జడ్‌పిటిసి సభ్యులు శెట్టి రోషిని, ఎంపిపి నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

:కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోటేశ్వరరావు

బ్రాండిక్స్ కార్మికుల ఆందోళన

- పని సమయం పెంపు చట్ట విరుద్ధం : సిఐటియు
- మహిళల నిరసనకు దిగొచ్చిన యాజమాన్యం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, అచ్యుతాపురం విలేకరి

అచ్యుతాపురం సెజ్‌లోని అదిస్టాన్ (బ్రాండిక్స్) కంపెనీ యాజమాన్యం అరగంట అదనంగా పని చేయాలని ఒత్తిడి చేయడంతో అక్కడ పనిచేస్తున్న మహిళా కార్మికులు గురువారం ఆందోళనకు దిగారు. ఎ, బి షిఫ్ట్ కార్మికులు కంపెనీ ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించారు. వేతనాలు పెంచాలని, సెలవులు ఇవ్వాలని, వేధింపులు అరికట్టాలని మహిళలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. యాజమాన్య ప్రతినిధులు భయపెట్టి.. వారిని చెదరగొట్టాలని యాజమాన్య ప్రతినిధులు ప్రయత్నించారు. దీనిని మహిళలు ఐక్యంగా తిప్పికొట్టారు. దీంతో యాజమాన్యం దిగిరాక తప్పలేదు. కార్మికులకు ఇష్టం లేకుండా అరగంట సమయం పెంచబోమని అధిష్టాన్ (బ్రాండిక్స్) యాజమాన్యం తరపున జనరల్ మేనేజర్ రసిక, ప్రతినిధి వినయ్ ప్రకటించారు. ఆదివారం సెలవు ఇవ్వడానికి అంగీకరించారు. మహిళా కార్మికులను ఉద్దేశించి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ.. పని గంటల సమయం పెంపు చట్ట విరుద్ధమని అన్నారు. అరగంట పని పెంపు నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మహిళా కార్మికుల ఆందోళనకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మద్దతు తెలిపారు. ప్రయాణ సమయాన్ని కూడా లెక్కగట్టి జీతాలు చెల్లించాలని, ప్రమాదంలో అస్వస్థతకు గురైన మహిళలకు రూ.లక్ష చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.



సింహపురి అరుణారుణం..!

ప్రతినిధుల సభ వద్ద ఎర్రకోట నమూనాతో స్వాగత ద్వారం

రేపటి నుంచి సిపిఎం రాష్ట్ర 27వ మహాసభ

- ఘనంగా ముగిసిన సాంస్కృతిక ఉత్సవాలు
- 3న భారీ ర్యాలీ, బహిరంగ సభ

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

ప్రజా ఉద్యమాల పుట్టినిల్లు... సారా వ్యతిరేకత, అక్షరాస్యత.... కూలీ పోరాటాలు.. భూ పోరాటాలతో ప్రపంచ దృష్టిని ఆకర్షించిన నెల్లూరు కమ్యూనిస్టు ఉద్యమ వనంలో రేపటి నుంచి సిపిఎం రాష్ట్ర 27వ మహాసభ ప్రారంభం కానుంది... మహాసభకు నెల్లూరు నగరం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది.. సింహపురి అరుణారుణమైంది... ఎటు చూసినా మహాసభ సందడే నెలకొంది. ప్రధాన కూడళ్లల్లో ప్లెక్సీలు, తోరణాలు.. హోర్డింగ్‌లు వెలిశాయి.. ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో మాగుంట లేఅవుట్ సీతారాం ఏచూరి (అనిల్ గార్డెన్) నగర్‌లో జరగనున్న మహాసభ విజయవంతానికి ఊరూ, వాడా విస్తృత ప్రచారం నిర్వహించారు. మహాసభను సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబి ప్రారంభించనున్నారు. 3న భారీ ర్యాలీ, బహిరంగ సభ జరగనుంది.

దక్షణ భాతర కమ్యూనిస్టు పార్టీ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య సొంత గడ్డ నెల్లూరు 27వ రాష్ట్ర మహాసభకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. 1978లో ఏమర్జెన్సీ తరువాత 13వ రాష్ట్ర మహాసభ నెల్లూరులో నిర్వహించారు. 47 సంవత్సరాల తరువాత 27వ రాష్ట్ర మహాసభ నెల్లూరులో నిర్వహిస్తున్నారు. మహాసభ విజయవంతానికి విస్తృత ప్రచారం నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి 500 మంది ప్రతినిధులు సభకు హాజరుకానున్నారు. ప్రతినిధులకు ఆతిథ్యం ఇచ్చేందుకు ఆహ్వాన సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది. రాష్ట్ర నలుమూలల నుంచి ప్రారంభమైన ఐదు జాతాలు 31వ తేదీ రాత్రికి నెల్లూరు చేరుకోనున్నాయి. జాతాలకు స్వాగతం పలికేందుకు సన్నాహాలు చేశారు. జిల్లాలోని ప్రధాన పట్టణాలు, పల్లెలు, ఊరూ.. వాడల్లో సిపిఎం మహాసభ ప్రచారాన్ని ఆ పార్టీ నేతలు నిర్వహించారు. ప్రదర్శన, బహిరంగ సభలను విజయవంతం చేయాలని కోరుతూ విస్తృత ప్రచారం చేశారు. ఇప్పటికే వివిధ రకాల సమస్యలపై జాతీయ, రాష్ట్ర స్థాయి నాయకులతో సదస్సులు నిర్వహించారు. వ్యవసాయ కార్మికులు, ట్రాన్స్‌పోర్టు కార్మికులు, మహిళా సమస్యలు, రాజ్యాంగ పరిరక్షణ, కార్మికవర్గం కర్తవ్యాలు పేరుతో పెద్ద ఎత్తున సదస్సులు నిర్వహించారు. మహాసభ ఏర్పాట్లను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి రమాదేవి, వి వెంకటేశ్వర్లు పరిశీలించారు. మూడు రోజులపాటు నగరంలో నిర్వహించిన సింహపురి సాంస్కృతికోత్సవాలు ఘనంగా ముగిశాయి.

నెల్లూరు ఎరుపుమయం ..!

సిపిఎం రాష్ట్ర మహాసభ సందర్భంగా నెల్లూరు నగరం ఎర్రబారింది. నగరంలో ఎటూ చూసిన సిపిఎం ఫ్లెక్సీలు, తోరణాలు, హోర్డింగ్‌లు కనిపిస్తున్నాయి. ప్రతినిధుల సభ జరిగే మాగుంట లేవుట్‌లోని సీతారాం ఏచూరి (అనిల్ గార్డెన్) నగర్ వద్ద ఢిల్లీ ఎర్రకోటను తలపించేలా స్వాగత ద్వారం ఏర్పాటు చేశారు. స్థానిక ముత్తుకూరు గేట్ సెంటర్‌లో భారీ బ్యానర్లు, తోరణాలు వెలిశాయి. బాలాజీ నగర్‌లో ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం నగరవాసులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఆత్మకూరు బస్టాండ్ సెంటర్ మొత్తం ఎర్ర తోరణాలతో నిండిపోయింది. నగరంలోని గాంధీబొమ్మ, సుందరయ్య బొమ్మ, విఆర్‌సి, అన్నమయ్య సర్కిల్, ఆర్‌టిసి ప్రధాన కూడళ్లు, రోడ్లు సిపిఎం జెండాలతో నిండిపోయాయి.

మహాసభను ప్రారంభించనున్న ఎంఎ బేబి

రాష్ట్ర మహాసభను శనివారం ఉదయం 9 గంటలకు మాగుంట లేఅవుట్‌లోని అనిల్ గార్డెన్ (సీతారాం ఏచూరి) నగర్‌లో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబి ప్రారంభించనున్నారు. అనంతరం ప్రతినిధుల సభ జరగనుంది. సభకు ముఖ్య అతిథులుగా పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, కేంద్ర కమిటీ నుంచి పరిశీలకులుగా అరుణ్‌కుమార్, డాక్టర్ హేమలత హాజరుకానున్నారు. వివిధ పార్టీల నాయకులు సౌహార్ద సందేశం ఇవ్వనున్నారు.

3న భారీ ప్రదర్శన, బహిరంగ సభ

రాష్ట్ర మహాసభ ముగింపు సందర్భంగా ఫిబ్రవరి 3న నగరంలో భారీ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు ఆత్మకూరు బస్టాండ్ నుంచి భారీ ప్రదర్శన బయలుదేరనుంది. నెల్లూరు జిల్లా నలుమూలల నుంచే కాకుండా ప్రకాశం, చిత్తూరు, కడప, తిరుపతి జిల్లాలతోపాటు రాష్ట్ర నలుమూలల నుంచి సిపిఎం నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. ప్రదర్శనలో యల్లాయపాళెం డప్పుల దళం, తిరుపతి, ప్రకాశం నుంచి కళాకారులు, కోలాటాలు, భజన బృందాలు, విచిత్ర వేషధారణలు ఉంటాయి. 27వ మహాసభ సూచికంగా 27 మంది మహిళలు చీరలతో, ఎర్రజెండాలు చేతబూని ప్రదర్శనలో పాల్గొననున్నారు. రెడ్‌షర్ట్ వలంటీర్ల కవాతు ప్రదర్శనకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ప్రదర్శన ఆత్మకూరు బస్టాండ్, సుందరయ్య బొమ్మ, ఎసి సెంటర్, గాంధీబొమ్మ, ట్రంకురోడ్డు మీదుగా విఆర్‌సి మైదానం చేరుకుంటుంది. అక్కడ జరిగే బహిరంగ సభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్, ఎంఎ బేబి, బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, పార్టీ కేంద్ర పరిశీలకులు అరుణ్‌కుమార్, డాక్టర్ హేమలత, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎంఎ గఫూర్, డి రమాదేవి హాజరుకానున్నారు.

పోరాటాల వేగుచుక్క, సైద్ధాంతికవేత్త

కామ్రేడ్ సీతారాం ఏచూరి

విద్యార్థి ఉద్యమంలో విరిసిన వేగుచుక్క సీతారాం ఏచూరి. జెఎన్‌యులో విద్యార్థి నాయకుడిగా మొదలై భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) ప్రధాన కార్యదర్శి వరకు సాగిన ఆయన ఉద్యమ ప్రస్థానం మహోజ్వలమైనది. భారత వామపక్ష ఉద్యమంలో ఆయన తిరుగులేని స్థానం సంపాదించుకున్నారు. అంతకన్నా మించి ఆయన ఒక ప్రముఖ మార్క్సిస్ట్ సైద్ధాంతికవేత్త. ఆర్థిక శాస్త్రంలో అండర్ గ్రాడ్యుయేట్, పోస్టు గ్రాడ్యుయేట్ రెండింట్లో ప్రథమ శ్రేణిలో అత్యంత ప్రతిభావంతుడైన విద్యార్థి. 1974లో జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీలో చదువుతుండగా ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడారు. భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) వ్యవస్థాపకుల్లో ఆయన ఒకరు. . కేవలం రెండు సంవత్సరాల వ్యవధిలోనే జెఎన్‌యు విద్యార్థి సంఘం అధ్యక్షుడిగా మూడు పర్యాయాలు ఎన్నికయ్యారు. 1984 నుండి 1986 వరకు ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత అధ్యక్షుడిగా పనిచేశారు. విద్యార్థి సంఘాన్ని అఖిల భారత స్థాయిలో ఒక శక్తిగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారు. 1975లో సీతారాం ఏచూరి సిపిఎంలో చేరారు. ఆయన చేపట్టిన రాజకీయ కార్యకలాపాల కారణంగా ఎమర్జన్సీ సమయంలో అరెస్టయ్యారు. 1985లో పార్టీ 12వ మహాసభల్లో కేంద్ర కమిటీకి ఎన్నికయ్యారు. 1989లో కేంద్ర కార్యదర్శివర్గ సభ్యునిగా బాధ్యతలు నిర్వహిం చారు. 1992లో పార్టీ 14వ మహాసభల్లో పొలిట్‌బ్యూరోకు ఎన్నికయ్యారు.

2015లో విశాఖలో జరిగిన సిపిఎం 21వ అఖిల భారత మహాసభల్లో ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఏచూరి 2024 సెప్టెంబరులో కనుమూసేవరకు ఆ బాధ్యతల్లో కొనసాగారు. మూడు దశాబ్దాలకు పైగా కేంద్ర పార్టీ నాయకత్వ బృందంలో భాగంగా ఉంటూ పలు అంశాలపై పార్టీ రాజకీయ వైఖరులను రూపొందించడంలో ముఖ్య భూమిక పోషించారు. సైద్ధాంతిక విభాగంలో సీతారాం ఏచూరి విశిష్టమైన పాత్ర పోషించారు.

సోషలిజానికి ఎదురుదెబ్బలు తగలడంతో పార్టీ సైద్ధాంతిక వైఖరులను రూపొందించిన 14వ మహాసభల్లో నిర్దిష్టమైన సైద్ధాంతిక అంశాలపై పార్టీ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఈ తీర్మానాన్ని కామ్రేడ్ సీతారాం ఏచూరి రూపొందించి మహాసభ ముందుంచారు. ఆ తర్వాత, 2012లో పార్టీ 20వ మహాసభలో సైద్ధాంతిక వైఖరులను సవరించిన తీర్మానాన్ని మొదటగా బలపరిచింది కూడా ఏచూరే. తదనంతరం ఆ తీర్మానాన్ని మహాసభ ఆమోదించింది. సిపిఎం కేంద్ర కమిటీ అంతర్జాతీయ విభాగాధిపతిగా ఏచూరి వివిధ అంతర్జాతీయ కమ్యూనిస్టు, ప్రగతిశీల శక్తుల వేదికలపై పాల్గొన్నారు. సోషలిస్టు దేశాలతో సంబంధాలను బలోపేతం చేశారు. సామ్రాజ్యవాద వ్యతిరేక ఉద్యమాలకు సంఘీభావం ప్రకటించారు. సిపిఎం వీక్లీ పీపుల్స్ డెమోక్రసీకి సంపాదకులుగా కూడా ఏచూరి రెండు దశాబ్దాల పాటు వ్యవహరించారు. ఆయన స్వయంగా మంచి రచయిత కూడా. సైద్ధాంతిక విభాగంలో ఆయన అందించిన ఇతర ప్రధానమైన సేవల్లో హిందూత్వపై ఆయన చేసిన విమర్శ ఒకటి. ఏచూరి రాసిన పుస్తకాలు - వాటీజ్ దిస్ హిందూ రాష్ట్ర? కమ్యూనలిజం వర్సెస్ సెక్యులరిజం- ల్లో ఇది ప్రచురితమైంది. 2005 నుండి 2017 వరకు రెండుసార్లు ఆయన రాజ్యసభ సభ్యుడిగా వున్నారు. సిపిఎం పక్ష నాయకుడిగా వున్న ఆయన సమర్ధవంతమైన పార్లమెంటేరియన్. 2017లో ఆయనకు ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు లభించింది.

దేశ రాజకీయాల్లో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో సీతారాం ఏచూరి, లౌకిక ప్రతిపక్ష పార్టీల మధ్య విస్తృత ఐక్యత కోసం తన సమయాన్ని, శక్తిని ప్రధానంగా వెచ్చించారు. అంతిమంగా అది ఇండియా బ్లాక్‌గా రూపుదిద్దుకుంది. యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వ హయాంలో, తర్వాత వచ్చిన యుపిఎ ప్రభుత్వ కాలంలో ఈ సంకీర్ణాలకు మద్దతిచ్చిన సిపిఎంకు కీలకమైన అనుసంధాన కర్తల్లో ఒకరిగా ఏచూరి వున్నారు. తీవ్రమైన ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ కారణంగా ఢిల్లీ ఎయిమ్స్‌లో చేరిన ఆయన అక్కడే చికిత్స పొందుతూ 2024 సెప్టెంబర్ 12వ తేది (గురువారం) తుదిశ్వాస విడిచారు. ఆయన మరణం దేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆయన చేసిన సేవలను పార్టీల కతీతంగా అందరు గుర్తుచేసుకున్నారు. తమ ప్రియతమ సహచరునికి సిపిఎం పొలిట్‌బ్యూరో ఘనంగా నివాళి అర్పించింది. దోపిడి రహిత సమాజం కోసం జరిపే పోరాటాన్ని మరింత ముందుకు తీసుకెళ్ళేందుకు సమైక్యంగా, మరింత కఠోరంగా కృషి చేయాలని పార్టీ కార్యకర్తలకు పొలిట్‌బ్యూరో పిలుపిచ్చింది. ఆ దిశలో చేపట్టే కార్యాచరణ, ఉద్యమ శ్రేణులు వేసే అడుగులే ఆయనకు ఉత్తమ నివాళిగా నిలుస్తాయి.



ఐబిసి, 2016 క్రింద అమ్మకపు ప్రకటన

సాయిభాస్కర్ ఐరన్స్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో)

CIN -U27100TG2007PLC056809
లిక్విడేటర్ వారి చిరునామా: 6-3-249/6, 'అల్కాజర్ ప్లాజా & టవర్స్", రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్-500034, ఇమెయిల్: cirp.sbil@gmail.com

మెసర్స్ సాయిభాస్కర్ ఐరన్స్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో): CIN - U27100TG2007PLC 056809, యొక్క లిక్విడేషన్ ఎస్టేట్స్ యొక్క ఫార్మింగ్ పార్ట్ దిగువ అసెట్స్ మరియు ఆస్తులు దిగువ పట్టికలో ఇచ్చిన వివరాల ప్రకారం "ఎక్కడ ఎలా వున్నది మరియు "అక్కడ అలాగే" మరియు ఏదేని రికోర్స్ లేకుండా" ప్రాతిపదికన ఇ-వేలం ద్వారా లిక్విడేటర్ ద్వారా ఆహ్వానిస్తున్నారు. ఇవి అప్షన్ ఏ లేదా అప్షన్ బి లేదా అప్షన్ సి లేదా అప్షన్ డి ప్రకారం ఉండును.
వేలం తేదీ మరియు సమయం: 26.02.2025న బుధవారం ఐఎస్టీ ఉ.11.00గం.ల నుండి మ.1.00 గం.ల వరకు మరియు 13.03.2025 గురువారం ఐఎస్టీ ఉ.11.00గం.ల నుండి మ.1.00 గం.ల వరకు మరియు 28.03.2025 శుక్రవారం ఐఎస్టీ ఉ.11.00గం.ల నుండి మ.1.00 గం.ల వరకు

వివరణ	రిజర్వు ధర (కోట్లు)	ఈఎండి (రీఫండబుల్) (కోట్లు)	బిడ్ పెంపుదల మొత్తం(కోట్లు)
అప్షన్ ఏ:			
ఐబిబిఐ (లిక్విడేషన్ ప్రాసెస్) రెగ్యులేషన్స్, 2016 యొక్క రెగ్యులేషన్ 32ఏ మరియు 33(1)తో చదవగల రెగ్యులేషన్ 32(ఇ) ప్రకారం గోయింగ్ కన్‌సర్న్‌గా కంపెనీ విక్రయం.	Rs. 4.50	Rs. 0.45	Rs. 0.05
అప్షన్ బి:	Rs. 4.50	Rs. 0.45	Rs. 0.05
ఐబిబిఐ (లిక్విడేషన్ ప్రాసెస్) రెగ్యులేషన్స్, 2016లోని రెగ్యులేషన్ 32ఏ మరియు 33(1)తో చదవగల రెగ్యులేషన్ 32(ఎఫ్) ప్రకారం గోయింగ్ కన్‌సర్న్‌గా కార్పొరేట్ డెటార్ వ్యాపారం(ల) విక్రయం.			
అప్షన్ సి:	Rs.3.80	Rs.0.38	Rs. 0.05
పత్రం ప్రకారం నాగర్జునపల్లి గ్రామం, మర్తూరు మండలం, ప్రకాశం జిల్లా కానీ ఇపుడు బాపట్ల జిల్లాలోని భూమి: 9.67 ఎకరాలు (ఇండస్ట్రీయల్ ల్యాండ్). ఐబిబిఐ (లిక్విడేషన్ ప్రాసెస్) రెగ్యులేషన్స్, 2016లోని రెగ్యులేషన్ 32ఏ మరియు 33(1)తో చదవగల రెగ్యులేషన్ 32 ప్రకారం కార్పొరేట్ డెటార్‌గా భూమి ఆస్తుల విక్రయం.			
అప్షన్ డి:	Rs.0.70	Rs.0.07	Rs. 0.05
భూమి కాకుండా (ఫైనాన్సియల్ అసెట్స్ మరియు ఇంటజిబుల్ అసెట్స్) ఐబిబిఐ (లిక్విడేషన్ ప్రాసెస్) రెగ్యులేషన్స్, 2016లోని రెగ్యులేషన్ 32ఏ మరియు 33(1)తో చదవగల రెగ్యులేషన్ 32 ప్రకారం కార్పొరేట్ డెటార్‌గా ఫైనాన్సియల్ ఆస్తుల విక్రయం.			

1) ఇ-వేలం ప్లాట్ ఫారమ్ https://nesl.co.in ద్వారా దిగువ సంతకందారు వారిచే విక్రయం చేయబడుతుంది (5 నిమిషాల చొప్పున అపరిమిత పొడిగింపుతో)
2) అమ్మకం అనునది 'ఎక్కడ ఎలా వున్నది & అక్కడ అలాగే, ఏదేని రికోర్స్ లేకుండా" అనే ప్రతిపాదికన నిర్వహించబడును.
3) ధరావత్తును "సాయిభాస్కర్ ఐరన్స్ లిమిటెడ్ (లిక్విడేషన్‌లో) పంజాబ్ నేషనల్ బ్యాంక్, గాంధీనగర్ బ్రాంచ్, సి.ఏ.నెం.5266102 100000762, ఐఎఫ్ఎస్‌సి: పియుఎన్‌బి 0526610 యొక్క ఖాతాకు డిడి/ఎన్ఇఎఫ్టీ/ఆర్టీజిఎస్ ద్వారా చెల్లించాలి.
4) బిడ్‌ను నిర్మీత ఫార్మాట్‌లో మాత్రమే ఆన్‌లైన్ విధానంలో సమర్పించాలి. బిడ్ ఫారంను వెబ్‌సైట్: https://nesl.co.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవాలి.
5) టెండరు మరియు టెండరుపత్రాలు సమర్పించుటకు చివరి తేదీ & సమయం: 24.02.25 లేదా 11.03.25 లేదా 26.03.25న సా.5.00గం.లు.
6) మొదటి వేలం అప్షన్ ఏ కోసం నిర్వహించబడుతుంది; అప్షన్ ఏ కోసం బిడ్డర్లు లేకపోతే, అప్షన్ బి కోసం బిడ్‌లు అనుమతించబడతాయి; అప్షన్ బికోసం బిడ్డర్లు లేకపోతే, అప్షన్ సి కోసం బిడ్‌లు అనుమతించబడతాయి, అప్షన్ సి కోసం బిడ్డర్లు లేకపోతే, అప్షన్ డి కోసం బిడ్‌లు అనుమతించబడతాయి. అప్షన్ ఏ కోసం వేలం విజయవంతమైతే, అప్షన్ బి, సి& డి కోసం వేలం రద్దు చేయబడుతుంది; అప్షన్ ఏ విఫలమైనా అప్షన్ బి కోసం వేలం విజయవంతమైతే, అప్షన్ సి& డి కోసం వేలం రద్దు చేయబడుతుంది, అప్షన్ బి విఫలమైనా అప్షన్ సి కోసం వేలం విజయవంతమైతే, అప్షన్ డి కోసం వేలం రద్దు చేయబడదు మరియు దీనికి విరుద్ధంగా కూడా జరుగుతుంది.
7) చివరి 5 నిమిషాల్లో ఏదైనా ఆఫర్ స్వీకరించబడితే, వేలం ఆటోమేటిక్‌ల్లీ మరో 5 నిమిషాలు పొడిగించబడుతుంది;
8) కార్పొరేట్ డెటార్ విక్రయించబడకపోతే, ఈ-వేలం 13.03.25 మరియు 28.03.25 తేదీలలో ఉ.11:00 నుండి మ.01:00 గంటల మధ్య జరుగుతుంది. పొడిగించిన అమ్మకపు కాలానికి ధరావత్తు మరియు టెండర్ పత్రాలను ఆమోదించడానికి చివరి రోజు వేలం తేదీకి 2 రోజుల ముందు ఉంటుంది.
9) ధరావత్తు డిపాజిట్ చేసిన మరియు లాగిన్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ను సృష్టించడంలో సహాయం కోరుతున్న ఉద్దేశించిన బిడ్డర్ శ్రీ అరవెంతన్ ఎస్ఇ, ఫోన్ నెం.93846 76709, ఇమెయిల్: araventhanse@nesl.co.in లేదా గుంజన్ నరులా, ఫోన్ నెం.8178446956, ఇమెయిల్: gunjann@nesl.co.in
10) విజయవంతం కాని బిడ్డర్ల ధరావత్తు మొత్తాన్ని తిరిగి చెల్లిస్తారు;
11) ఆన్‌లైన్ వేలం ముగింపులో అత్యధిక ఆఫర్‌ను (రిజర్వ్ ధర కంటే ఎక్కువ) సమర్పించిన బిడ్డర్‌ను లిక్విడేటర్ ఆమోదానికి లోబడి విజయవంతమైన బిడ్డర్‌గా ప్రకటిస్తారు మరియు అటువంటి డిమాండ్ వచ్చిన తొంభై రోజులలోపు బ్యాలెన్స్ సేల్ పరిగణనను అందించమని ఆహ్వానించబడతారు. ముప్పై రోజుల తర్వాత చేసే చెల్లింపులపై 12% రేటుతో వడ్డీ ఉంటుంది. కోడ్ మరియు దాని కింద వర్తించే నియమాలు మరియు నిబంధనల ప్రకారం ఏదైనా లేదా అన్ని ఆఫర్‌లను తిరస్కరించే హక్కు లిక్విడేటర్‌కు ఉంది.
12) అమ్మకం నిర్ధారించబడిన తర్వాత మరియు లెటర్ ఆఫ్ డిమాండ్ జారీ చేయబడిన తర్వాత, కొనుగోలుదారు అమ్మకపు ధరలో 25%, ధరావత్తుతో సహా వెంటనే డిపాజిట్ చేయాలి మరియు మిగిలిన అమ్మకపు పరిహారాన్ని 75% మొత్తాలను 90 రోజుల్లోపు (లెటర్ ఆఫ్ డిమాండ్ జారీ చేయబడిన తర్వాత) చెల్లించాలి. కొనుగోలుదారు సకాలంలో మొత్తాలను చెల్లించకపోతే, లిక్విడేటర్ ఇప్పటివరకు జమ చేసిన మొత్తాలను జప్తు చేసుకునే హక్కును కలిగి ఉంటారు.
13) ఇ-వేలం అమ్మకం యొక్క వివరణాత్మక నిబంధనలు మరియు షరతుల కోసం https://nesl.co.in/లో లేదా www.saibhaskarironslimited.inలో అందుబాటులో ఉన్న పూర్తి ఇ-వేలం ప్రక్రియ పత్రాన్ని చూడండి లేదా లిక్విడేటర్‌కు cirp.sbil@gmail.com, ఫోన్ నెం.9959223615 వద్ద ఇమెయిల్ పంపడం ద్వారా కూడా పొందవచ్చు.
14) ఇ-వేలం వివరాలు మరియు పాల్గొనడం కోసం, శ్రీ అరవెంతన్ ఎస్ ఇ, ఫోన్ నెం.93846 76709, ఇమెయిల్: araventhanse@nesl.co.in లేదా గుంజన్ నరులా, ఫోన్ నెం.8178446956, ఇమెయిల్: gunjann@nesl.co.in
15) ఆసక్తిగల బిడ్డర్లు పైన పేర్కొన్న వెబ్‌సైట్‌లను సందర్శించి బిడ్ సమర్పించవలసిందిగా అభ్యర్థించబడింది.
16) ఇ-వేలం యొక్క ఏవైనా నిబంధనలు మరియు షరతులను అంగీకరించడానికి లేదా రద్దు చేయడానికి లేదా పొడిగించడానికి లేదా సవరించడానికి లిక్విడేటర్‌కు హక్కు ఉంది.
17) ఇ-వేలం నోటీసు లేదా ఈ ఇ-వేలం నోటీసుకు సంబంధించిన ప్రాసెస్ డాక్యుమెంట్‌లోని ఏవైనా అనుబంధాలు/ స్పష్టతలు & మార్పులు కార్పొరేట్ డెటార్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయబడతాయి (ప్రజా ప్రకటన లేదా పేపర్ ప్రచురణ లేదా మరే ఇతర విధానం చేయబడదు.

డా.కొండపల్లి వెంకట్ శ్రీనివాస్
Reg. No. IBBI/IPA-001/IP-P00520/2017-18/10945
లిక్విడేటర్, సాయిభాస్కర్ ఐరన్స్ లిమిటెడ్
ఇమెయిల్: cirp.sbil@gmail.com

ప్రదేశం: హైదరాబాద్
తేది: 31-01-2025

విశాఖ ఉక్కు రక్షణకు ఉధృత పోరాటాలు

- పోలవరం నిర్వాసితులకు పరిహారం చెల్లించాలి
- జాతా సభల్లో సిపిఎం నేతల పిలుపు

ప్రజాశక్తి - యంత్రాంగం

విశాఖ ఉక్కు పరిరక్షణే ధ్యేయంగా పోరాటాలను ఉధృతం చేయాలని, మండలం యూనిట్‌గా పోలవరం ముంపు మండలాల్లో పరిహారం చెల్లించాలని చెల్లించాలని జాతా సభల్లో సిపిఎం నేతలు పిలుపునిచ్చారు. సిపిఎం 27వ మహాసభ ఫిబ్రవరి 1 నుంచి 3 వరకూ నెల్లూరులో జరగనున్న నేపథ్యంలో పార్టీ ఆధ్వర్యాన 'పోలవరం నిర్వాసితుల పోరాట పతాక జాతా' ఏలూరు జిల్లాలో, 'విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ జాతా' కృష్ణా, ఎన్‌టిఆర్, పల్నాడు జిల్లాల్లో గురువారం సాగాయి. ఏలూరు జిల్లా కుక్కునూరులోని రామసింగారం సెంటర్లో 'పోలవరం నిర్వాసితుల పోరాట పతాక జాతా'కు సిపిఎం శ్రేణులు, నిర్వాసితులు, గిరిజనులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయా ప్రాంతాల్లో జరిగిన సభల్లో దడాల సుబ్బారావు మాట్లాడుతూ.. 2013 భూసేకరణ చట్టం ప్రకారం ప్రతి నిర్వాసితుడికీ రూ.15 లక్షల పునరావాస పరిహారం ఇవ్వాలని, నిర్వాసితులకు పూర్తి పరిహారం చెల్లించే వరకు ప్రాజెక్టు నిర్మాణ పనులు నిలిపివేయాలని తెలిపారు. కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో సాగిన 'విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ జాతా'లో సిపిఎం రాష్ట్ర నాయకులు, స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కమిటీ నాయకులు మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు పరిరక్షణే ధ్యేయంగా పోరాటాలను ఉధృతం చేయాలని కోరారు. ఫ్యాక్టరీకి సొంత గనులు కేటాయించకుండా ఎలా కాపాడతారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, కె.సుబ్బరావమ్మ, స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కమిటీ కన్వీనర్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు, పరిరక్షణ కమిటీ నాయకులు యు.రామస్వామి, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు, పాల్గొన్నారు. పల్నాడు జిల్లా యడ్లపాడులోలో సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.రాధాకృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సభలో సిఐటియు స్టీల్‌ప్లాంట్ జనరల్ సెక్రెటరీ ఎం.రామస్వామి మాట్లాడుతూ.. ఉద్యమాల ద్వారా వచ్చిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను తిరిగి ఉద్యమాల ద్వారానే కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వాలు చేతగానివిగా మారాయి

- కడప 'ఉక్కు' సాధించుకుందాం
- సిపిఎం జీపు జాతాలో మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

ప్రజాశక్తి- కడప జిల్లా యంత్రాంగం

కడప ఉక్కు పరిశ్రమను సాధించుకోవడంలో వైసిపి, టిడిపి కూటమి ప్రభుత్వాలు చేతగానివిగా మారాయని మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ అన్నారు. సిపిఎం రాష్ట్ర 27వ మహాసభ ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు నెల్లూరులో జరుగుతున్న నేపథ్యంలో 'కడప ఉక్కు-ఆంధ్రుల హక్కు పేరుతో పార్టీ ఆధ్వర్యాన గురువారం కడప జిల్లా జమ్మలమడుగు నుంచి తలపెట్టిన రాష్ట్ర పతాక జాతాను గేయానంద్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. దీనికిముందు జమ్మలమడుగు పాత బస్టాండ్‌లో మాజీ ఎంపి ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ జాతా ముద్దనూరు, పులివెందుల, వేంపల్లె, వీరపునాయునిపల్లె, ఎర్రగుంట్ల, కమలాపురం మీదుగా రాత్రికి కడప నగరానికి చేరుకుంది. జాతాకు ఆయా ప్రాంతాల్లో ప్రజలు ఘనస్వాగతం పలికారు. ఆయా ప్రాంతాల్లో గేయానంద్ మాట్లాడుతూ కడప ఉక్కు రాయలసీమ హక్కు అనే సంకల్పాన్ని పాలకపక్ష రాజకీయ పార్టీలు మరిచిపోయాయని, ప్రజలు కూడా మరిచిపోతారని రాజకీయ పార్టీలు అనుకుంటున్నాయని అన్నారు. కడప, రాయలసీమ ప్రజలు కడప ఉక్కు పరిశ్రమను మరిచిపోరని, ఉద్యమించి ఎప్పటికైనా సాధించుకొని తీరుతారని తెలిపారు. కడప ఉక్కు అనేది విభజన చట్టంలో ఉన్న ఒక హక్కు అని గుర్తు చేశారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ బిజెపి ఎన్నికల ఎత్తుగడలో టిడిపి, జనసేన ఇరుక్కుపోయి రాష్ట్ర ప్రయోజనాలను, కడప ఉక్కు పరిశ్రమను తాకట్టు పెట్టాయని విమర్శించారు. కడప ఉక్కు పరిశ్రమ ఈ ప్రాంత ప్రజలకు ఆక్సిజన్ లాంటిదన్నారు. ఎంతోమందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించే బృహత్తర పరిశ్రమపై రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు దృష్టి పెట్టకపోవడం విచాకరమన్నారు. సిపిఎం రాష్ట్ర నాయకులు రామన్న మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ గురించి కేంద్రంతో జనసేన, టిడిపి, వైసిపి మాట్లాడకపోవడం శోచనీయ మన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు కొత్త ప్రాజెక్టులు తీసుకొస్తామని చెబుతున్నారని, ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలని కోరారు. కడప ఉక్కు పరిశ్రమపై కేంద్రంలోని బిజెపి మౌనంగా ఉండడం రాష్ట్ర, జిల్లా ప్రజలను మోసం చేయడం కాదా? అని ప్రశ్నించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉక్కు పరిశ్రమ సాధనకు జిల్లా ఎంపి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు రాజీనామా పోరాడాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.మనోహర్, జి.శివకుమార్, వి.అన్వేష్, సిపిఎం జమ్మలమడుగు పట్టణ కార్యదర్శి ఏసుదాసు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, ఉక్కు పరిశ్రమ ప్రాముఖ్యత గురించి ప్రసంగించారు. అనంతరం ఉక్కు పరిశ్రమ కోసం శంకుస్థాపన చేసిన శిలాఫలకాలను పరిశీలించారు.



జమ్మలమడుగు వద్ద ఉక్కు పరిశ్రమ శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న నాయకులు

ఎరుపుమయమైన ఆత్మకూరు బస్టాండ్

వెలువడినవి

సనాతన ధర్మం అంటే ఏమిటి?
రూ. 25/-



విద్వేషమా? విశ్వమానవ ప్రేమా?
ఏది సనాతనధర్మం
ధర్మం పేరుతో కత్తులు దూయవద్దు
రూ. 30/-

ప్రతులకు
ప్రజాశక్తి బుక్‌హౌస్
డోరు నెం.27-1-54, కారల్‌మార్క్స్‌రోడ్, విజయవాడ - 2
ఫోన్ : 9490099061, 9490099057

బ్రాంచీలు
విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, ఒంగోలు, నెల్లూరు

సంపాదకీయం

'మహా' ఘోరం!

ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా సందర్భంగా భక్తుల మధ్య తొక్కిసలాట జరిగి, 30 మంది ప్రాణాలు కోల్పోవటం చాలా విషాదకరం. ఈ దుర్ఘటనలో మరో 60 మంది వరకూ గాయపడగా, అందులో 36 మంది ఇంకా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని అధికారుల సమాచారం. మౌని అమావాస్య సందర్భంగా త్రివేణీ సంగమం వద్ద స్నానాలు ఆచరిస్తే - పుణ్యం వస్తుందని విపరీత ప్రచారం జరగటంతో పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి చేరారని; అంతమందికి అవసరమైన నియంత్రణ, నిర్వహణ ఏర్పాట్లు చేయకపోవటం వల్లే ఈ ఘోరం జరిగిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి బాధ్యత వహించాల్సిన యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వం ... తొక్కిసలాట జరిగిన 16 గంటల వరకూ ఎలాంటి అధికారిక ప్రకటనా చేయలేదు. ఈలోగానే బిజెపి రాష్ట్రమంత్రి ఒకరు 'ఇంతటి పెద్ద కుంభమేళా జరుగుతున్నప్పుడు- ఇలాంటి చిన్న చిన్న సంఘటనలు జరగటం మామూలే'నంటూ వ్యాఖ్యానించటం బాధ్యతారాహిత్యం.

కుంభమేళాల్లో తొక్కిసలాట జరిగి, భక్తులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు 1954, 1986, 2003, 2013 సంవత్సరాల్లో చోటు చేసుకున్నాయి. గతేడాది ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో జరిగిన ఒక ఆధ్యాత్మిక కార్యక్రమంలో బోలేబాబా పాదధూళి కోసం జనం ఎగబడిన సందర్భంలో తొక్కిసలాట జరిగి, 121 మంది చనిపోయారు. ఇటీవల తిరుపతిలో వైకుంఠ ద్వార దర్శనానికి వచ్చిన భక్తుల తొక్కిసలాటలో ఆరుగురు దుర్మరణం చెందారు. హజ్ యాత్రలో తొక్కిసలాట జరిగి వందలాది మంది ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. మత విశ్వాసాలు, లేదా ఇతర కారణాల వల్ల ఒకే ప్రదేశానికి, ఒక సమయంలో వేలల్లో, లక్షల్లో జనం చేరినప్పుడు ఊహించని ప్రమాదాలు జరగటానికి అవకాశం ఎక్కువ. అందుకు తగిన భద్రత, నియంత్రణ ఏర్పాట్లను, సదుపాయాలను పాలకులు సమకూర్చాల్సి ఉంటుంది. కుంభమేళా, పుష్కరాలు, హజ్ యాత్ర వంటి అతి పెద్ద జన సమూహ సమీకరణల సందర్భాల్లో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజలు చేరేది, సందర్శించేది నమ్మకంతో అయినప్పటికీ- ఆ నమ్మకాలను మరింతగా ప్రేరేపించే అతివ్యాప్తికి పాలకులు కారకులు కాకూడదు. ఫలానా చోటనే, ఫలానా రోజునే స్నానం చేస్తే, సేవిస్తే, సందర్శిస్తే పుణ్యలోకాలు సంప్రాప్తిస్తాయంటూ ప్రచారాలు ఊదరగొట్టకూడదు. కానీ, బిజెపి పాలనలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రెండూ కుంభమేళాను తమకు అనుకూల వేదికగా మార్చుకునే ప్రయత్నంలో- నేరుగా విపరీత ప్రచారాన్ని తలకెత్తుకున్నాయి. తమ పరివార సంఘాల చేత దేశంలోని వివిధ ప్రాంతాల ప్రజలను ప్రయాగరాజ్ దిశగా పరుగులెత్తించటాన్ని ఒక పనిగా పెట్టుకున్నాయి. లక్షలాది జనం ఒక చోట చేరినప్పుడు వారికి ఒక క్రమపద్ధతిలో నదీస్నానాలు ఆచరించేందుకు ఏర్పాట్లు చేయాలి. ఎప్పటికప్పుడు అవసరమైన సమాచారమూ, సహకారమూ అందించాలి. అలాంటి సమన్వయం లోపించటం వల్లే మంగళవారం అర్ధరాత్రి తొక్కిసలాట చోటు చేసుకొంది. విఐపి సందర్శకుల మీద పెడుతున్న శ్రద్ధాసక్తులు సామాన్య భక్తుల మీద చూపటం లేదని విమర్శ వినిపిస్తోంది. స్నాన ఘాట్ల సామర్థ్యాన్ని బట్టి భక్తులను నియంత్రించే బదులు - సంగమం ముఖద్వారం వద్దకు పెద్ద సంఖ్యలో జనాన్ని అనుమతించటం వల్లనే తొక్కిసలాటకు దారి తీసిందని పరిశీలకుల మాట.

ఈ కుంభమేళాలో యుపి ప్రభుత్వం అన్ని రకాల శాస్త్ర, సాంకేతిక పరికరాలను, పద్ధతులను ఉపయోగిస్తోంది. సాధువులు, సన్యాసుల మీద పూలవర్షం కురిపించేందుకు హెలికాప్టర్లు; వాహనాల రద్దీని అంచనా వేసేందుకు ట్రాకింగ్, సమాచార వ్యవస్థలూ రంగంలో ఉన్నాయి. ఇన్ని ఉండి కూడా తొక్కిసలాటను నివారించలేకపోవడం విచారకరం. జనవరి 13న ప్రారంభమైన ఈ మహా కుంభమేళా ఫిబ్రవరి 26 వరకూ కొనసాగనున్నందున- యోగి ప్రభుత్వం తక్షణం రక్షణ, భద్రత చర్యలను పటిష్టం చేయాలి. అతి ప్రచారానికి, విఐపి గౌరవాలకు సమయం తగ్గించి, అత్యధికంగా హాజరయ్యే సామాన్య భక్తుల భద్రతపై ఎక్కువ దృష్టి పెట్టాలి. పాప పుణ్యాలు, పవిత్ర స్నానాలు, మహిమాన్వితాలు వంటి విశ్వాసాలు ఎలా ఉన్నా- ఏర్పాట్లలో ఏమరుపాటు లేకుండా ప్రభుత్వాలే చూసుకోవాలి. జరిగేది అలౌకిక, విశ్వాసాల ఆధ్యాత్మిక మహా మేళా అయినప్పటికీ- భక్తులకు రక్షణ, భద్రత కల్పించాల్సింది పటిష్టమైన వాస్తవిక చర్యల ద్వారా మాత్రమే!

మహనీయుల మాట

దేవుడు మానవ కల్పితం.
స్వర్గ నరకాలు లేనే లేవు.
మతం, గుళ్లు, గోపురాలు అక్కర్లేదు.
కావలసింది మానవత్వం.
- లూథర్ బర్‌బాంక్,
ప్రముఖ వృక్ష శాస్త్రజ్ఞుడు.

పాఠశాలల్లో భారీగా పడిపోతున్న నమోదు

విశ్లేషణ



సుభాషిణీ అలీ

కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ఇటీవలనే జిల్లాలవారీగా విద్యా సంబంధమైన సమాచారాన్ని విడుదల చేసింది. దాంతోపాటే 2023లో-24లో మొత్తం విద్యార్థుల నమోదు డేటా కూడా వుంది. విద్యారంగంలో ఏదో గొప్ప అభివృద్ధి వచ్చేసినట్టుగా ప్రభుత్వం చెప్పుకుంటున్న గొప్పల పస ఏమిటో ఈ సమాచారం తేల్చివేసింది. అంతకు ముందుతో పోలిస్తే 2023-24లో మొత్తం విద్యార్థుల నమోదు కోటికి పైగా తగ్గిపోయినట్టు చెబుతున్నది. 2023-24లో మొత్తం విద్యార్థుల నమోదు 24.8 కోట్లుగా వుంది. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఇది 37 లక్షల మంది విద్యార్థులు తక్కువగా నమోదయ్యారు. అయితే 2018-19లో స్కూళ్లలో నమోదు 26.02 కోట్లుగా వుంది. తర్వాతి ఏడాది అంటే 2019-20లో ఇది 1.6 శాతం పెరిగి, 26.45 కోట్లకు చేరుకుంది. అంటే 42 లక్షల కంటే ఎక్కువ మంది అదనంగా చేరారన్నమాట. వెనక్కుపోతే 2012-13లో కూడా 26.3 కోట్ల నమోదు వుంది. 2012-24 మధ్య దేశ జనాభా పెరుగుదలను కూడా లెక్కలోకి తీసుకుంటే ఈ తగ్గుదల మరింత కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది.

2023-24లో మొత్తం విద్యార్థుల నమోదు 24.8 కోట్లుగా వుంది. అంతకు ముందు ఏడాదితో పోలిస్తే ఇది 37 లక్షల మంది విద్యార్థులు తక్కువగా నమోదు కావడాన్ని ఈ నివేదిక విశ్లేషించింది. 21 లక్షల మంది పురుష విద్యార్థులు తక్కువగా నమోదు కాగా... సంఖ్య 16 లక్షల మంది విద్యార్థినులు విద్యా రంగాన్ని వదలివెళ్లిపోయినట్టు చెబుతున్నది. నమోదు సంఖ్యను లెక్కగట్టడంలో గతంకన్నా మెరుగైన పద్ధతులు తీసుకువచ్చినట్టు మంత్రిత్వశాఖ చెబుతున్నది. బహుశా అంతకు ముందు సంవత్సరాలతో పోలిస్తే సంఖ్యలు తగ్గిపోవడానికి ఇది కారణమై వుండొచ్చునంటున్నది. అయితే ఈ తగ్గుదల ఆందోళనకరమైందనీ ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించే చర్యలు తీసుకోవాలని ఆ శాఖే చెబుతున్నది.

నూతన విధానంతో పెద్ద ఎత్తున స్కూళ్ల మూత

బీహార్ ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర వంటి బిజెపి పాలిత రాష్ట్రాలలో ఈ తగ్గుదల అత్యధికంగా వుందని గమనించడం చాలా ముఖ్యం. 2018-19లో బీహార్‌లో 2.49 కోట్లమంది విద్యార్థులు నమోదుకాగా ఇప్పుడు 2.13 కోట్లకు తగ్గిపోయారు (అంటే 35.65 లక్షల కంటే ఎక్కువగా తగ్గారు). ఉత్తర ప్రదేశ్‌లో 2018-19లో నమోదు 4.44 కోట్లు కాగా తాజా నివేదికలో ఈసారి 28.26 లక్షల మంది తగ్గి ఇప్పుడు 4.16 కోట్లకు చేరుకున్నారు. మహారాష్ట్రలో గతంలో 2.32 కోట్ల మంది నమోదైతే తాజా నివేదికలో ఆ సంఖ్య 2.13 కోట్లకు పడిపోయింది.

ఈ నివేదిక విడుదల తర్వాత ఈ తగ్గుదలకు కారణాలేమిటనే దానిపై వేర్వేరు నిపుణులు వేర్వేరు కారణాలు ముందుకు తెస్తున్నారు. విద్యా విధానంలో మార్పులు, ఆర్థిక కడగండ్ల పెరుగుదల, స్కాలర్‌షిప్ మొత్తాలు సకాలంలో విడుదల చేయకపోవడమో ఎగవేయడమో ముఖ్య కారణాలుగా వస్తున్నాయి.

బిజెపి ప్రభుత్వం మూడేళ్ల కిందట ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానం ప్రైవేటు విద్యకే పెద్ద పీట వేసింది. హర్యానా వంటి బిజెపి పాలిత రాష్ట్రాలు ప్రైవేటు స్కూళ్లలో చేరిన విద్యార్థులకు సబ్సిడీలిచ్చి ప్రభుత్వ స్కూళ్లలో ఫీజులు పెంచాయి. బిజెపి పాలిత రాష్ట్రాలలో అత్యధిక భాగం (కాంగ్రెస్, బిజెపి రెండింటి సర్కార్లు నడిచిన రాజస్థాన్ వంటి రాష్ట్రాలతో సహా) ప్రభుత్వ స్కూళ్లను భారీ ఎత్తున మూసివేయడం లేదా కలిపేయడం జరిగింది. అంటే పిల్లలు మరీ ముఖ్యంగా పేద కుటుంబాలకూ దళితులకూ సంబంధించిన పిల్లలు వెళ్లవలసిన స్కూళ్లు దూరమై పోయాయి. ఎంత దూరమంటే వారు వెళ్లడమే మానుకునేంత. ఇక బాలికల విషయంలో అంత దూరం ప్రయాణించడంలో భద్రతా సమస్యలు మరింత నిరుత్సాహ పరుస్తున్నాయి.

2018-19 మధ్య 50 వేలకు పైగా ప్రభుత్వ పాఠశాలలు మూత పడ్డాయని యు.డి.ఐ.ఎస్.సి (యుడైస్) 2022 నివేదిక పేర్కొంటున్నది. 2024లో యు.పి ప్రభుత్వం 27 వేల పాఠశాలలు మూసివేసింది. ప్రత్యేకించి బీహార్, మహారాష్ట్రలో ప్రైవేటు స్కూళ్లు ఉద్ధృతంగా ప్రారంభమవుతున్నాయి. ఈ రెండు రాష్ట్రాల్లో విద్యార్థుల నమోదు తగ్గడం, ఉత్తరప్రదేశ్‌లో స్కూళ్ల మూతలు చూస్తుంటే కేవలం ప్రైవేటు స్కూళ్లలో నమోదు పెరగడం ఒక్కటే సమస్యను పరిష్కరించలేదని అర్థమవుతుంది.

కేరళలో మెరుగైన ఫలితాలు

విద్యార్థుల నమోదు పెంచడానికే గాక వారు కొనసాగేలా చూడాలన్నా ఉచిత ప్రభుత్వ విద్య అందించడం ఏకైక మార్గమని కేరళ అనుభవం మనకు నొక్కి చెబుతుంది. విద్య నాణ్యత పెంచేందుకూ అదే మార్గం. 2021-22లో కేరళలో స్థూల నమోదు నిష్పత్తి (జి.ఇ.ఆర్) 41.3 శాతంగా వుంది. జాతీయ సగటు 28.4 శాతం కన్నా ఇది చాలా ఎక్కువ. ఒక నిర్దిష్ట వయో బృందంలో ఉన్నత విద్యా భాగస్వామ్యం ఏ స్థాయిలో వుందో తెలుసుకోవడానికి జి.ఇ.ఆర్ కీలక సూచిక. తాజాగా 2023-24 నివేదికలో కూడా కేరళ నమోదు సంఖ్యలు ఎంతో ప్రోత్సాహకరంగా వున్నాయి. ఈ రాష్ట్రంలో బాలికల చేరిక అబ్బాయిలను మించి వుండటం నిజంగా ప్రశంసనీయమైన విషయం. విద్యారంగంపై ప్రభుత్వ వ్యయం, ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల మెరుగుదల కోసం ప్రభుత్వం పెట్టే ఖర్చు, ఉపకార వేతనాలు సకాలంలో చెల్లించడం, స్కూళ్లలో ఆరోగ్యవంతమైన సుహృద్భావ పూర్వకమైన వాతావరణం కోసం కేటాయింపు ఇవన్నీ విద్యార్థుల నమోదు పెరగడానికి, నిలబడటానికి దోహదం చేస్తున్నాయి.

> **ప్రత్యేకించి పేదలు సామాజికంగా అణగారిన వర్గాల పిల్లలు అనేక రాష్ట్రాల్లో ఎదుర్కొంటున్న పరిస్థితిని పరిశీలించాలి. చాలా స్కూళ్లలో అమ్మాయిలకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు కూడా లేవని ఈ నివేదిక చెబుతున్నది. ఉన్నవాటిలో చాలా చోట్ల తలుపులు లేవు. చాలా బళ్లలో మంచినీటి సదుపాయం లేదు. అనేక స్కూళ్ల భవనాలు శిథిలావస్థలో వున్నాయి. తరగతి గదుల్లోకి వేలుతురే రాదు. కుర్చీలు, టేబుళ్ల కూడా వుండవు. అనేక రాష్ట్రాల్లో ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, ఉద్యోగులు పిల్లలపై అత్యాచారాలకు, లైంగిక హింసకు పాల్పడిన ఘటనలు జరిగాయి. దేశంలో అత్యధిక చోట్ల స్కూళ్లలో కుల వివక్ష సంఘటనలు లెక్కలేనన్ని జరిగాయి. విద్యారంగంలో విచారకరమైన ఈ పరిస్థితికి ఇవన్నీ కారణాలే.**

కనీస సదుపాయాల లేమి

యుడైస్ తాజా నివేదిక వెల్లడించే అంశాలు విద్యార్థుల సమస్యల కోణం నుంచి కూడా చూడాలి. ప్రత్యేకించి పేదలు సామాజికంగా అణగారిన వర్గాల పిల్లలు అనేక రాష్ట్రాల్లో ఎదుర్కొంటున్న పరిస్థితిని పరిశీలించాలి. చాలా స్కూళ్లలో అమ్మాయిలకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు కూడా లేవని ఈ నివేదిక చెబుతున్నది. ఉన్నవాటిలో చాలా చోట్ల తలుపులు లేవు. చాలా బళ్లలో మంచినీటి సదుపాయం లేదు. అనేక స్కూళ్ల భవనాలు శిథిలావస్థలో వున్నాయి. తరగతి గదుల్లోకి వేలుతురే రాదు. కుర్చీలు, టేబుళ్ల కూడా వుండవు. అనేక రాష్ట్రాల్లో ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు, ఉద్యోగులు పిల్లలపై అత్యాచారాలకు, లైంగిక హింసకు పాల్పడిన ఘటనలు జరిగాయి. దేశంలో అత్యధిక చోట్ల స్కూళ్లలో కుల వివక్ష సంఘటనలు లెక్కలేనన్ని జరిగాయి. విద్యారంగంలో విచారకరమైన ఈ పరిస్థితికి ఇవన్నీ కారణాలే.

ఏకోపాధ్యాయులు, పారా టీచర్లు

చాలా రాష్ట్రాల్లో ప్రస్ఫుటంగా కనిపించే పెద్ద లోపం ఏకోపాధ్యాయ పాఠశాలలు పెద్ద సంఖ్యలో వుండటం. ఉదాహరణకు ఒకే టీచరు నాలుగు నుంచి ఆరు క్లాసులు ఇంకా ఎనిమిది క్లాసులు కూడా చూసుకునే పరిస్థితి వుంది. ప్రభుత్వ నివేదికల ప్రకారం 2023-24లో భారత దేశంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు 1,10,971 వున్నాయి. ఇలాంటి పాఠశాలల్లో 89 శాతం గ్రామీణ ప్రాంతాల్లోనే వున్నాయి. అరుణాచల్ ప్రదేశ్, గోవా, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో ఏకోపాధ్యాయ పాఠశాలలు ఎక్కువగా వున్నాయి. హిమాచల్ ప్రదేశ్‌లో ఏకోపాధ్యాయ పాఠశాలలు అధికంగా వుండగా కేరళలో కూడా కొన్ని వున్నాయి. కాని వాటిలో విద్యార్థుల సంఖ్య చాలా తక్కువ. హిమాచల్ ప్రదేశ్‌లో ఏకోపాధ్యాయ పాఠశాలల్లో 20 మంది కన్నా తక్కువగా పిల్లలున్నారు. కేరళలోనైతే వాటిలో సగటున పదిమంది పిల్లలున్నారు. నిజానికి కేరళలో ఏకోపాధ్యాయ పాఠశాలలు అతి తక్కువగా వుండగా వాటిలో పిల్లల సంఖ్య కూడా దేశంలోకెల్లా తక్కువగా వుంది. సగటున ఒక ఏకోపాధ్యాయ పాఠశాలలో 70, బీహార్‌లోనైతే 96 మంది పిల్లలు వున్న పరిస్థితితో పోలిస్తే ఇది చాలా మెరుగ్గా వుంటుంది.

అందువల్ల ఇక్కడ ప్రభుత్వ తాజా నివేదికలో ఆందోళన కలిగించేది పిల్లల నమోదు తగ్గిపోవడం ఒక్కటే కాదు. పాఠశాలల్లో వసతులు అధ్వాన్నంగా వుండటం, చాలా స్కూళ్లలో బోధనా ప్రమాణాలు కూడా దారుణంగా వుండటం. ఈ విషయంలోనూ కేరళ పరిస్థితి చాలా మెరుగ్గా వుంది. ఇక్కడ ముఖ్యంగా గమనించాల్సింది ఏమంటే కేరళలో ప్రభుత్వ పాఠశాలల్లో పారాటీచర్లు, కాంట్రాక్టు టీచర్ల నియామకమే లేదు. అక్కడ టీచర్ల ఉద్యోగాలు పర్మనెంటు పోస్టులు. వారు తమ బోధనా నైపుణ్యాన్ని బోధనా పద్ధతులను నిత్యం మెరుగు పర్చుకుంటుంటారు. ఆ ప్రక్రియపై పర్యవేక్షణా నిరంతరంగా సాగుతుంటుంది. దీంతో పోలిస్తే యు.పి లో 24 వేల మంది కాంట్రాక్టు పద్ధతిలో ఆదేశాల ఉపాధ్యాయులు వున్నారు. ఎనిమిదో తరగతి వరకూ బోధించేందుకు గాను వీరికి రూ.7000 ఇస్తారు. వారిలో చాలా మంది అవసరమైన అదనపు ఆదాయంకోసం టైలర్లు, ఆటో డ్రైవర్లు, దుకాణాలలో సహాయకులుగా పని చేస్తుంటారు. అంతేగాక 1,42,000 విద్యా మిత్రలను కూడా వార్షిక కాంట్రాక్టు పద్ధతిలో నియమించుకున్నారు. ఏ క్షణంలోనైనా ఉద్యోగం ఊడిపోవచ్చుననే భయంలో కొట్టుమిట్టాడే వారు బోధనపై శ్రద్ధ పెట్టడం ఊహకందని విషయం. ఇంతేగాక ప్రభుత్వ పాఠశాలల్లో లక్షమంది ప్రిన్సిపాళ్లు, టీచర్ల పోస్టులు ఖాళీ పడి వున్నాయి.

చాలా రాష్ట్రాల పాఠశాలల్లో నమోదు తగ్గిపోవడం, విద్యా ప్రమాణాలు నాసిగా వుండటం భవిష్యత్తుపై చాలా హానికర ప్రభావం చూపిస్తాయి. నమోదులోనూ పిల్లలను నిలబెట్టు కోవడంలోనూ కేరళ విజయం ఉత్సాహకరంగా వుంది. దాంతోపాటే ప్రభుత్వ విద్యా వ్యవస్థలో నిరంతరం మెరుగుదల తీసుకురావడం, కూడా విస్తృతంగా ప్రచారం చేయవలసి వుంది. అత్యవసరమైన ఈ మార్పులు సాధించాలంటే ఆ విజయాలకు కారణమైన అక్కడి పద్ధతులను అనుసరించడం కూడా కీలకమవుతుంది.

/ వ్యాసకర్త మాజీ ఎంపీ, 'ఐద్వా' పూర్వ జాతీయ అధ్యక్షురాలు /

ఆదివాసీలకు అన్యాయం!

సమస్య

కిల్లో సురేంద్ర

> **అరకు ఎన్నికల సభలో చంద్రబాబు నాయుడు జీవో నంబర్ 3 చట్టబద్ధతకు హామీనిచ్చి ఏడు నెలలు గడిచినా అతీగతీ లేదు. ఎన్నికల హామీ ప్రకారం ఏజెన్సీ షెడ్యూల్ ఏరియాలో 100 శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ నియామక సాధనకు, ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలకు పోరాటం చేస్తున్న ఆదివాసీల సమస్యలను పరిష్కరించనేలేదు. పైగా ఆదివాసీ భూములకు రక్షణ కవచంగా ఉన్న 1/70 చట్టాన్ని సవరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఆదివాసీ భూములను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నాన్ని ఆదివాసీలతో పాటు అందరం ఐక్యంగా పోరాటానికి సిద్ధం కావాల్సి వుంది.**

టూరిజం అభివృద్ధి పేరుతో 'విజన్ 2047'లో భాగంగా 1/70 చట్ట సవరణకు రాష్ట్ర కుటమి ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తున్నది. ఇటీవల జరిగిన టూరిజం ప్రాంతీయ పెట్టుబడిదారుల సదస్సులో సభాపతి అయ్యన్న పాత్రుడు మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతంలో టూరిజం అభివృద్ధి కోసం హోటళ్లు, రెస్టారెంట్లు, పార్కులకు పెట్టుబడులు పెట్టాలంటే 1/70 చట్ట సవరణకు రాష్ట్ర ప్రభుత్వం, అధికార యంత్రాంగం లోతైన అధ్యయనం చేయాలని ప్రకటించడం ఆదివాసీలకు తీవ్ర ద్రోహం చేయడమే. పైగా షెడ్యూల్ ఏరియాలో టూరిజం అభివృద్ధికి 1/70 చట్టం అడ్డంగా ఉందని, చట్టం సవరించాలని కూడా అయ్యన్న పాత్రుడు పేర్కొనడం...వ్యక్తిగత అభిప్రాయమో లేక కూటమి ప్రభుత్వ విధానమో స్పష్టం చేయడం అవసరం.

2000 సంవత్సరంలో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాడేరు ఏజెన్సీలోని చింతపల్లి జర్రేలలో ఉన్న 515 మిలియన్ టన్నుల బాక్సైట్ నిక్షేపాల తవ్వకాలకు దుబాయ్ కంపెనీతో ఒప్పందం చేసుకుని గిరిజన సలహా మండలిలో 1/70 చట్టం సవరించడానికి పూనుకున్నారు. అప్పటి సిపిఎం భద్రాచలం ఎంఎల్‌ఎ సున్నం రాజయ్య మాత్రమే 1/70 చట్టం రక్షణకు నికరంగా నిలబడ్డారు. ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ ఓట్ల కోసం బాక్సైట్ తవ్వకాలకు వ్యతిరేకంగా నిలబడి అధికారం వచ్చిన వెంటనే 2006లో ముఖ్యమంత్రి వై.ఎస్ రాజశేఖర రెడ్డి రూ.8000 కోట్లతో రాస్ ఆల్ ఖైమ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఆదివాసి గిరిజన సంఘం, వివిధ ఆదివాసీ సంఘాలు, సిపిఎం, వామపక్ష పార్టీల అండతో చేసిన సుమారు 20 ఏళ్ల సుదీర్ఘ పోరాటంతో బాక్సైట్ తవ్వకాల ఒప్పందాలు రద్దు చేయడమైనది.

1/70 చట్టం అమలులో ఉండగానే అరకు, పాడేరు, చింతపల్లి, రంపచోడవరం, జీలుగుమిల్లి, పార్వతీపురం, మన్యం జిల్లాలో, ఇతర ప్రాంతాలలో బినామీ పేర్లతో లాడ్జీలు, షాపింగ్ కాంప్లెక్సులు, రిసార్టుల నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతున్నాయి. అల్లూరి జిల్లా చింతపల్లి, ఎర్రవరం, పెదకోట, మన్యం జిల్లా సాలూరు, అనకాపల్లి జిల్లా చింతలపూడి దగ్గర హైడ్రో ఎలక్ట్రికల్ పవర్ ప్రాజెక్ట్, ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం వంకాయవారిపాలెం దగ్గర ఆయుధ కర్మాగారం నిర్మాణానికి 1/70 చట్టం ఉల్లంఘించి ఒప్పందం చేసుకుని వేల ఎకరాల భూములు, అడవులు ధారాదత్తం చేస్తున్నది. ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలంలో 3000 ఎకరాల పరిధిలోని అదాని ఆయుధ కర్మాగారం నిర్మాణానికి ఆదివాసీల హక్కులను ఉల్లంఘించి నిర్మాణం ముమ్మరం చేసింది. గత ప్రభుత్వం చేసిన ఒప్పందాలనే ప్రస్తుత కూటమి ప్రభుత్వం అమలు చేస్తూ ఆదివాసీల హక్కులను ధ్వంసం చేస్తున్నది.

1970లో ఆదివాసీల పోరాట ఫలితంగా ఆదివాసీ అభివృద్ధి కోసం 1/70 చట్టాన్ని సాధించాం. నేడు పెట్టుబడిదారుల అభివృద్ధి కోసం ఆ చట్టాన్ని సవరించేందుకు కుట్ర చేస్తున్నారు. షెడ్యూల్ ప్రాంత చట్టమైన 1/70లో కలుగచేసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి లేదు. షెడ్యూల్ ప్రాంతంలో చట్టాలు చెయ్యాలన్నా తొలగించాలన్నా రాష్ట్రపతికే అధికారం ఉన్నది. షెడ్యూల్ ప్రాంతంలో గ్రామసభ అధికారాలు, కేంద్ర అటవీ పర్యావరణ చట్టాన్ని సవరించి షెడ్యూల్ ప్రాంతంలో విస్తృతమైన అధికారాలు ఉన్న పీసా చట్టం అధికారాలు, 2006 వామపక్షాలు ఒత్తిడితో తెచ్చిన అటవీ హక్కుల చట్ట అధికారాలు ఇటీవలి కేంద్ర బిజెపి ప్రభుత్వం తొలగించింది. ఆ అంశాలనే ఇప్పుడు అయ్యన్న పాత్రుడు మాట్లాడారు. కేంద్ర బిజెపి, రాష్ట్ర తెలుగుదేశం కూటమి ప్రభుత్వం షెడ్యూల్ ప్రాంతంలో ఆదివాసీలకు రక్షణగా ఉన్న చట్టాలను తొలగించేందుకు చేస్తున్న కుట్రలను ఆదివాసీలు తిప్పి కొట్టాల్సిన సమయం ఆసన్నమైంది.

అరకు ఎన్నికల సభలో చంద్రబాబు నాయుడు జీవో నంబర్ 3 చట్టబద్ధతకు హామీనిచ్చి ఏడు నెలలు గడిచినా అతీగతీ లేదు. ఎన్నికల హామీ ప్రకారం ఏజెన్సీ షెడ్యూల్ ఏరియాలో 100 శాతం ఉద్యోగ, ఉపాధ్యాయ నియామక సాధనకు, ఏజెన్సీ స్పెషల్ డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలకు పోరాటం చేస్తున్న ఆదివాసీల సమస్యలను పరిష్కరించనేలేదు. పైగా ఆదివాసీ భూములకు రక్షణ కవచంగా ఉన్న 1/70 చట్టాన్ని సవరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఆదివాసీ భూములను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నాన్ని ఆదివాసీలతో పాటు అందరం ఐక్యంగా పోరాటానికి సిద్ధం కావాల్సి వుంది.

/ వ్యాసకర్త ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,
సెల్ : 9490630715 /

హిందుత్వ మతోన్మాద బీభత్సం

వ్యాఖ్య

భారత రాజ్యాంగం 75వ వార్షికోత్సవం జరుపుకుంటున్న తరుణంలో సైతం రాజ్యాంగం కల్పించిన ఐక్యత, లౌకికవాదం ఎంతకాలం కొనసాగుతాయోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది. భారత్‌ను హిందూ దేశంగా మార్చేందుకు కేంద్ర పాలకులు ఉద్దేశపూర్వకంగా వేస్తున్న ఎత్తుగడలే ఆ ఆందోళనకు కారణం. మతం, కులాల ప్రాతిపదికన ప్రజలను విభజించి మత కల్లోలాలు సృష్టించేందుకు సంఘ్ పరివార్ శక్తులు నిరంతరం ప్రయత్నిస్తున్నాయి.

భిన్న మతాల వారు సోదరభావంతో మెలగాల్సిన దేశంలో మత విద్వేషాలను రెచ్చగొట్టే ఎత్తుగడ సాగుతున్నట్లు గత కొద్ది రోజులుగా వెలువడుతున్న గణాంకాలు తెలియ జేస్తున్నాయి.

గత సంవత్సరం మత హింస 84 శాతం పెరిగిందనే దిగ్భ్రాంతికరమైన గణాంకాలను సెంటర్ ఫర్ సొసైటీ అండ్ సెక్యులరిజం (సి.ఎస్.ఎస్.ఎస్) సంస్థ విడుదల చేసింది. 2023లో 32 మత ఘర్షణలు జరిగాయి. గత ఏడాది 59 చోటుచేసుకున్నాయి. వీటిలో ఎక్కువ శాతం బిజెపి పాలిత రాష్ట్రాల్లోనే ఉన్నాయి. మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, బీహార్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో 46 మత ఘర్షణలు జరిగాయి. దేశంలో పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని ఈ సమాచారం వెల్లడిస్తోంది.

దేశంలోని అనేక ప్రాంతాల్లో హిందుత్వ మతోన్మాద మంటలు రగులుతున్నాయి. అమాయక ప్రజలను సజీవ దహనం చేస్తున్నారు. నిలువునా మనుషులను నరికివేస్తున్నారు. 1992లో బాబ్రీ మసీదు కూల్చివేత తర్వాత హిందుత్వ మతోన్మాదం పెరిగింది. 2002లో గుజరాత్ మారణహోమం మరో దశగా చెప్పుకోవచ్చు. వీటన్నింటికీ కొనసాగింపుగా తరచూ మత ఘర్షణలు జరుగుతున్నాయి.

మైనారిటీలను లేకుండాచేసి ఆధిపత్యాన్ని నెలకొల్పాలన్న సంఘ్ పరివార్ ఎజెండా అమలులో భాగమే ఈ విద్వేషాలు. బిజెపి ప్రభుత్వాలే నేరుగా మత కల్లోలాలకు నాయకత్వం వహించడం కూడా నేటి తాజా ధోరణి. ఉత్తరాది రాష్ట్రాల్లో మైనారిటీల ప్రార్థనా స్థలాలు, ఇళ్లు, ఇతర సంస్థలను కూల్చివేయడానికి బుల్డోజర్లను ఉపయోగిస్తున్నారు. బుల్డోజర్ రాజ్‌కు స్వస్తి పలకాలని సుప్రీంకోర్టు చెప్పినా...బిజెపి ప్రభుత్వాలు తమకది వర్తించదని దురహంకార పూరితంగా పేర్కొన్నాయి. వివిధ మతాల పండుగ రోజుల్లో తరచూ గొడవలు, అల్లర్లు సృష్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

మైనారిటీ వర్గానికి చెందినవారు తరచూ కేసుల్లో చిక్కుకుని జైళ్ల పాలవుతున్నారు. దేశద్రోహ నేరం కింద బెయిల్ కూడా రాకుండా కారాగారాల్లో ఉంచుతున్నారు. వివాదాల ముసుగులో ప్రజలను చంపడమే కాకుండా, భారీ నష్టం కలిగించడం, మానని గాయాలను చేయడం ద్వారా విశ్వాసుల మధ్య శతృత్వం సృష్టించడం సంఘ పరివార్ వ్యూహం. ప్రజలను విభజించి తమ రాజకీయ అధికారాన్ని ఏర్పాటు చేసుకోవడం ద్వారా మత రాజ్య స్థాపనకు మార్గాన్ని సులభతరం చేసేందుకది ప్రయత్నిస్తోంది. గోహత్య నిషేధం, ఏకరూప పౌరస్మృతి, ఒకే దేశం ఒకే ఎన్నికలు వంటి బిజెపి ప్రభుత్వాల పథకాలన్నీ ఇందుకు సిద్ధం అవుతున్నాయి.

ముస్లింలు, క్రైస్తవులను లక్ష్యంగా చేసుకుని అల్లర్లు జరుగుతున్నాయి. రాజకీయ, పరిపాలనా నాయకత్వం వెంటనే జోక్యం చేసుకోకపోతే, క్రైస్తవుల ఉనికి ప్రమాదంలో పడుతుందని 'యునైటెడ్ క్రిస్టియన్ ఫోరమ్' (యు.సి.ఎఫ్) ఇటీవల విడుదల చేసిన నివేదిక పేర్కొంది. పెరుగుతున్న దాడుల ఆధారంగా యు.సి.ఎఫ్ దీనిని రూపొందించింది. 2014లో క్రైస్తవులపై 127 దాడులు జరగ్గా, 2024 నాటికి వాటి సంఖ్య 834కి పెరిగింది.

దేశంలో మతవాదులకు చోటు కల్పించని ఏకైక రాష్ట్రం కేరళ అని 'సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ సొసైటీ అండ్ సెక్యులరిజం' (సి.ఎస్.ఎస్.ఎస్) నివేదిక నొక్కి చెప్పింది. వామపక్షాలు పాలించడం, సమాజంలో వామపక్ష భావజాలమే పైచేయి కావడం వల్ల కేరళలో మతవాదులు వేళ్లానుకోలేకపోతున్నారు. మనుస్మృతి ఆధారంగా హిందుత్వ రాష్ట్రాన్ని స్థాపించేందుకుగాను కేంద్ర పాలకులు వేస్తున్న ఎత్తుగడలను ఎదుర్కోవడానికి భారత రాజకీయాల్లో లౌకికవాద ఆలోచన బలపడాలి. వామపక్షాలు బలోపేతం కావడమే అందుకు ఏకైక మార్గం.

/ 'దేశాభిమాని' సంపాదకీయం /

హైకోర్టు శాశ్వత బెంచ్ ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్

కర్నూలులో హైకోర్టు శాశ్వత బెంచ్ ఏర్పాటుకు కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు గురువారం స్థల పరిశీలన చేశారు. కర్నూలు నగరంలోని ఎపి ఇఆర్‌సి, ఎపి ఎస్‌పి రెండో బెటాలియనులో పలు ప్రభుత్వ భవనాలను ఆర్‌డిఒ సందీప్ కుమార్, ఆర్ అండ్ బి, కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు గురువారం పరిశీలించారు. స్థలం, వసతులపై పరిశీలన చేశారు. హైకోర్టు శాశ్వత బెంచ్ ఏర్పాటు కోసం అన్ని వసతులూ ఉన్న స్థలాన్ని చూడాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు రిజిస్ట్రార్ (విజిలెన్స్) ఆర్‌సిఒ నెంబర్ 503/౦0/2024 ఇచ్చారు. ఈ నేపథ్యంలో కర్నూలు కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశాల మేరకు అధికారులు స్థల పరిశీలన చేశారు. అధ్యయనం అనంతరం జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇవ్వనున్నారు.

గ్రీన్ ఎనర్జి కారిడార్‌కు నిధులు పెంచాలి

- కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన మంత్రి గొట్టిపాటి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పునరుత్పాదక విద్యుదుత్పత్తిని రాష్ట్ర వ్యాప్తంగా సమర్థవంతంగా వినియోగించుకునేందుకు గ్రీన్ ఎనర్జీ కారిడార్‌కు కేంద్రం గ్రాంట్‌ను పెంచాలని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కోరారు. డిస్కంల నష్టాలపై వివిధ రాష్ట్రాల మంత్రులతో కేంద్ర విద్యుత్‌శాఖ అధికారులు గురువారం వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న గొట్టిపాటి బ్యాటరీ స్టోరేజ్ కెపాసిటీని వెయ్యి నుంచి 2 వేల మెగా వాట్లకు పెంచాలని కోరారు. ఈ సమావేశంలో జెన్‌కో ఎమ్‌డి చక్రధర్‌బాబు, ట్రాన్స్‌కో జెఎమ్‌డి కీర్తి చేకూరి, ఎపిసిపిడిసిఎల్ సిఎమ్‌డి ఎకెవి భాస్కర్ పాల్గొన్నారు.

లక్ష్మిని ప్రభుత్వం ఆదుకోవాలి

- మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అల్లూరి సీతారామరాజు జిల్లాలో పాఠశాలలో వంట చేస్తుండగా ప్రమాదంలో గాయాలపాలైన కార్మికురాలు లక్ష్మికి రాష్ట్ర ప్రభుత్వం సహాయం చేసి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) కోరింది. ఈ మేరకు మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్‌కు యూనియన్ ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి గురువారం వినతిపత్రం అందించారు. వంట చేసే సమయంలో కార్మికులు ఇలాంటి ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థికంగా ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. పాఠశాలల్లో ప్రథమ చికిత్స కిట్‌ను ఏర్పాటు చేయాలని, ప్రమాదాల్లో మృతిచెందిన కార్మికులకు నష్టపరిహారంగా రూ.20 లక్షలు అందించాలని, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు.

దూసుకొచ్చిన చైనా డీప్‌సీక్

- వాల్‌స్ట్రీట్ బెంబేలు
- పోటీపై దృష్టి పెట్టాలి : ట్రంప్



న్యూఢిల్లీ: అమెరికాలోని దిగ్గజ కృత్రిమ మేధా (ఎఐ) కంపెనీలకు దీటుగా చైనాకు చెందిన డీప్‌సీక్ అత్యంత ప్రభావవంతమైన ఎఐ మోడల్‌తో గణనీయమైన పురోగతిని సాధించింది. డీప్‌సీక్ తన దూకుడుతో వాల్‌స్ట్రీట్‌లోని పశ్చిమ దేశాల ఎఐ కంపెనీలకు వణుకు పుట్టిస్తోంది. ఆయా కంపెనీల షేర్లు కుదేలవుతున్నాయి. ఈ రంగంలో అమెరికా, చైనా తీవ్రంగా పోటీపడుతున్నాయి. ఇందులో భారత్ చొరవ చాలా పేలవంగా ఉందని టెకీల నుంచి విమర్శలు పెరిగాయి. బహు భాషల్లో ఆవిష్కరించిన డీప్‌సీక్ ఎఐలో ప్రధాన సంస్థగా నిలుస్తోంది. పూర్తి అడ్వాన్స్ ఎఐ మోడల్‌ను పూర్తిగా ఉచితంగా అందిస్తుండడం విశేషం. పశ్చిమ దేశాలతో పోల్చితే అతి తక్కువ ఖర్చుతో దీన్ని అభివృద్ధి చేసింది. ఈ రంగంలో తమకు పోటీ లేదనుకున్న వేళ డీప్‌సీక్ దూకుడు అమెరికాకు మింగుడుపడటం లేదు. డీప్‌సీక్ పురోగతిపై ఏకంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ.. ఇది అమెరికన్ కంపెనీలకు మేల్కొలుపు కావాలని అన్నారు. ఈ ఆటలో గెలవడానికి పోటీ పడాలని తమ దేశ సంస్థలకు సూచించారు. డీప్‌సీక్‌ను ఓపెన్‌ఎఐ సిఇఒ సామ్ ఆల్ట్‌మాన్ కూడా ప్రశంసించారు. తమకు కొత్త పోటీదారు రావడం ఉత్తేజకరమని ఆల్ట్‌మాన్ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

డీప్‌సీక్ సూపర్ హిట్ కావడం ఈ సాంకేతిక పురోగతిపై భారత్ సహా ఇతర దేశాలు ఎలా స్పందించాలనే దానిపై ఉత్సుకత, చర్చలకు దారితీసింది. భారత్‌కు చెందిన ఎఐ స్టార్టప్ అయిన సర్వమ్ ఎఐ 200 కోట్ల అంశాలతో ఓ వేదికను అభివృద్ధి చేస్తోంది. ఇది భారతీయ భాషల్లో రానుంది. డీప్‌సీక్ మోడల్ ఏకంగా 67,100 కోట్ల అంశాలతో అభివృద్ధి చేయబడింది. ఎఐలో భారత్ రాణించడానికి కావాల్సిన మూలధనం, ప్రతిభ, సామర్థ్యం ఉందని జులియా ప్రోగ్రామింగ్ లాంగ్వేజ్ కో-ఇన్వెంటర్ విరాల్ షా పేర్కొన్నారు. ప్రముఖ గ్లోబల్ వెంచర్ క్యాపిటల్ సంస్థలు భారత్‌లో కార్యాలయాలను స్థాపించాయని, ఎన్విడియా, ఇంటెల్ చిప్‌లలో ఎక్కువ భాగంగా భారత్‌లోనే రూపొందించబడ్డాయని అన్నారు. ఎఐ కోసం సమయం పడుతుందన్నారు. వ్యాపార సౌలభ్యాన్ని మెరుగుపరచడం, ఉన్నత విద్యను మెరుగుపరచడం, డీప్‌టెక్‌పై ఆర్‌అండ్‌డి పెట్టుబడిని పెంచడం ద్వారా మన పొరపాట్లను సరిదిద్దుకోవడానికి మొత్తం పర్యావరణ వ్యవస్థ కలిసి రావాలన్నారు. భారతీయ పారిశ్రామికవేత్తలు, వ్యాపార సంస్థలు, వెంచర్ క్యాపిటలిస్టులు ఎఐలో బలమైన ఉనికిని సాధించడానికి కొత్త ఆలోచనలతో పెట్టుబడి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు.

గ్లోబల్ ఎఐ రేస్‌లో సామర్థ్యం గల మోడల్‌లను అభివృద్ధి చేయడానికి భారత్ ప్రధాన పరిశోధనలో మరింత పెట్టుబడి పెట్టాల్సిన అవసరం ఉందని గార్ట్‌నర్ వైస్ ప్రెసిడెంట్ అరుణ్ చంద్రశేఖరన్ పేర్కొన్నారు. కోర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, అత్యాధునిక డేటా సెంటర్‌లు, ఎనర్జీ, కూలింగ్ టెక్నాలజీలు, కంప్యూటర్ చిప్‌ల కోసం ఇది చాలా ఎక్కువ ఖర్చు చేయాల్సి ఉంటుందన్నారు. అంతకుమించి భారత విశ్వవిద్యాలయాలలో పరిశోధనలు జరగాలన్నారు. తెలివైన వ్యక్తులను ఒక తాటిపైకి తీసుకురావడం లాంటి చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. చైనాలోని కంపెనీలు ప్రధానంగా హార్డ్‌వేర్‌పైనే రాణించడం ప్రస్తుత ఎఐ వ్యూహం విజయానికి దోహదపడిందని ఇండ్కల్ టెక్నాలజీ సిఇఒ, ఫౌండర్ ఆనంద్ దేబే పేర్కొన్నారు.

ఎఐ, క్వాంటిటేటివ్ ఫైనాన్స్‌లో నిపుణుడైన చైనా ఇంజినీర్ లియాంగ్ వెన్ ఫెంగ్ 2023లో డీప్‌సీక్‌ను ఏర్పాటు చేశారు. దీనికి డీప్‌సీక్ ఆర్1గా పేరు పెట్టారు. ఎఐ మోడల్స్‌ను అందిపుచ్చుకోవడానికి అమెరికన్ కంపెనీలు బిలియన్ డాలర్లు (వేల కోట్ల రూపాయలు) వ్యయం చేస్తుంటే.. డీప్‌సీక్ కేవలం 6 మిలియన్ డాలర్లు (రూ.52 కోట్లు) ఖర్చు చేయడం విశేషం. సాంకేతిక ఆధిపత్య పోటీలో చైనా ముందుకు వెళ్లకుండా అడ్డుకోవడానికి జిపియు సెమీ కండక్టర్ల వంటి హైఎండ్ టెక్నాలజీలను ఆ దేశానికి ఎగుమతి చేయడాన్ని అమెరికా నిషేధించింది. అమెరికా నుంచి ఇలాంటి సవాళ్లను ఎదుర్కొని డీప్‌సీక్ రాణించడం విశేషం.

తక్కువ ఖర్చుతో ప్రకంపనలు : మంత్రి వైష్ణవ్

చైనాకు చెందిన డీప్‌సీక్ తక్కువ ఖర్చుతో ఎఐ రంగంలో ప్రకంపనలు సృష్టించిందని భారత ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ పేర్కొన్నారు. ఇక్కడ డేటా ప్రైవసీకి సంబంధించిన ఆందోళనల పరిష్కారం కోసం భారత సర్వర్ల నుంచే దీన్ని హోస్ట్ చేస్తామన్నారు. భారత్‌లో ఎఐ సేఫ్టీ ఇన్‌స్టిట్యూట్‌ను సైతం ప్రారంభిస్తామన్నారు. రాబోయే కొన్ని నెలల్లో భారత్ సొంత జనరేటివ్ ఎఐ మోడల్‌ను అభివృద్ధి చేసుకోబోతోందన్నారు. భాషా, సాంస్కృతిక వైవిధ్యాన్ని దృష్టిలో పెట్టుకుని దేశీయ అవసరాల కోసం అతితక్కువ ఖర్చుతో ఎఐ మోడల్‌ను రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం ఇప్పటివరకు ఆరుగురు డెవలపర్లను గుర్తించామన్నారు. వచ్చే ఎనిమిది, పది మాసాల్లో ఎఐ మోడల్‌ను ఆవిష్కరించే అవకాశం ఉందన్నారు.

మెప్మా ఆధ్వర్యాన సిటీ లైవ్లీహుడ్ యాక్షన్ ప్లాన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యాన రాష్ట్రంలోని పట్టణాల్లో పేదరిక నిర్మూలన కోసం సిటీ లైవ్లీహుడ్ యాక్షన్ ప్లాన్ (సి-ఎల్‌ఎపి) అమలు చేస్తున్నట్లు డైరెక్టర్ తేజ్ భరత్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీకాకుళం, రాజమండ్రి, ఒంగోలు, గుంటూరు, కాకినాడ, కడప, విజయనగరం, విజయవాడ, కర్నూలు, అనంతపురం, విశాఖపట్నం, మచిలీపట్నం, తిరుపతి, నెల్లూరు, చిత్తూరు, మంగళగిరి మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో కమిషనర్ల ఆధ్వర్యాన ఈ నెల 28 నుంచి సి-ఎల్‌ఎపి టాస్క్‌ఫోర్స్ కమిటీలు, ఎంఎస్‌ఎంఇ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యాన ఐదేళ్లకు యాక్షన్ ప్లాన్ రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. పట్టణ పేదలకు జీవనోపాధి అవకాశాలు మెరుగుపరచడం, నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టుతో ఆర్థికంగా వెనుకబడిన తరగతులకు ప్రోత్సాహం అందించడమే కాకుండా వారి సామర్థ్యాలను పెంచి స్వయం ఉపాధికి వీలు కల్పించే విధంగా ప్రత్యేక ప్రణాళికలు అమలు చేయనున్నట్లు తెలిపారు.

పంజాబ్ సిఎం నివాసంలో ఇసి సోదాలు

- ఖండించిన ఆప్

న్యూఢిల్లీ : మరికొన్ని రోజుల్లో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా దేశ రాజధాని ఢిల్లీలోని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్‌సింగ్‌మాన్‌కు చెందిన నివాసంలో గురువారం ఎన్నికల కమిషన్ (ఇసి) అధికారులు సోదాలు నిర్వహించడం సంచలనంగా మారింది. కోపర్నికస్ మార్గ్‌లో ఉన్న కపుర్తలా హౌస్‌లో ఈ సోదాలు జరిగాయి. ఎన్నికల్లో ప్రలోభాలకు గురిచేయడం కోసం నగదు పంపిణీ జరిగిందనే ఫిర్యాదు రావడంతో సోదాలు జరుపుతున్నట్లు ఒక అధికారి విలేకరులకు తెలిపారు. ఎన్నికల కమిషన్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులతో పాటు ఢిల్లీ పోలీసులు కూడా సోదాల్లో పాల్గొన్నారు. పంజాబ్ ప్రభుత్వ స్టిక్కర్‌తోపాటు ఆ రాష్ట్ర రిజిస్ట్రేషన్ నంబర్‌ను కలిగి ఉన్న ఒక ప్రైవేట్ వాహనాన్ని ఢిల్లీ పోలీసులు స్వాధీనం చేసుకున్న ఒక రోజు తరువాత ఈ సోదాలు జరగడం గమనార్హం. పంజాబ్ భవన్ సమీపంలో స్వాధీనం చేసుకున్న వాహనంలో మద్యం, నగదు, ఆప్ ఎన్నికల ప్రచార సామాగ్రి ఉన్నాయని ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సోదాలను ఆప్ తీవ్రంగా ఖండించింది.

ఎమ్మెల్సీ ఎన్నికలపై లోకేష్ సమీక్ష

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై మంత్రి లోకేష్ ఉండవల్లిలోని తన నివాసంలో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు విజయం సాధించేలా కృషి చేయాలని సంబంధిత జిల్లాల మంత్రులతో చెప్పారు. కృష్ణా, గుంటూరు, తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ అభ్యర్థుల విజయానికి ఇన్‌ఛార్జి మంత్రులు పూర్తి బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో మంత్రులు కె అచ్చెన్నాయుడు, గుమ్మడి సంధ్యారాణి, పి నారాయణ, నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవి, మాజీ ఎమ్మెల్సీ సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

కుంభమేళాలో 15 టెంట్లు దగ్ధం

లక్నో : మహాకుంభమేళాలో మరోసారి అగ్నిప్రమాదం జరిగింది. ప్రయాగ్‌రాజ్ సెక్టార్ -22లోని ఛట్‌నాగ్ ఘాట్ వద్ద గురువారం మంటలు చెలరేగడంతో 15 గుడారాలు కాలిపోయాయని అధికారులు తెలిపారు. ఈ నెల 19న రెండు గ్యాస్ సిలిండర్లు పేలడంతో భారీగా మంటలు చెలరేగి, 18 టెంట్లు దగ్ధమైన సంగతి తెలిసిందే.

equitas Small Finance Bank

ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్
(గతంలో ఈక్విటాస్ ఫైనాన్స్ లిమిటెడ్‌గా పిలువబడింది)
నమోదిత కార్యాలయం : నం.769, స్పెన్సర్ ప్లాజా, 4వ అంతస్తు, ఫేజ్-II, అన్నా సలై, చెన్నై-600002. ఫోన్ : 044-42995000, 044-42995050

డిమాండ్ నోటీసు
(సర్ఫాసీ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద నోటీసు)

ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఇఎఫ్ఎల్) నుండి దిగువ రుణగ్రహీత/లు రుణం పొందినారని ఇక్కడ నోటీసు ఇవ్వడమైనది. సదరు రుణగ్రహీతలు మొత్తాన్ని చెల్లించడంలో విఫలమైనారు మరియు ఆర్‌బిఐ ద్వారా జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం వారి లోన్ ఎకౌంట్‌ను నాన్-పెర్ఫామింగ్ ఎసెట్ గా వర్గీకరించబడింది. రుణగ్రహీత(లు) ద్వారా సదరు తేది నాటికి చెల్లించాల్సిన సెక్యూర్డ్ స్థిరాస్థు/లు, లోన్ మరియు అసాధారణ మొత్తం వివరాలు దిగువన ఇవ్వబడినాయి. రుణగ్రహీత(లు) అదే విధంగా సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క ఆధీకృత అధికారి అయిన దిగువసంతకందారుడు, SARFAESI చట్టం, 2002 యొక్క నిబంధనల క్రింద దిగువ రుణగ్రహీత(లు)కు వ్యతిరేకంగా చర్యలను ప్రారంభించాడు. ఒకవేళ క్రింది రుణగ్రహీత(లు) **ఈ నోటీసు ఇచ్చిన 60 (అరవై) రోజులలోపు** వారి పేర్లకు ఎదురుగా సూచించిన బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమైతే, SARFAESI చట్టంలోని సెక్షన్ 13 లోని సబ్-సెక్షన్ (4) క్రింద సెక్యూర్డ్ క్రెడిటార్ మీద ఒకటి లేదా అంతకంటే అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువసంతకందారుడు ఆస్తులను స్వాధీనం చేసుకోవడంతో పాటు అధికారం తీసుకొని యధావిధిగా అమ్మబడును.

రుణగ్రహీతలు/హామీదారుల పేరు : డిమాండ్ నోటీసు : 20.01.2025, 1. శ్రీ సదానంద ఖర్ణ, తండ్రి. శ్రీ ఆషుతోష్ ఖర్ణ, మరియు **2. శ్రీమతి అంజన ఖర్ణ,** భర్త. శ్రీ.సదానంద ఖర్ణ, **ఇరువురి నివాసం :** డో.నం.41-7-26, 1వ అంతస్తు, విక్రం దుర్గయ్య వీధి, కృష్ణ లంక, విజయవాడ, కృష్ణ-520 013, ఆంధ్రప్రదేశ్. **లోన్ అకౌంట్ నం.లు.: HI-700007569185 & IL-700007570228. బకాయి మొత్తం : రూ.19,05,644/-** (పంతొమ్మిది లక్షల ఐదు వేల ఆరు వందల నలభై నాలుగు రూపాయలు మాత్రమే) **18.01.2025 నాటికి, ఎన్‌పిఎ తేది : 08.01.2025**

సెక్యూర్డ్ అసెట్స్ షెడ్యూల్ : రెసిడెన్షియల్ ఆస్తి యజమాని శ్రీమతి సదానంద ఖర్ణ : గుంటూరు జిల్లా, ఎస్‌ఆర్‌ఓ-మంగళగిరి, తాడేపల్లి మండలం, తాడేపల్లి మున్సిపల్ ఏరియా, మూల్యాంకనం నం.1143014139, డో.నం.14-242, సర్వే నం.338/ఎ, తాడేపల్లి మున్సిపల్, ఆర్.సి.సి. ఇల్లు 910 చ.అ.లు. సైట్ మొత్తం పరిధి 117 చ.గ.లు. లేదా 97.827 చ.మీ.లు. ఉన్న హద్దులు : **సరిహద్దులు : తూర్పు :** ప్లాట్ నం.96, జాగర్లమూడి చైతన్య తులసి మరియు ప్లాట్ నం.97 ఆస్తి, **దక్షిణం :** షేక్ ఆసిఫ్ ఆస్తి, **పడమర :** ప్లాట్ నం.10,12 ఆస్తి, **ఉత్తరం :** 40 అ.లు. మున్సిపల్ రోడ్డు, తో కలిపి అన్నీ భవనములు మరియు నిర్మాణాలు భూమికి జోడించబడి ఉంటాయి లేదా భూమికి జోడించబడిన దేనికైనా వర్తమానం మరియు భవిష్యత్తు రెండూ శాశ్వతంగా కట్టుబడి ఉంటాయి. / దానిపై అనుబంధ మామూలు హక్కులు.

తేది : 20.01.2025
ప్రదేశం : విజయవాడ
అధీకృత అధికారి
ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ లిమిటెడ్

बैंक ऑफ महाराष्ट्र Bank of Maharashtra ONE FAMILY ONE BANK

బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర
జోనల్ ఆఫీసు, విజయవాడ, 1వ అంతస్తు, ఇన్ఫినిటీ ప్లాజా, డోర్ నెం.59ఏ-21-7/3, హై స్కూల్ రోడ్, పటమట, విజయవాడ, అం.ప్ర-520007, టెలి: 0866-2431225

డిమాండ్ నోటీసు

అరవింద్ కేజ్రీవాల్, హేమంత్ సొరేన్ అరెస్టులను ఆయన ప్రస్తావిస్తూ 'ప్రతిపక్షాల నాయకులను ఏ విధంగా జైలులో ఉంచారో మనం చూశాం. ఇప్పుడు ఢిల్లీలో శాసనసభ ఎన్నికలు జరగబోతు న్నాయి. పార్లమెంట్ ఎన్నికలకు ముందు అప్పటి ఢిల్లీ ముఖ్యమంత్రి కేజీవాల్‌ను అరెస్ట్ చేసి జైలులో పెట్టారు. దానికి ముందు జార్ఖండ్ ముఖ్యమంత్రి, జెఎంఎం నేత హేమంత్ సొరేన్‌ను కూడా అరెస్ట్ చేసి జైలుకు పంపారు. ప్రతిపక్షాలపై దాడి చేయడం, ఆ పార్టీల నేతలపై తప్పుడు కేసులు బనాయించడం, వారిని జైళ్లలో పెట్టడం బిజెపికి పరిపాటిగా మారింది' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రజాస్వామ్య నిర్మాణాన్ని మార్చేసేందుకు మోడీ ప్రభుత్వం కుట్ర

వామపక్ష ప్రభుత్వాల పాలనలో త్రిపురలో మతపరమైన అల్లర్లేవీ జరగలేదని ప్రకాశ్ కరత్ గుర్తు చేశారు. ఇప్పుడు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ కుట్రల కారణంగా అలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని చెప్పారు. 'దేశంలో హిందువులు, ముస్లిముల మధ్య ఉద్రిక్తతలను పెంచడానికి వారు వ్యూహాలు రచిస్తున్నారు. బిజెపి అధికారంలో ఉన్నంత కాలం ప్రజాస్వామ్యానికి ప్రమాదమే అని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు లౌకిక, ప్రజాతంత్ర శక్తులన్నీ ఏకం కావాల్సిన అవసరముంది' అని నొక్కి చెప్పారు. దేశ ప్రజాస్వామ్య నిర్మాణాన్ని మార్చేసేందుకు మోడీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని విమర్శించారు. జమిలి ఎన్నికల బిల్లు అందులో భాగమేనని అన్నారు.

హామీల అమలులో విఫలం: మాణిక్ సర్కార్

2018కి ముందు త్రిపురకు బిజెపి ఇచ్చిన అనేక హామీలు నేటికీ నెరవేర్చలేదని మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ విమర్శించారు. ఉపాధి హామీ పథకం కార్మికుల రోజువారీ వేతనాన్ని పెంచుతామని చెప్పి, ఆ మాటే మరిచారని అన్నారు. వామపక్ష ప్రభుత్వం సామాన్య ప్రజల అభివృద్ధికి ప్రాధాన్యతిచ్చిందని చెప్పారు. బిజెపి పాలనలో రాష్ట్రంలో అవినీతి పెచ్చరిల్లిందని, శాంతి భద్రతలు కనుమరుగయ్యాయని, రాజకీయ హింస, మహిళలపై నేరాలు పెరిగాయని తెలిపారు. ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిని, ఆగ్రహాన్ని సిపిఎం భారీ ర్యాలీ ప్రతిబింబించిందని అన్నారు.

అడుగడుగునా బిజెపి దిగ్బంధం

త్రిపురలోని అనేక ప్రాంతాల్లో సిపిఎం కార్యకర్తలు, మద్దతుదారులు అగర్తలా వచ్చి ర్యాలీలో పాల్గొనకుండా స్థానిక బిజెపి యూనిట్లు రోడ్లను దిగ్బంధించాయి. ముఖ్యమైన లింక్ రోడ్లను, అగర్తల సమీపంలోని ప్రతాప్‌గఢ్ ప్రాంతాన్ని, హెజ్మారా ప్రాంతంలోని జాతీయ రహదారిలోని కీలకమైన భాగాన్ని దిగ్బంధించారు. అగర్తల రైల్వే స్టేషన్‌లో ఆటోరిక్షాలు, టామ్ టామ్స్‌ను నడపడానికి అనుమతించలేదు. ఎడిసి ప్రధాన కార్యాలయమైన కుమ్లుంగ్‌లో సిపిఎం గిరిజన మద్దతుదారులపై బిజెపి గూండాలు దాడి చేసి గాయపరిచారు. కమల్‌పూర్‌లో వాహనాల రాకపోకలను నిలిపివేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బిఎంఎస్ యూనిట్లు వాహన యజమానులు, డ్రైవర్లకు సిపిఎం మద్దతుదారులకు ఎటువంటి వాహనాలను అందుబాటులో ఉంచవద్దని ఆదేశాలు జారీ చేశాయి.

కదంతొక్కిన జన సంద్రం

ఇంత జరిగినప్పటికీ, రవీంద్ర శతబర్షికి భవన్ ముందు సముద్రాన్ని తలపించే భారీ జనసమూహం కదం తొక్కింది. త్రిపురలో బిజెపి, ఐపిఎఫ్‌టి, తిప్రా మోతా పాలనకు కౌంట్‌డౌన్ ప్రారంభమైందని, ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడానికి, బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వ దుష్ప్రవర్తనను అంతం చేయడానికి ప్రమాణ స్వీకార కార్యక్రమంగా నేతలు ర్యాలీని అభివర్ణించారు. నెల ముందుగానే అనుమతి కోరామని, అనుమతి ఇచ్చారని తెలిపారు. అకస్మాత్తుగా ప్రజా ర్యాలీని నిరోధించడానికి ప్రభుత్వం కుట్ర పన్నిందని, త్రిపురలో ప్రజాస్వామ్యం గొంతు నొక్కుతున్నారని విమర్శించారు. ర్యాలీకి త్రిపుర ప్రతిపక్ష నేత, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి, మాజీ మంత్రి బాదల్ చౌదరి తదితర నేతలు హాజరై ప్రసంగించారు.

త్రిపురలో కమ్యూనిస్ట్ ఉద్యమ చరిత్ర పుస్తకం ఆవిష్కరణ

ప్రఖ్యాత చరిత్రకారుడు డాక్టర్ మహాదేవ్ చక్రవర్తి రాసిన "త్రిపురలో కమ్యూనిస్ట్ ఉద్యమ చరిత్ర" పుస్తకాన్ని సిపిఎం సమన్వయకర్త ప్రకాశ్ కరత్ ఆవిష్కరించారు. ఆయనతోపాటు త్రిపుర మాజీ ముఖ్యమంత్రి మాణిక్‌సర్కార్, పొలిట్ బ్యూరో సభ్యులు బృందాకరత్, అశోక్ దావలే, కేంద్ర కమిటీ సభ్యులు ఆర్. అరుణ్ కుమార్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మహిళా ఎస్‌పి ఆకస్మిక బదిలీ

- భజరంగ్‌దళ్ నాయకుల వివరాలు కోరడమే నేరం!
- గోవాలో బిజెపి సర్కారు తీరు

గోవా : భజరంగ్‌దళ్‌కు చెందిన కొంతమంది నాయకుల వివరాలను కోరిన మహిళా ఎస్‌పిని కొద్ది గంటల వ్యవధిలోనే గోవాలోని బిజెపి ప్రభుత్వం తొలగించింది. హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. సోమవారం అర్ధరాత్రి వైర్‌లెస్ సందేశం ద్వారా ఈ ఆదేశాలను బిజెపి ప్రభుత్వం జారీ చేయడం విశేషం. దక్షిణ గోవా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్‌పి)గా సునీతా సావంత్ గత ఏడాది ఫిబ్రవరి నుంచి విధులు నిర్వహిస్తున్నారు. జిల్లాలోని కొంతమంది భజరంగ్‌దళ్ నాయకుల వివరాలివ్వాలని ఆమె అధికారులను ఆదేశించారు. ఈ విషయం తెలిసిన వెంటనే ఆమెను విధుల నుంచి రాష్ట్ర ప్రభుత్వం తొలగించింది. హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. ఆమె స్థానంలో మాదకద్రవ్యాల నిరోధక విభాగం ఎస్‌పి తికంసింగ్ వర్మను నియమించింది. ఈ విషయంపై సునీతా సావంత్ స్పందిస్తూ 'నాకు ఏమీ తెలియదు. నా బాధ్యతలను వృత్తిపరమైన రీతిలో నిర్వర్తించాను. నా విధులను వదులుకుని హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. నేను ఆ ఆదేశాలను పాటించాను' అని తెలిపారు. రాజకీయ కారణాల వల్లే ఎస్‌పిని విధుల నుంచి తొలగించారని కాంగ్రెస్ విమర్శించింది. తన సైద్ధాంతిక మిత్రులను రక్షించడంలో, విధులను చిత్తశుద్ధితో నిర్వర్తించే అధికారులను అణచివేయడంలో బిజెపికి శ్రద్ధ ఉందని గోవా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు అమిత్ పత్కర్ పేర్కొన్నారు.

ఉక్కు మంత్రికి నిరసన సెగ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

నిరసన తెలుపుతున్న ఉక్కు కార్మికులు

స్టీల్‌ప్లాంట్ పర్యటనకు వచ్చిన కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డి కుమారస్వామికి నిరసన సెగ తగిలింది. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెం కూడలిలో దీక్షలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ దీక్షలు గురువారానికి 1449వ రోజుకు చేరుకోగా పలు విభాగాల ఉక్కు కార్మికులు తరలివచ్చారు. స్టీల్‌ప్లాంట్ సందర్శన కోసం కుమారస్వామి విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి గాజువాక మీదుగా వస్తున్న విషయం తెలిసి అప్పటి వరకూ దీక్షల్లో కూర్చున్న కార్మికులు ఒక్కసారిగా లేచి మంత్రి కాన్వాయ్‌వైపు తిరిగి నిరసన తెలిపారు. ఉక్కు రక్షణ నినాదాలు చేశారు. వారిని చూసిన మంత్రి కాసేపు కాన్వాయ్ ఆపారు. కారు దిగి దీక్షా శిబిరాన్ని పరిశీలించి వెంటనే వెళ్లిపోయారు. ఆ సమయంలో కార్మికులంతా స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగించాలని, ప్రధాని మోడీ విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులను కలిసి మాట్లాడాలని, ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని' నినదించారు. అయితే, ఏమీ మాట్లాడకుండానే కుమారస్వామి ముందుకు వెళ్లిపోయారు. దీంతో కార్మికులు నిరాశ చెందారు.

కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎన్.రామారావు, డిసిహెచ్. వెంకటేశ్వర రావు, మసేను రావు, సిహెచ్.సన్యాసి రావు, డేవిడ్, దాసరి శ్రీనివాస్ పాల్గొన్నారు. వేరొకచోట ఉక్కు మంత్రికి కార్మికుల సమస్యలపై స్టీల్‌ప్లాంట్ ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ సంఘం అధ్యక్షులు బొండా తౌడన్న, ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.సత్య నారాయణ, మోహన్‌బాబు ఎల్‌వి.రమణారావు తదితరులు వినతిపత్రం సమర్పించారు. బకాయి వేతనాలు ఇవ్వాలని, ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని కోరారు.

వాడిగా వేడిగా పార్లమెంటు

(మొదటిపేజీ తరువాయి)

సమావేశాలు మార్చి 10 నుండి ఏప్రిల్ 4 వరకు జరుగుతాయి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలకు ముందు గురువారం పార్లమెంట్ అనెక్స్ భవనంలో అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, కిరణ్ రిజిజు, జెపి నడ్డా, అర్జున్ రామ్ మేఘ్వాల్, ఎల్ మురుగన్, కాంగ్రెస్ నేతలు జైరామ్ రమేష్, కె సురేష్, గౌరవ్ గొగోయ్, ప్రమోద్ తివారీ, టిఎంసి ఎంపిలు సుదీప్ బందోపాధ్యాయ, డెరెక్ ఓబ్రెయిన్, డిఎంకె ఎంపి టిఆర్ బాలు, ఎస్‌పి ఎంపి రామ్‌గోపాల్ యాదవ్, సిపిఎం ఎంపిలు కె.రాధాకృష్ణన్, జాన్ బ్రిట్టాస్, జెఎంఎం ఎంపి మహువా మాంఝీ, ఎన్‌సిపి (పవార్) ఎంపి ఫౌజియా ఖాన్, ఆర్‌ఎస్‌పి ఎంపి ఎన్‌కె ప్రేమ్‌చంద్రన్, టిడిపి ఎంపిలు బీదా మస్తాన్‌రావు, దగ్గుమల్ల ప్రసాదరావు, వైసిపి ఎంపి మిథున్ రెడ్డి, జనసేన ఎంపి బాలశౌరిసహా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. ప్రభుత్వం సహకరిస్తే పార్లమెంటు సజావుగా సాగేందుకు తాము సిద్ధంగా ఉన్నామని ప్రతిపక్షాలు స్పష్టం చేశాయి. ఆర్థిక మాంద్యం ధరల పెరుగుదల, నిరుద్యోగం వంటి ప్రజా సమస్యలపై పార్లమెంటులో చర్చ జరగాలని అఖిల పక్ష సమావేశంలో ప్రతిపక్షాలు కోరాయి. వక్ఫ్ బిల్లుపై జెపిసి చైర్మన్ నిబంధనలకు విరుద్ధంగా, ఏకపక్షంగా నివేదిక రూపొందించడాన్ని అవి తప్పు పట్టాయి. ఈ నివేదికపై ప్రతిపక్ష సభ్యులు తమ అసమ్మతిని ఇప్పటికే స్పష్టంగా తెలియజేశారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చకు కేటాయించిన సమయాన్ని కుదిస్తూ పార్లమెంటరీ బులెటిన్‌ను ప్రచురించడంపై ప్రతిపక్ష నేతలు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇది బిజినెస్ అడ్వైజరీ కమిటీ ప్రత్యేక హక్కును హరించడమేనని విమర్శించారు.. మహా కుంభమేళాలో తొక్కిసలాటకు యుపి ప్రభుత్వ అసమర్థ నిర్వాకమే కారణమని విమర్శించాయి.

అన్ని పార్టీలు సహకరించాలి : కిరణ్ రిజిజు

అఖిల పక్ష సమావేశం అనంతరం పార్లమెంటరీ వ్యవ హారాల మంత్రి కిరణ్ రిజిజు మీడియాతో మాట్లాడుతూ "ఈ బడ్జెట్ సమావేశాలు సజావుగా సాగేందుకు అన్ని పార్టీలు సహకరించాలని కోరాం" అని అన్నారు. "ప్రతిపక్షాలు లేవ నెత్తిన అంశాలను పరిశీలిస్తున్నాం. బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బిఎసి) ఏ అంశాలను చర్చకు తీసుకోవాలో నిర్ణయిస్తుంది.

కార్యకలాపాల నిర్వహణలో పక్షపాతంగా వ్యవహరిస్తున్నారు : కాంగ్రెస్

కాంగ్రెస్ లోక్‌సభ పక్ష ఉపనేత గౌరవ్ గొగోయ్ మాట్లాడుతూ పార్లమెంటు కార్యకలాపాల నిర్వహణలో పక్షపాత వైఖరిపై ఆందోళన వ్యక్తం చేసినట్లు చెప్పారు. ఒరిస్సాకు ప్రత్యేక హోదా మంజూరు చేస్తామన్న హామీపై బిజెపి వెనక్కి తగ్గిందని బిజెడి ఎంపి సస్మిత్ పాత్ర విమర్శించారు. దేశంలో చట్టాన్ని రూపొందించే ప్రక్రియ బలహీనపడుతుందనే అంశాన్ని లేవనెత్తినట్లు ఐయుఎంఎల్ నేత ఇటి మహమ్మద్ బషీర్ అన్నారు. "వక్ఫ్‌పై చర్చించడానికే జెపిసిని ఏర్పాటు చేశారు. సభ్యులకు మాట్లాడటానికి తగినంత అవకాశం ఇవ్వలేదు" అని బషీర్ గుర్తు చేశారు. కచ్చతీవు ద్వీపంపై తిరిగి నియంత్రణ సాధించడానికి ప్రభుత్వం ప్రయత్నాలు చేయాలని అన్నాడిఎంకె ఎంపి ఎం. తంబి దురై కోరారు.

ఆమోదం కోసం 16 బిల్లులు జాబితా చేసిన ప్రభుత్వం

జనవరి 31 నుండి ఫిబ్రవరి 13 వరకు జరిగే బడ్జెట్ సమావేశాల్లో ఆమోదానికి 16 బిల్లులను ప్రభుత్వం జాబితా చేసింది. బడ్జెట్ సమావేశానికి జాబితా చేయబడిన 16 బిల్లుల్లో వక్ఫ్ (సవరణ) బిల్లు, బ్యాంకింగ్ చట్టాలు (సవరణ) బిల్లు, రైల్వేలు (సవరణ) బిల్లు, విపత్తు నిర్వహణ (సవరణ) బిల్లు, చమురు క్షేత్రాలు (నియంత్రణ, అభివృద్ధి) సవరణ బిల్లు, విమాన వస్తువులపై ప్రయోజనాల రక్షణ బిల్లు ఉన్నాయి.

రాష్ట్రాల అధికారాలను కేంద్రం లాక్కుంటోంది : జాన్ బ్రిట్టాస్

యుజిసి సవరణ బిల్లు, ఇతర బిల్లులను ప్రవేశపెట్టడంతో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల అధికారాలను ఒక్కొక్కటిగా లాక్కుంటుందని సిపిఎం ఎంపి జాన్ బ్రిట్టాస్ విమర్శించారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా పార్లమెంట్ ప్రాముఖ్యతను తగ్గిస్తోందని పేర్కొన్నారు. బడ్జెట్ సమావేశాలు, ఇతర కార్యక్రమాలు గతంలో 40 రోజుల వరకు జరిగేవిని, ఇప్పుడు దానిని 27 రోజులకు తగ్గించారని విమర్శించారు. అత్యవసర తీర్మానాలు, చిన్న చర్చలు మొదలైనవి పూర్తిగా అనుమతించటం లేదని పేర్కొన్నారు. బిజెపి ఎంపిలను స్టాండింగ్ కమిటీలు, ఇతర కమిటీలలో చేర్చడం పెరుగుతోందని విమర్శించారు. 29 మంది బిజెపి ఎంపిలకు పార్లమెంటరీ కమిటీల్లో ద్వంద్వ సభ్యత్వం ఉందని బ్రిట్టాస్ తెలిపారు.

ఆశాలకు చట్టబద్ధమైన హక్కులు కల్పించాలి

- గౌరవప్రదమైన జీవితానికి వారు అర్హులు
- కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రికి యూనియన్ బహిరంగ లేఖ

న్యూఢిల్లీ : నిజాయితీగా సేవలందిస్తున్న ఆశా వర్కర్లు కేవలం గౌరవానికే కాకుండా చట్టబద్ధమైన హక్కులతో గౌరవప్రదమైన జీవితాన్ని పొందేందుకు కూడా అర్హులని ఆశా వర్కర్స్ అండ్ ఫెసిలిటేటర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎడబ్ల్యుఎఫ్ఎఫ్ఐ) ప్రధాన కార్యదర్శి మధుమిత బందోపాధ్యాయ పేర్కొన్నారు. దేశ రాజధానిలో ఇటీవల జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకలకు ప్రత్యేక అతిథులుగా ఆశావర్కర్లను ఆహ్వానించి, వారు చేసిన సేవలకు గౌరవం కల్పించినందుకు కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శికి, భారత ప్రభుత్వానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జె.పి.నడ్డాకు మధుమిత బహిరంగ లేఖ రాశారు. వివిధ రాష్ట్రాలకు చెందిన 250మంది ఆశా వర్కర్లు వారి భాగస్వాములతో కలిసి గణతంత్ర దినోత్సవాల్లో ప్రత్యేక అతిథులుగా పాల్గొన్నారు. పైగా దేశ ఆరోగ్య రంగానికి ఆశా వర్కర్లు వెన్నెముక వంటివారని, మహిళా సాధికారతకు నిలువెత్తు రూపమని ఆరోగ్య కార్యదర్శి పత్రికా సమావేశంలో పేర్కొనడం చాలా సంతోషాన్ని కలిగించిందని ఆమె తెలిపారు. టిబి నిర్మూలన కోసం వారు చేసే పోరాటం, ప్రసూతి, శిశు సంరక్షణ రంగాల్లో వారి కృషి కొనియాడదగినదని వివరించారు. కరోనా సమయంలో కూడా వారు అంకితభావంతో చేసిన కృషిని డబ్ల్యుహెచ్ఓ ప్రశంసించిందని, వారిని గ్లోబల్ లీడర్లుగా గౌరవించిందని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో పది లక్షల మందికిపైగా ఆశా వర్కర్లు పనిచేస్తున్నారు. నిజాయితీగా సేవలందిస్తున్న వీరు కేవలం గౌరవాన్నే కాకుండా చట్టబద్ధమైన హక్కులతో గౌరవప్రదమైన జీవితాన్ని పొందేందుకు అర్హులని ఆమె పేర్కొన్నారు. అంటువ్యాధులు ప్రబలిన సమయంలోకూడా ప్రజలతో మమేకమై విధులు నిర్వహించిన వీరికి తగిన భద్రత కొరవడడం, పైగా వారిని ఉద్యోగులు లేదా కార్మికులుగా కూడా గుర్తించకపోవడం సిగ్గుచేటైన విషయమని ఆ లేఖ విమర్శించింది. వారిని వలంటీర్లుగా పరిగణిస్తూ, ప్రోత్సాహకాల పేరుతో నెలకు రూ.2వేలు చెల్లించడం దారుణమైన విషయమని విమర్శించింది. వారికి ఆరోగ్య బీమా లేదని, పైగా ప్రసూతి సెలవు లేదని, సామాజిక భద్రత కొరవడిందని ఆ లేఖ పేర్కొంది. పైగా ఆ ఇచ్చే ప్రోత్సాహకాలు కూడా 2010లో సవరించారని తెలిపింది. 2013లో ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ (ఐఎల్‌సి) సిఫార్సుల మేరకు వారిని వర్కర్లుగా గుర్తించి, కనీస వేతనాలు చెల్లించి, సామాజిక భద్రత, పెన్షన్లు కల్పించేందుకు ఇది సరైన సమయమని మధుమిత పేర్కొన్నారు.

కేంద్రం సకాలంలో నిధులు విడుదల చేయకపోవడంతో చాలా రాష్ట్రాల్లో నెలల తరబడి వారికి చెల్లించే వేతనాలు కూడా పెండింగ్‌లో వున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కరోనా సమయంలో చాలామంది వర్కర్లు చనిపోయారని, వారి కుటుంబానికి ఈనాటికీ నష్టపరిహారం రాలేదని, అసలు ఎంతమంది చనిపోయారో మంత్రిత్వ శాఖ వద్ద రికార్డే లేదని తెలిపారు. ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరి ంచకుండా వారిని గౌరవించే కార్యక్రమాలు చేపట్టడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదని, పైగా ఈ చర్యలు హాస్యాస్పదంగా వుంటాయని ఆ లేఖలో మధుమిత విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో ఆశా వర్కర్ల కోసం చర్యలు తీసుకోవాలని, వారికి చట్టబద్ధమైన హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు.

'సెకి' ఒప్పందాలు రద్దు చేయాల్సిందే

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి కావాలని జనసేన నాయకులు అంటూ అధికారం కోసం అల్లాల్లాడుతున్నారని విమర్శించారు. సెకి ఒప్పందాలు రద్దు, రాయలసీమ పెండింగ్ ప్రాజెక్టులు, రైతాంగ, కార్మిక, ప్రజా సమస్యలపై మహాసభలో చర్చించి భవిష్యత్తు ఉద్యమాలకు శ్రీకారం చుడుతామని తెలిపారు. ఈ సభకు సిపిఎం నంద్యాల జిల్లా కార్యదర్శి టి.రమేష్‌కుమార్ అధ్యక్షత వహించారు. సిపిఎం నాయకులు ఎ.నాగరాజు, ఏసురత్నం, పుల్ల నరసింహ, ఎంఆర్ నాయక్, బాలవెంకట్, దర్శనం లక్ష్మణ్, కెఎండి గౌస్, తోట మద్దులు, ప్రజానాట్యమండలి నాయకులు కోయిలకొండ నాగరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఈ జాతా నంద్యాల, పాణ్యం, బనగాపల్లె, కోవెలకుంట్ల, దొర్నిపాడు, ఆళ్లగడ్డ, చాగలమర్రి మీదుగా కడప జిల్లా దువ్వూరులోకి ప్రవేశించింది. ప్రొద్దుటూరులో రాత్రి బస చేసింది.

చుక్కా రామయ్యను పరామర్శిస్తున్న జాన్‌వెస్లీ

చుక్కా రామయ్యకు జాన్‌వెస్లీ పరామర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో ఉన్న ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్య నివాసానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ గురువారం వెళ్లి ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.

రాష్ట్ర విభజన హామీలు అమలు కాలేదు

- అఖిలపక్ష సమావేశంలో బీద మస్తాన్‌రావు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్ర విభజన హామీలు ఇంకా పూర్తిగా అమలు కాలేదని టిడిపి రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు అన్నారు. గురువారం అఖిలపక్ష సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర విభజనలో పోలవరం నిర్మాణం, రాజధానికి నిధులు, ప్రత్యేక హోదా ఇతర సహాయం అందించాలని కేంద్రాన్ని కోరినట్లు చెప్పారు. రాష్ట్ర అంశాలపై చర్చించేందుకు లోక్‌సభలో సమయం ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులను సాధిస్తామని, రాష్ట్రం నుంచి ఉన్న ఎంపిలు సైతం సహకరించాలని అన్నారు. టిడిపి లోక్‌సభ పక్ష ఉపనేత దగ్గుమల్ల ప్రసాదరావు మాట్లాడుతూ.. రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ అంశాలను పూర్తి చేయాలని కోరినట్లు చెప్పారు. రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన్ హామీలను నెరవేర్చాలని కోరినట్లు తెలిపారు.

2 రాష్ట్రాల మధ్య సమస్యలను పరిష్కరించాలి : బాలశౌరి

రెండు రాష్ట్రాల మధ్య సమస్యలను పరిష్కరించాలని జనసేన ఎంపి వల్లభనేని బాలశౌరి కోరారు. రాష్ట్ర విభజన జరిగి ఇన్నేళ్లయినా ఇంకా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య అనేకాంశాలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. వాటిపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టి పరిష్కరించాలని కోరినట్లు చెప్పారు. పోలవరం, అమరావతి, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ సహా రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై లేవనెత్తామని అన్నారు. ఎపి నుంచి ఖాళీ అయిన రాజ్యసభ సీటు గురించి మూడు పార్టీల పెద్దలు కూర్చుని నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.

పోలవరం ఎత్తు తగ్గింపుపై చర్చ జరగాలి: మిథున్ రెడ్డి

పోలవరం ఎత్తు తగ్గింపుపై చర్చ జరగాలని వైసిపి లోక్‌సభ పక్షనేత పివి మిథున్ రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ నడుస్తున్నాయని అన్నారు. పోలవరం ఎత్తు తగ్గిస్తారని సమాచారం వస్తోందని, దానిపై పార్లమెంట్‌లో చర్చ జరగాలన్నారు. సభలో కేంద్ర మంత్రి సమాధానం ఇవ్వాలని,పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర విభజన అంశాలపై చర్చ జరగాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. డ్రగ్స్ వాడకం వల్ల వచ్చే అనర్థాలపై సావధాన తీర్మానం కింద చర్చ జరగాలని కోరామన్నారు. మార్గదర్శి చిట్స్ అవకతవకలపై సభలో చర్చ జరగాలని కోరానని అన్నారు. మంగళంపేటలో తమ కుటుంబ సభ్యుల పేరుతో కొన్న భూమి ప్రైవేటుదని అన్నారు. పెద్దిరెడ్డిపై చంద్రబాబు కక్షతో ఉన్నారన్నారు. గతంలో భూమి పేపర్స్ దగ్ధం అన్నారని, విచారణ ఏమీ చేశారని ప్రశ్నించారు. ఎస్‌పి బైరెడ్డి డిస్లరీస్‌లో వాటా ఉందన్నారని, తప్పుడు ఆరోపణలు చేశారని, వాటిని నిరూపించకపోతే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

గగనతలంలో ఘోరం!

(మొదటిపేజీ తరువాయి)

రికార్డ్ చేసింది. హెలికాప్టర్‌లో ప్రయాణిస్తున్న వారి మధ్య జరిగిన సంభాషణలు అందులో రికార్డయ్యాయి. 'కూలిపోతోంది... కూలిపోతోంది... కూలిపోతోంది. ఇది మూడో హెచ్చరిక' అనే మాటలు వినిపించాయి.

మానవ శరీర భాగాలు, విమాన శకలాలు పోటోమాక్ నదిలో తేలియాడుతూ కన్పించాయి. విమానం ముక్కలు ముక్కలై పోయింది. క్యాబిన్‌లోని కొన్ని భాగాలు, ఒక బ్లాక్‌బాక్స్ మాత్రం లభించాయి. హెలికాప్టర్ మాత్రం అలాగే ఉంది.

అంతా 30 సెకన్ల లోనే...

ప్రమాదం జరగడానికి కొద్ది నిముషాల ముందుగా నిడివి తక్కువ గల రన్‌వే పై ల్యాండ్ అవగలరా అని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లు విమాన పైలట్లను అడిగారు. అందుకు పైలట్లు అంగీకరించడంతో కంట్రోలర్లు విమానం ల్యాండింగ్‌కు అనుమతి ఇచ్చారు. కొత్త రన్‌వేపైకి రావడానికి విమానం సిద్ధమవుతుండగానే హఠాత్తుగా అదే మార్గంలోకి బ్లాక్ హాక్ హెలికాప్టర్ రావడాన్ని కంట్రోలర్లు చూశారు. ఎదురుగా వస్తున్న విమానం మీకు కనబడుతోందా అని వారు ప్రశ్నించారు. వెంటనే మరో రేడియో కాల్‌ను కూడా పంపారు. ఈలోగానే జరగాల్సిన అనర్థం జరిగిపోయింది. సెకన్లు కూడా గడవలేదు. రెండు విమానాలు ఆకాశంలో ఢీకొన్నాయి. ఆ సమయంలో విమానం రన్‌వేకు సరిగ్గా 2,400 అడుగుల దూరంలో వుంది. అంటే పొటొమాక్ నది మధ్య భాగానికి పైన వుంది. బ్లాక్ హాక్ హెలికాప్టర్ శిక్షణా హెలికాప్టర్ అని అమెరికా ఆర్మీ ప్రకటించింది. ఆ సమయంలో అందులో ముగ్గురు సైనికులు వున్నారని తెలిపింది.

అదే మార్గంలోకి హెలికాప్టర్ ఎందుకు వచ్చింది? : ట్రంప్ అసహనం

ఈ ప్రమాదం పట్ల అధ్యక్షుడు ట్రంప్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. అసలు హెలికాప్టర్ ఆ మార్గంలోకి ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. విమానం సరైన దిశలోనే వుంది, కానీ కాస్త అటూ ఇటూగా కూడా కాకుండా సరిగ్గా విమానానికి, హెలికాప్టర్ ఎదురు వెళ్లినట్లుగా కనిపిస్తోందని అన్నారు. పైగా ఆ సమయంలో ఆకాశమంతా కూడా క్లియర్‌గానే వుందన్నారు. హెలికాప్టర్ పైకి, కిందకు లేదా పక్కకు కూడా మళ్లకుండా సరిగ్గా సూటిగా వచ్చిందని అన్నారు. అయినా విమానం కనిపిస్తోందా అని ట్రాఫిక్ కంట్రోలర్లు ప్రశ్నించడానికి బదులుగా ఏం చేయాలో ఎందుకు చెప్పలేదని ఆయన ప్రశ్నించారు. ఇదంతా చూస్తుంటే ఇది నివారించదగిన ప్రమాదంగా భావించాల్సి వస్తోందని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. తానే స్వయంగా సహాయక చర్యలను పర్యవేక్షిస్తానని ట్రంప్ అధికారులకు చెప్పారు. విమాన శిధిలాలు పడిన నదిలో నీరు దాదాపు గడ్డ కట్టే ఉష్ణోగ్రతలు వున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో అందులో పడినవారు, గాయాలపాలైన వారు ఎక్కువసేపు ప్రాణాలతో వుండే అవకాశాలు తక్కువని పేరు వెల్లడించడానికి ఇష్టపడని అధికారులు కొంతమంది తెలిపారు. శిధిలాలు పడిన ప్రాంతం చాలా లోతుగా వుందని చెప్పారు.

ఇక వాట్సాప్ గవర్నెన్స్

(మొదటిపేజీ తరువాయి)

చెప్పారు. రియల్‌టైంలో ధ్రువపత్రాలు అందించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని అన్నారు. సర్టిఫికెట్లు అందజేసినప్పుడు వాటిపై ప్రత్యేక క్యూఆర్ కోడ్ ఉంటుందని, దాన్ని స్కాన్ చేస్తే ప్రభుత్వ వెబ్‌సైట్‌కు ఆ లింక్ వెళ్తుందన్నారు. పౌరసేవలు అందివ్వడంతోపాటు ప్రజల నుంచి వినతులు స్వీకరించేందుకు, వారికి అవసరమైన సమాచారాన్ని చేరవేస్తామన్నారు. విద్యార్థుల సర్టిఫికెట్లు, పరీక్షల హాల్ టికెట్లను కూడా వాట్సాప్ ద్వారా జారీ చేస్తామని చెప్పారు. ఈ విధానం ద్వారా భవిష్యత్తులో మరింత మార్పులను ప్రజలు చూస్తారని చెప్పారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తరహాలో ప్రజా సేవలూ వేగంగా అందిస్తామన్నారు. ప్రపంచంలో ఎక్కడా ఇన్ని సేవలు ఒకే ప్లాట్‌ఫాం ద్వారా అందించలేదని చెప్పారు. దీనికి 36 శాఖలను అనుసంధానించాలని, ఇది చాలా క్లిష్టతరమైన పని అని చెప్పారు. ఈ విధానంపై 15 రోజుల నుంచి కసరత్తు చేస్తున్నామని, ఇంకా మెరుగులు దిద్దుతామని తెలిపారు. ప్రజలకు సంబంధించిన సమాచారం సురక్షితంగా ఉంటుందని వాట్సాప్ డైరెక్టర్ రవి గార్గ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐటి, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ శాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్, ఆర్‌టిజిఎస్ సిఇఒ కె దినేష్, మెటా (ఇండియా) వైస్ ప్రెసిడెంట్, హెడ్ సంధ్య దేవనాథన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంతోనే అభివృద్ధి సాధ్యం

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించుకున్నామన్నారు. కమ్యూనిస్టు యోధుడు పుచ్చలపల్లి సుందరయ్య సారథ్యంలో ఆ మహాసభ జరిగిందని చెప్పారు. మళ్లీ ఇప్పుడు నెల్లూరులో రాష్ట్ర హాసభ నిర్వహించుకుంటున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రజలను వేధిస్తోన్న ఐదు ప్రధాన సమస్యలపై ఐదు పతాక జాతాలు మహాసభ నేపథ్యంలో రాష్ట్ర నలుమూలల నుంచి ప్రారంభమయ్యాయన్నారు. ఇవి శుక్రవారం రాత్రికి నెల్లూరుకు చేరుకుంటాయని తెలిపారు. ఈ యాత్రలకు ఫిబ్రవరి ఒకటో తేదీన మహాసభ ప్రాంగణంలో ఆహ్వానం పలికి పతాకావిష్కరణ నిర్వహించి సిపిఎం రాష్ట్ర 27వ మహాసభ ప్రారంభించుకుంటామని చెప్పారు. మహాసభకు కేంద్ర పరిశీలకులుగా సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందా కరత్, ఎంఎ బేబీ, బివి రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు అరుణ్ కుమార్ హాజరవుతారని తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి, జిల్లా కార్యదర్శి మూలం రమేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.మోహనరావు, మాదాల వెంకటేశ్వర్లు, కె.అజయ్‌కుమార్, ఎం.పుల్లయ్య, షేక్ రెహనా బేగం, సిపిఎం సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మీ కోసం

వంటగది మూలల్లో పంచదారలో బేకింగ్ సోడా కలిపి జల్లడం వల్ల బొద్దింకలు చనిపోతాయి.

జీవన సౌరభం

ఒక గుడి కడితే వెయ్యిమంది భిక్షగాళ్లు తయారవుతారు. అదే, ఒక బడి కడితే, వెయ్యిమంది మేధావులు తయారవుతారు.

స్నేహం కోసం ...

ఒక గ్రామంలో రాము, సోము, రాజేశ్, కన్న అనే నలుగురు స్నేహితులు ఉన్నారు. చిన్నప్పటి నుంచి రాము, సోము చదువులో చురుకుగా ఉండేవాళ్లు. మాస్టార్లు చెప్పిన పాఠాలు శ్రద్ధగా వినేవారు. అన్ని భాషల్లో ప్రావీణ్యంగా ఉండేవారు. రాజేష్, కన్నా మాత్రం ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను సరిగా వినేవాళ్ళు కాదు. చదువులో వెనుకబడి వుండేవారు.

నలుగురు స్నేహితులు పెద్దయిన తర్వాత వ్యాపార నిమిత్తం విదేశాలకు వెళ్లారు. రాము, సోములకు ఉన్న అపార జ్ఞానం వల్ల వాళ్లు మొదలుపెట్టిన వ్యాపారాలు బాగా రాణించాయి. డబ్బు సంపాదించారు. రాజేశ్, కన్న మాత్రం వ్యాపారంలో రాణించలేకపోయారు. నష్టాలు వచ్చాయి. స్వదేశానికి తిరిగి వచ్చేశారు. వీళ్ల పరిస్థితి చూసి రాము, సోము చాలా బాధపడ్డారు. ఎలాగైనా స్నేహితులకు సాయం చేయాలనుకున్నారు.

రాము, సోము కూడా స్వదేశానికి తిరిగి వచ్చి రాజేశ్, కన్నలను కలుసుకున్నారు. పెట్టుబడులు పెట్టి వాళ్లతో చిన్న చిన్న వ్యాపారాలు పెట్టించారు. స్నేహితుల అండతో రాజేశ్, కన్న వ్యాపారం బాగా సాగింది. బాల్య స్నేహితులంతా కలసి తమ గ్రామాన్ని అభివృద్ధి చేశారు. వీళ్ల స్నేహాన్ని చూసి గ్రామస్తులు ఎంతో సంతోషించారు.

- బట్టల సాయి చరణ్, 7వ తరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బక్రిచెప్యాల, సిద్ధిపేట, 97048 65816.

చుక్కలు కలపండి

పిల్లలూ, ఇక్కడ ఉన్న చుక్కలను, వరుసగా వచ్చే అంకెలతో కలపండి. ఏ బొమ్మ వచ్చిందో చూడండి.

నేను గీసిన బొమ్మ

ఎం.యశ్వంత్,
5వ తరగతి,
ఎ.బి.ఎస్ పబ్లిక్ స్కూలు,
అగనంపూడి,
విశాఖపట్నం.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

విద్వేష బాబాకి విశేష పురస్కారమా!

గణతంత్ర దినోత్సవం రోజున 'పద్మ' అవార్డులు ప్రకటించడం ఆనవాయితీగా వస్తోంది. ఆయా రంగాల్లో 'విశేష' కృషి చేసిన వ్యక్తులకు పద్మ అవార్డులిస్తారు. కానీ, ఈ ఏడాది 'పద్మ' గ్రహీతల వివరాలు పరిశీలిస్తే, ఎక్కువమంది పాలక పార్టీల భావజాలాలను తమ భుజాలపై మోస్తున్నవారే' అన్న వ్యాఖ్యలు వస్తున్నాయి. ఆ విమర్శలకు ఊతమిచ్చే ఉదాహరణే ఇది.

పశ్చిమ బెంగాల్ ఆధ్యాత్మిక గురువు కార్తీక్ మహారాజ్‌కు రిపబ్లిక్ డే రోజు పద్మశ్రీ ప్రకటించారు. ముర్షిదాబాద్ జిల్లా, సగర్దిఘి ప్రాంతంలో గత వారమే అతడి ఆధ్వర్యంలో పెద్దఎత్తున రామమందిర నిర్మాణ కార్యక్రమాలు జరిగాయి. ఈ ప్రాంతంలో ఎక్కువమంది గిరిజనులు నివసిస్తున్నారు. చుట్టుపక్క గ్రామాల్లో కలిపి మొత్తం 2000 మంది జనాభా నివసిస్తున్నారు. అందరూ వ్యవసాయంపై ఆధారపడ్డవారే. వాళ్ల ఇళ్లని గమనిస్తే వారు ఎంత దుర్భర పరిస్థితుల్లో జీవిస్తున్నారో అర్థమౌతుంది. అలాంటి చోట, పోషకాలతో కూడిన ఆహారం తిని ఎన్నో ఏళ్లయ్యిన ఆ తెగలకు మందిర భూమి పూజ చేసిన రోజున పెట్టిన భోజనాలు తెగ సంతోషపెట్టాయి. నిమ్న కులాల్లోని పేదలను తన వ్యాఖ్యలతో ప్రభావితం చేయడం, ఆ ప్రాంతంలో ఎన్నాళ్ల నుండో వున్న మత సామరస్య వాతావరణాన్ని చెడగొట్టడంలో ఈ కార్తీక్ మహారాజ్ కొంతకాలంగా అక్కడ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

'యోగీ ఆఫ్ బెంగాల్'

కార్తీక్ మహారాజ్ లీలలు ఇంకాస్త వివరంగా చూద్దాం.. 'స్వామీ ప్రదీప్తానంద మహారాజ్'గా పిలవబడే ఈ కార్తీక్ మహారాజ్ ఆధ్యాత్మిక గురువుగానే కాక, రాజకీయంగా కూడా పేరు గడించారు. ఇతడి 'భారత సేవాశ్రమ్ సంఘ్' ఇటీవల జరిగిన బెంగాల్ ఎన్నికల్లో నేరుగానే కార్యక్రమాలు నెరిపింది. ఆ సేవలకు మిక్కిలి సంతోషపడిన బెంగాల్ బిజెపి పెద్దలు కార్తీక్ మహారాజ్‌ని 'యోగీ ఆఫ్ బెంగాల్' అని కూడా పిలుచుకుంటున్నారు.

మత ఘర్షణల్లో ఆరోపణలు

ముర్షిదాబాద్ బెర్హంపూర్‌కి దగ్గరగా ఉన్న ఓ చిన్న మున్సిపల్ పట్టణం బెల్డంగా. అక్కడ జరిగిన రెండు మత ఘర్షణల్లో కార్తీక్ ప్రభావం ఉందనే ఆరోపణలు ఉన్నాయి. విద్వేష వ్యాఖ్యలు చేయడంలో ఈయన సిద్ధహస్తుడు. ప్రేమకు చిహ్నంగా, అక్కడి గిరిజనులు సాంప్రదాయంగా కొలిచే 'బంషీదారీ కృష్ణ' (వేణువు పట్టుకున్న కృష్ణ)కి బదులుగా పరాక్రమానికి చిహ్నమైన, పదునైన చక్రాన్ని తిప్పే 'చక్రధారి కృష్ణ'ని ప్రార్థించమని గ్రామస్తులను ప్రేరేపించారు. ఇంకాస్త దుందుడుకు వ్యాఖ్యలు కూడా కార్తీక్ మహారాజ్ చేశాడు. గాంధీని 'జాతిపిత'గా కాదని, 'జాతికి అవమానం'గా గుర్తించాలని చెప్పాడు.

నవంబరు 2024న బెల్డాంగాలో నిర్వహించిన ఓ మత క్రతువులో అన్యమతానికి చెందిన ఓ మతాధిపతిపై అవమానకర వ్యాఖ్యలు చేశారని బెంగాల్ పోలీసులు కేసు కూడా ఫైల్ చేశారు. 'కార్తీక్ మహారాజ్, ఆయన జోడీ బాదల్ మహారాజ్ బెల్డాంగ ఆశ్రమ నిర్వాహకులుగా వెళ్లినప్పటి నుండే అక్కడ మతవిద్వేషాలు పెరుగుతున్నాయని స్థానికులు వెల్లడించిన'ట్లు పోలీసుల విచారణలో తేలింది.

చరిత్రను పరిశీలిస్తే, బెల్డంగా ఆశ్రమాన్ని ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపకుడు గోల్వాకర్ కూడా నిర్వహించాడు. 2024 ఏప్రిల్‌లో రామనవమి సందర్భంగా అక్కట మతఘర్షణలు చెలరేగాయి. బెంగాల్ లోక్‌సభ ఎన్నికల్లో కొన్ని రోజుల ముందే అవి చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో కార్తీక్ మహారాజ్ వ్యాఖ్యలు బిజెపికి అనుకూలంగా ఉన్నాయని బెంగాల్ ముఖ్యమంత్రి తీవ్రంగా విమర్శించారు కూడా. 'ఈ సేవకే పాలకపార్టీ రుణం తీర్చుకున్నద'ని, ఇలాంటి చేతల వల్ల 'పద్మ' అవార్డు ప్రాభవం కోల్పోతోందని కొందరు ఆందోళన చెందుతున్నారు.

మత ప్రచారకురాలు 'దీదీమా'

హిందూవాద ప్రచారకురాలిగా ఉన్న సాధ్వి రితంభరకి కూడా ఈ ఏడాది 'పద్మ' పురస్కారం లభించింది. 'దీదీమా'గా పేరొందిన రితంభర పంజాబ్‌లోని లుధియానాలో ఓ చిన్న గ్రామంలో పుట్టారు. యుక్త వయసు వచ్చేనాటికి ఆధ్యాత్మిక భావజాలానికి ప్రేరేపితమయ్యారు. అప్పటినుండే విశ్వహిందూ పరిషత్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడం మొదలుపెట్టారు. 1980, 1990లో దేశంలో జరిగిన మందిర ఉద్యమ కార్యక్రమాలతో ఈమెకి ప్రత్యక్ష సంబంధం ఉంది. ఇండోర్, ఢిల్లీ, హిమాచల్‌లో ఆశ్రమాలు ఉన్నాయి. ప్రత్యేకంగా తన నివాసంలో 'వాత్సల్య గ్రామ్' పేరుతో ఓ ఆశ్రమం నడుపుతున్నారు. ఆధ్యాత్మిక గురువుగా ఉన్న ఈ సాధ్వికి ఇప్పుడు 'గొప్ప సామాజిక సేవకురాలు' పేరుతో ఈ అవార్డు ఇచ్చారు.

మత సామరస్యానికి చిచ్చు

రామమందిర భూమి పూజకి విశేష అతిథిగా విచ్చేసిన ఆధ్యాత్మిక గురువు అంబికానంద మహారాజ్ బెంగాల్ వ్యాప్తంగా రామమందిరాలు నిర్మిస్తామని ఆ రోజు చెప్పారు. అయితే ప్రజల సంపూర్ణ మద్దతు కావాలని వక్కాణించారు. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు ఎందుకు గుర్తుచేసుకోవాల్సి వచ్చిందంటే.. అంబికానంద్ ప్రత్యేకంగా ప్రస్తావించిన భారత్‌పూర్, ముర్షిదాబాద్ ప్రాంతాలు మారుమూల గ్రామాలు. కనీస మౌలిక వసతులు లేనివి. ఆదివాసీలు నివసించేవి. ఆ జనాల్లో క్రిస్టియానిటి ఎక్కువగా ఉంది. అలాంటి చోట మత విద్వేషాలు రెచ్చగొట్టటం అనేది ఈ బాబాల వ్యూహంగా కనిపిస్తోందని విమర్శలు ఉన్నాయి.

'దేవాలయాలు, చర్చిల మధ్య ఎప్పుడూ వివాదాలు లేవు. కానీ ప్రజల మధ్య విభజనను వ్యాప్తి చేసే రాజకీయ మతపరమైన ప్రదేశాలుగా వాటిని మార్చేస్తున్నారు. ఈ రాష్ట్రం మత సామరస్య సంస్కృతికి ఉదాహరణగా నిలిచింది. ఇప్పుడు దాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నాలు జరుగు తున్నాయి' అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సలీం, అంబికానంద్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.

పురుషులు లేరు..

భూమి పూజ జరిగిన రోజు రాత్రి జరిగిన విందు కార్యక్రమంలో హాజరైన గిరిజనులందరికీ రుచికరమైన ఆహారం పెట్టారు. విద్యుత్ కాంతులతో, సంగీత ధ్వనులతో ఆ ప్రాంతాన్ని హోరెత్తించారు. ప్రజలకు రంగుల ప్రపంచం చూపించారు. అయితే 'వచ్చిన వారిలో పురుషుల సంఖ్య అంతంతమాత్రంగానే ఉంద'ని గ్రామస్తులు చెబుతున్నారు. అక్కడ గ్రామ శివార్లలో ఓ ప్రకటనను సూచించే బ్యానర్ వ్రేలాడుతోంది. దానిపై 'కర్నాటక వ్యవసాయ భూముల్లో పనిచేసేందుకు కూలీలు కావాలి. సిద్ధమైన వారు కింది నెంబరుకు ఫోన్ చేయగలరు' అని రాసి వుంది.

పనిచేస్తే కానీ పూటగడవని ఆ గిరిజనుల జీవితాలను బాగుచేయాలన్న తపన లేని నాయకులు పెంచి పోషిస్తున్న కార్తీక్ మహారాజ్ తన మతవిద్వేష వ్యాఖ్యలతో ప్రజల మధ్య చిచ్చుపెడుతున్నాడు. అక్కడ జరుగుతున్న పరిస్థితులు ఇంత స్పష్టంగా ఉంటే, 'గిరిజనులను ఉద్ధరిస్తున్న బాబా' అంటూ ఈ ఏడాది ఆయనకి 'పద్మశ్రీ' ప్రదానం చేశారు. వాస్తవ విరుద్ధమైన ఈ పోకడలు గౌరవప్రదమైన అవార్డుల్లో కనిపించడం సముచితం కాదు.

త్యాగాలు చెయ్యండి !

- **మరో 3 నెలల దాకా పూర్తి జీతాలివ్వలేం..**
- **విశాఖలో 'ఉక్కు' మంత్రి వ్యాఖ్యలు**

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డి కుమార స్వామి గురువారం విశాఖ స్టీల్‌ప్లాంట్ పర్యటన సందర్భంగా 'మరో మూడు నెలల వరకు జీతాలు ఇవ్వడం సాధ్యపడదు' ఇంకా మీరు త్యాగాలు చెయ్యాలి అంటూ చేసిన వ్యాఖ్యలు యావత్ స్టీల్ కార్మికులను తీవ్ర ఆగ్రహానికి గురిచేసింది. పాత పాటే పాడుతూ... ఉత్పత్తి మీద దృష్టిసారించండి... ఘర్షణలు వద్దు.. మేం చెప్పినట్లు మీరు సహకరిస్తే మూడు నెలల్లో జీతాలు కూడా ఇస్తాం.. ఇదీ ఇద్దరు కేంద్ర మంత్రులైన కుమారస్వామి, భూపతిరాజు వర్మ నిర్వహించిన సమావేశం నాటి సారాంశం.

ఢిల్లీలో ఒక మాట విశాఖలో మరో మాట...

నెల రోజుల క్రితం అంటే 2024 డిసెంబరు 18న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు ఢిల్లీలో ఉక్కు మంత్రిని కలిసినప్పుడు 2025 జనవరి 15లోగా జీతాలు చెల్లించి కార్మికుల కుటుంబాల్లో సంతోషం నింపుతామని హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా జనవరి చివర్లో వచ్చి మరో మూడు నెలలు జీతాలకు బకాయిలు పెట్టేందుకు కేంద్రంలోని బిజెపి సర్కారు స్కెచ్ వేయడంపై కార్మికులు కన్నెర్ర చేస్తున్నారు. రూ.11400 కోట్ల ప్యాకేజీని తామే సాధించామంటూ రాష్ట్రంలో 'కూటమి' నేతలు ముఖ్యంగా టిడిపి, బిజెపి, రాష్ట్ర, కేంద్ర నేతలు గానా భజానా చేస్తూ మోడీని కీర్తిస్తూ సంబరాలు చేసుకుంటున్న సంగతి తెలిసిందే. కేంద్ర మంత్రి కుమారస్వామి, సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ గురువారంనాటి విశాఖ ఉక్కు పరిశ్రమ పర్యటనపై కార్మికులేకాదు.. యావత్ విశాఖపట్నం, రాష్ట్ర ప్రజలు ఏం భరోసా ఇస్తారోనని ఎదురు చూశారు. కానీ, వీరి పర్యటనకు ముందురోజు బుధవారం ప్లాంట్‌కు విచ్చేసిన కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఫౌండ్రిక్ స్పష్టం చేసిన విషయాలు చూస్తే 'ప్యాకేజీగా వచ్చిన సొమ్ము బ్యాంకుల అప్పులకు పోతుందని, జీతాలు చెల్లించలేమని, ఇకపై ఉక్కులో ఉద్యోగోన్నతులు ఉండవని, పే రివిజన్ కూడా సాధ్యపడదంటూ కుండబద్దలు కొట్టారు. కేంద్ర మంత్రులు ఇద్దరిదీ జీతాలపై అదేమాట.

అధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులతో మంత్రుల సమావేశం

స్టీల్‌ప్లాంట్ సిఎండి, విభాగాల డైరెక్టర్లు సహా విశాఖ, అనకాపల్లి ఎంపిలు శ్రీభరత్, సిఎం రమేష్ విశాఖ ఎమ్మెల్యేలు పల్లా శ్రీనివాసరావు, విష్ణుకుమార్‌రాజు, వైద్య శాఖ మంత్రి ఆలగాని గురువారం నాటి భేటీలో పాల్గొన్నారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు వారితో తమ గోడు వెల్లదీసుకుంటూ నెలనెలా జీతాల్లేక ఇఎంఐలు కట్టలేక, పిల్లల స్కూల్ ఫీజులు చెల్లించలేక తీవ్ర ఆర్థిక అవస్థలకు లోనవుతున్నామన్నారు. అయినా వారి మనసు కరగలేదు. పైగా, సహకరించాలని, త్యాగాలు చేయాలంటూ జీతాల చెల్లింపును మంత్రులు నిర్ధాక్షిణ్యంగా వాయిదా వేశారు.

కేబినెట్ నిర్ణయాన్ని రివర్స్ చేయలేదు : అయోధ్యారామ్

ప్యాకేజీ రూ.11400 కోట్లు ఇచ్చారు కాబట్టి రివర్స్ అంటున్నారే తప్ప కేంద్రం ప్రయివేటీకరణ నిర్ణయం నుంచి వెనక్కి రాలేదని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు జె అయోధ్యారామ్ గురువారం సాయంత్రం వెల్లడించారు. ఆయన మంత్రుల వద్ద వివరించిన అంశాల ప్రకారం.. 'నాలుగేళ్ల పోరాటం తర్వాత రాష్ట్ర ప్రభుత్వ ఒత్తిడితో ప్యాకేజీ వచ్చింది. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు సమర్థవంతమైన మేనేజిమెంట్ ఉండాలని సిఎం చంద్రబాబు చెబుతున్నారు.

అసలు పర్మినెంట్ సిఎండి లేరు. వెయ్యి మంది కాంట్రాక్టు కార్మికులను తీసేశారు. 1500 మందికి విఆర్‌ఎస్ ఇస్తామంటున్నారు. మరో వెయ్యి మంది కార్డులను నిలిపివేశారు.

ఉత్పత్తి ఎలా సాధ్యం?. మనుషులుంటేనే కదా మెషిన్‌లను ఆపరేట్ చేస్తారు. కేబినెట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి, సెయిల్‌లో విలీనం చేయాలి. టాక్స్ హాలిడే ప్రకటించాలి. స్టీల్ ప్లాంట్ భూములన్నీ ప్లాంట్ పేరుమీద మార్పు చేయాలి. జీతాలను తక్షణం విడుదల చేయాలి'అని డిమాండ్‌లు పెట్టామన్నారు.

ప్రయివేటీకరణపై హామీ లేదు...

ప్రయివేటీకరణపై స్పష్టమైన హామీ ఇవ్వలేదు.. కేంద్ర కేబినెట్ చేసిన 'డిజిన్వెస్ట్‌మెంట్' నిర్ణయాన్ని మొదటిసారి ఆర్‌ఐఎన్‌ఎల్ విషయంలో రివర్స్ చేశామంటూ కేంద్ర మంత్రి కుమారస్వామి ఈ సందర్భంగా చేసిన వ్యాఖ్యలపై అయోధ్యారామ్ స్పందిస్తూ 'ప్యాకేజీ ఇచ్చినందున రివర్స్ అన్నారే తప్ప ప్రయివేటీకరణ చేయడంలేదని స్పష్టం చేయాలన్నారు.

ఫైనల్ బెర్త్‌పై భారత్ గురి

- నేడు ఇంగ్లండ్‌తో సెమీస్‌లో ఢీ
- ఐసిసి అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్

కౌలాలంపూర్: ఐసిసి మహిళల అండర్-19 టి20 ప్రపంచకప్‌లో భారత మహిళలజట్టు దుర్భేద్యఫామ్‌లో ఉంది. ఈ టోర్నీలో ఇప్పటి వరకు టీమిండియా వరుస విజయాలతో సెమీఫైనల్‌కు చేరింది. శుక్రవారం జరిగే కీలక పోరులో నిక్కీ ప్రసాద్ సారథ్యంలోని యువ భారత్ అదే జోరును కొనసాగిస్తే ఫైనల్‌కు చేరుకోవడం నల్లేరుమీద నడకే. గ్రూప్ దశలో వెస్టిండిస్, మలేషియా, శ్రీలంకపై ఘన విజయం సాధించి సూపర్ సిక్స్‌కు చేరింది. సూపర్ సిక్స్ తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై ఎనిమిది వికెట్ల తేడాతో, రెండో మ్యాచ్‌లో స్కాట్లాండ్ జట్టుపై 150 పరుగుల తేడాతో భారీ విజయాన్ని నమోదు చేసుకొని సెమీస్‌కు చేరింది.

త్రిష జోరు కొనసాగాలని..

సూపర్ సిక్స్ దశలో స్కాట్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో తెలుగమ్మాయి త్రిష గొంగడి అద్భుత బ్యాటింగ్‌తో అలరించింది. అండర్-19 టి20 ప్రపంచకప్ చరిత్రలో తొలి సెంచరీ చేసిన బ్యాటర్‌గా చరిత్ర లిఖించింది. స్కాట్లాండ్ జట్టుపై 59 బంతుల్లోనే 110 పరుగులు చేసింది. ఇందులో 13 ఫోర్లు, నాలుగు సిక్సర్లు ఉన్నాయి. మరో ఓపెనర్ జీ కమలినీ సైతం 42 బంతుల్లో 51 పరుగులతో రాణించింది. టోర్నీలోని ఐదు మ్యాచుల్లో త్రిష 76.66 సగటుతో 230 పరుగులు చేసింది. మరోవైపు భారత్ బౌలర్లు అద్భుత ప్రదర్శనతో రాణిస్తున్నారు. స్కాట్లాండ్‌పై ఆయుషి శుక్లా ఎనిమిది పరుగులు ఇచ్చి నాలుగు వికెట్లు పడగొట్టింది. వైష్ణవి శర్మ ఐదు పరుగులు ఇచ్చి మూడు వికెట్లు, గొంగడి త్రిష ఆరు పరుగులు ఇచ్చి మూడు వికెట్లు పడగొట్టారు. వైష్ణవి టోర్నీలో ఇప్పటి వరకు 12 వికెట్ల తీయగా.. ఆయుషి పది వికెట్ల పడగొట్టింది.

జట్లు...

భారత్: నిక్కీ ప్రసాద్(కెప్టెన్), సానికా చల్కే, త్రిష, కమలిని, భావికా అహిరే, ఈశ్వరి, మిథిలా, జోషితా వీజే, సోనమ్ యాదవ్, పరుణికా సిసోడియా, కేసరి ధృతి, ఆయుషి శుక్లా, ఆనందిత కిషోర్, వైష్ణవ్, షబ్నం.

ఇంగ్లండ్: నార్గ్రోవ్(కెప్టెన్), బ్రెట్, ఒలివియా బ్రిస్టేన్, కోల్‌మన్, జాన్సన్, కేటీ జోన్స్, షార్లెట్ లాంబార్ట్, ఈవ్ ఓనీల్, దేవినా పెర్రిన్, జెమిమా స్పెన్స్, షార్లెట్ స్టబ్స్, అమృతా సురెన్‌కుమార్, ప్రిషా థానవాలా, ఎరిన్ థామస్, గ్రా థానవాలా.

ట్రయథ్లాన్‌లో సత్తా చాటిన మహారాష్ట్ర

- రెండేసి స్వర్ణ, రజత పతకాలు
- 38వ జాతీయ క్రీడలు

డెహ్రాడూన్: 38వ జాతీయ క్రీడల్లో మహారాష్ట్ర అథ్లెట్లు సత్తా చాటారు. రెండోరోజైన గురువారం ట్రయథ్లాన్ విభాగంలో మహారాష్ట్రకు రెండు స్వర్ణ పతకాలతోపాటు మరో రెండు రజత పతకాలు దక్కాయి. అలాగే మరో రెండు కాంస్య పతకాలు చేజిక్కించుకొని ఆ జట్టు ఏకంగా 8 పతకాలతో పట్టికలో మూడోస్థానానికి ఎగబాకింది. ట్రయథ్లాన్(వ్యక్తిగత) విభాగంలో మహారాష్ట్రకు ఇప్పటికే ఒక రజత, ఒక కాంస్యాలు ఖాయమయ్యాయి. పురుషుల విభాగంలో పార్థ్ సచిన్ మిరాజ్ కాంస్యం పతకం ఖాయం చేయగా.. మహిళల విభాగంలో డాలీ దేవదాస్ పాటిల్-మాన్సీ వినోద్ స్వర్ణ, రజత పతకాలను అందించారు. ఇక ఆతిథ్య రాష్ట్రమైన ఉత్తరాఖండ్ జట్టుకు ఉషులో స్వర్ణ పతకాన్ని లభించింది. రెండోరోజు పోటీల్లో మధ్రప్రదేశ్ మూడు పతకాలను కొల్లగొట్టింది. వ్యక్తిగత ట్రయథ్లాన్‌లో మణిపూర్, మిక్స్‌డ్ రిలేలో తమిళనాడు జట్లకు కాంస్య పతకాలు దక్కాయి. ఇక సర్వీసెస్ జట్టు డ్వాథ్లాన్‌లో రజత, కాంస్యాలను చేజిక్కించుకుంది.

పతకాల పట్టిక

రాష్ట్రం	స్వ	ర	కా	మొ
1. కర్ణాటక	5	2	0	7
2. మణిపూర్	4	4	0	8
3. మహారాష్ట్ర	2	3	3	8
4. సర్వీసెస్	2	1	0	3
5. తమిళనాడు	1	1	2	4
6. ఢిల్లీ	0	2	1	3
7. మధ్యప్రదేశ్	0	1	1	2
8. కేరళ	0	0	2	2
9. ఒడిషా	0	0	1	1
10. ఉత్తరాఖండ్	0	0	1	1
11. బీహార్	0	0	1	1
12. గుజరాత్	0	0	1	1
13. పశ్చిమబెంగాల్	0	0	1	1

ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభోత్సవ వేడుకలు లేనట్లే..?

దుబాయ్: పాకిస్తాన్ వేదికగా జరిగే ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభోత్సవ వేడుకలను రద్దు చేసినట్లు సమాచారం. ఈ విషయాన్ని పాకిస్తాన్ క్రికెట్‌బోర్డు(పిసిబి) అధికారికంగా ధృవీకరించకున్నా.. ఐసిసి అధికారి ఒకరు గురువారం మాట్లాడుతూ.. ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభోత్సవ వేడుకలు, కెప్టెన్ల ఫొటో షూట్ కార్యక్రమాలు రద్దయినట్లు స్పష్టం చేశారు. 2008 తర్వాత పాకిస్తాన్ గడ్డపై భారత కెప్టెన్ అడుగుపెడతాడా? లేదా అనే సందేహాలకు సమాధానం దొరికినట్లేనని ఆ అధికారి తెలిపారు. 2011లోనే చివరిసారిగా ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభోత్సవ వేడుకలు జరిగాయని, ఆ తర్వాత ఏ ఛాంపియన్స్ ట్రోఫీలోనూ ఈ వేడుకలు జరగని కారణంగా ఈసారి జరగడం కష్టమేనని ఆ అధికారి తెలిపారు.

ఇక్కడే సిరీస్ కొట్టేయాలి..!

- నేడు ఇంగ్లండ్‌తో నాల్గో టి20
- రాత్రి 7.00గం॥ల నుంచి

పూణే: తొలి రెండు టి20ల్లో నెగ్గి రాజ్‌కోట్ టి20 నెగ్గి సిరీస్ కొట్టేయాలన్న టీమిండియా ఆశలపై ఇంగ్లండ్ నీళ్లు చల్లింది. ఈ ఫార్మాట్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న టీమిండియాకు రాజ్‌కోట్ టి20లో ఇంగ్లండ్ ఝలక్ ఇచ్చింది. మూడో టి20లో ఇంగ్లండ్‌చేతిలో 26పరుగుల తేడాతో ఓడిన టీమిండియా.. పూణె వేదికగా జరిగే నాల్గో టి20లో నెగ్గి ఐదు టి20ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే ముగించాలన్న ఉత్సాహంతో బరిలోకి దిగుతోంది. కోల్‌కతా, చెన్నై మ్యాచుల్లో ఘన విజయం సాధించిన టీమిండియా.. సిరీస్‌ను కైవసం చేసుకోవాలనే కృతనిశ్చయంతో నాల్గో టి20కి సిద్ధమైంది. మరో వైపు ఇంగ్లండ్ జట్టు మూడో మ్యాచ్‌లో గెలిచిన ఉత్సాహంతో ఈ మ్యాచ్‌కు సిద్ధమైంది. రాజ్‌కోట్‌లో ఛేదనలో తడబడ్డ టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్.. గత 17 ఇన్నింగ్స్‌లో భారీ స్కోర్ చేసిన దాఖలాలు లేవు. ఐదు టి20ల సిరీస్‌లో భారత్ 2-1తో ఆధిక్యతలో ఉన్న సంగతి తెలిసిందే.

జట్లు(అంచనా):

భారత్: సూర్యకుమార్(కెప్టెన్), సంజు(వికెట్ కీపర్), అభిషేక్, తిలక్ వర్మ, హార్దిక్, అక్షర్, సుందర్, జురెల్/రమణ్ దీప్, అర్ష్‌దీప్, బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి.

ఇంగ్లండ్: బట్లర్(కెప్టెన్), డకెట్, సాల్ట్(వికెట్ కీపర్), బ్రూక్, లివింగ్‌స్టోన్, స్మిత్, ఓవర్టన్, కర్సే, ఆర్చర్, రషీద్, వుడ్.

మీరు కూడా సాయం చేయండి

సాయి దుర్గ తేజ్

హీరో సాయి దుర్గ తేజ్ సోషల్ మీడియా ద్వారా సహాయం కోరిన వారికి తన వంతు సహాయం చేస్తుంటాడు. తాజాగా కాలేయ సమస్యతో బాధపడుతున్న ఓ చిన్నారికి సాయం చేశాడు. తనతోపాటు ఆ పాపకి మరికొందరు సాయం చేయాలని సోషల్ మీడియా ద్వారా అభ్యర్థించాడు. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ ఎమోషనల్ నోట్ షేర్ చేశాడు. 'హయా అనే అమ్మాయి కాలేయ వ్యాధితో బాధపడుతోంది. ప్రస్తుతం ఆ పాప జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటోంది. నా వంతుగా నేను తన ట్రీట్‌మెంట్ కోసం సాయం చేశాను. దయచేసి మీరు కూడా ఎంతో కొంత డబ్బు సహాయంగా అందించండి. ప్లీజ్ మీరు చేసే సాయం వల్ల ఆ పాప ప్రాణాలతో ఉంటుంది. ప్రతి డొనేషన్ చాలా ముఖ్యమైనది. ఆమె ఓ పోరాట యోధురాలు. మీరు సహాయం చేయడం వల్ల ఆ పాప సమస్య నుంచి బయటపడుతుంది' అని పోస్ట్‌లో పేర్కొన్నారు.

ఆ లావాదేవీలు తమిళ భాషలో ఇవ్వండి

ఆర్థిక లావాదేవీల్లో ఎంతో కీలకమైన శాశ్వత ఖాతా సంఖ్య (పాన్) కార్డుకు సంబంధించి కొన్ని మార్పులు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని విజయ్ సేతుపతి అభ్యర్థించారు. పాన్ కార్డుకు సంబంధించిన సమాచారం, అప్‌డేట్‌లను తమిళంలోనూ అందుబాటులో ఉంచాలని ఆయన కోరారు. తాజాగా ఓ ఈవెంట్‌లో విజయ్ సేతుపతి మాట్లాడారు. 'పాన్ కార్డు వివరాలు ప్రస్తుతం హిందీ, ఇంగ్లీష్ భాషల్లో మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీని వల్ల ఈ భాషలు రాని వారు పాన్ కార్డు అప్‌డేట్‌ల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమిళ భాషను యాడ్ చేయడం కష్టమైనప్పటికీ ప్రయత్నించాలి. పాన్ కార్డు వెబ్‌సైట్‌లో తమిళంలో సమాచారం అందుబాటులో ఉంటే అది మరింత ఎక్కువమందికి చేరుతుంది' అని విజయ్ సేతుపతి అన్నారు. భాషతో సంబంధం లేకుండా పౌరులందరికీ అవసరమైన ఆర్థిక సమాచారాన్ని సులభంగా యాక్సెస్ చేసేలా పాన్‌కార్డు సంబంధిత అప్‌డేట్‌లను బహుళ భాషల్లో అందుబాటులో ఉండేలా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68